


# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




నేడు మూడు జిల్లాల్లో
సీఎం చంద్రబాబు పర్యటన

4

డ్రగ్స్‌కు దూరంగా ఉండండి

- యువతకు మంత్రి లోకేష్ పిలుపు

7




# 'మత్తు'పై ఇక యుద్ధం!



- గంజాయి, డ్రగ్స్‌పై కఠినమైన చర్యలు
- మాదక ద్రవ్యాలు విక్రయిస్తే ఆస్తుల జప్తు
- ప్రజా పోలీసింగ్‌తో డ్రగ్స్‌రహిత రాష్ట్రంగా ఏపీ
- ప్రపంచస్థాయి ప్రమాణాలతో డీ-అడిక్షన్ కేంద్రాలు
- సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లూయెన్సర్లూ.. భాగస్వాములవ్వండి
- గుంటూరులో 'డ్రగ్స్ వద్దు బ్రో' పేరిట వాకథాన్
- సదస్సుకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- 'మత్తు'పై ఫిర్యాదులకు వాట్సప్, టోల్ ఫ్రీ నెంబర్ల ఆవిష్కరణ
- వాట్సాప్ నెంబర్: 8977781972, టోల్ ఫ్రీ నెంబర్: 1972

2

## రూ.25 వేల కోట్ల పెట్టుబడులు లక్ష్యం



- ఆకర్షణీయంగా ఆంధ్రప్రదేశ్ స్పేస్ పాలసీ 4.0
- ప్రత్యక్షంగా 5వేలు, పరోక్షంగా 30వేల మందికి ఉపాధి
- లేపాక్షి, తిరుపతిలో స్పేస్ సిటీల ఏర్పాటు
- 25 నుంచి 45 శాతం వరకు పెట్టుబడి రాయితీలు
- విద్యార్థులను భాగస్వాములు చేసేలా ప్రణాళికలు
- తుది పాలసీ రూపకల్పనపై సీఎం చంద్రబాబు సమీక్ష

4

డబుల్ ఇంజిన్ సర్కార్‌తో..

## ఏపీలో అభివృద్ధి పరుగులు



- కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఉద్ఘాటన
- రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన

6

విశాఖ వస్తున్నాం..!

## కాగ్నిజెంట్ ప్రకటన

- రూ.1583 కోట్ల పెట్టుబడి, 8 వేల ఉద్యోగాలు
- సహకరించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు సంస్థ సీఈఓ కృతజ్ఞతలు
- ఇప్పటికే సాగర నగరంలో టీసీఎస్ క్యాంపస్
- మంత్రి లోకేష్ కృషితో ఐటీ హబ్‌గా విశాఖ

5




మూలధన వ్యయానికి

## ప్రాధాన్యత

ఆర్థిక శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



4

## విశాఖ ఐటీకి మణిహారం కాగ్నిజెంట్

- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు
- మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి



7

## జలరవాణాకు ల్యాండ్ మార్క్‌గా ఏపీ

- రోడ్డు, రైల్ రవాణా కంటే తక్కువ ఖర్చు
- 16 మిలియన్ టన్నుల ఎగుమతి లక్ష్యం
- రోడ్లు, భవనాల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

- వివరాలు 7 లో..



# 'మత్తు'పై ఇక యుద్ధం!

- గంజాయి, డ్రగ్స్‌పై కఠినమైన చర్యలు
- మాదక ద్రవ్యాలు విక్రయిస్తే ఆస్తుల జప్తు
- ప్రజా పోలీసింగ్‌తో డ్రగ్స్‌రహిత రాష్ట్రంగా ఏపీ
- ప్రపంచస్థాయి ప్రమాణాలతో డీ-అడిక్షన్ కేంద్రాలు
- సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లూయెన్సర్లూ.. భాగస్వాములవ్వండి
- గుంటూరులో 'డ్రగ్స్ వద్దు బ్రో' పేరిట వాకథాన్
- సదస్సుకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- 'మత్తు'పై ఫిర్యాదులకు వాట్సప్, టోల్ ఫ్రీ నెంబర్ల ఆవిష్కరణ
- వాట్సాప్ నెంబర్: 8977781972, టోల్ ఫ్రీ నెంబర్: 1972




అమరావతి (చైతన్య రథం): అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ నినదించింది. డ్రగ్స్,గంజాయిపై ముఖ్యమంత్రి చంద్రబాబు యుద్ధం ప్రకటించారు. ఈ యుద్ధానికి ఎవరైనా అడ్డొస్తే తొక్కుకుంటూ వెళ్తామని హెచ్చరించారు. గుంటూరులో ఫీవర్ ఆస్పత్రి జంక్షన్‌నుంచి మిర్చి దాబావరకు గంజాయి,డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. విద్యార్థినీ విద్యార్థులతో కలిసి 'డ్రగ్స్ వద్దు బ్రో' బ్యానర్ పట్టుకుని వాకథాన్ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఏపీని మాదక ద్రవ్యరహిత రాష్ట్రంగా మారుద్దామంటూ ప్రతిజ్ఞ చేశారు. నిషా ముక్త్ భారత్ అభియాన్ కింద చేపట్టిన కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. యువతను గంజాయి, డ్రగ్స్‌కు బానిస చేసి... సమాజాన్ని పీడిస్తున్న మాఫియాను తరిమేద్దామని సీఎం చంద్రబాబు భావోద్వేగంగా పిలుపునిచ్చారు.

## రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తే ఆస్తుల జప్తే

సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు డ్రగ్స్ నివారణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. "అమరావతిలో క్వాంటం వ్యాలీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ గురించి మాట్లాడుతున్నాం. ప్రపంచంతో పోటీపడాల్సి ఉంది. ఈ తరహా సమస్యలు పెరిగితే ఇబ్బందులు వస్తాయి. గంజాయి రవాణ, సాగు చేసే వారికి అల్టిమేటం జారీ చేస్తున్నా. సాగుచేసినా, బయటినుంచి తీసుకువచ్చి విక్రయించినా సహించేది లేదు. ఏజెన్సీ ఏరియాలో గంజాయి సాగు చేసే వారికి ప్రత్యామ్నాయాలు చూపాం. ఇంకా అదే పని చేస్తామంటే చూస్తూ ఊరుకోం. టెక్నాలజీతో డ్రోన్లు వినియోగించి నేర నియంత్రణ చేస్తున్నాం. సీసీ టీవీ కెమెరాలతో నేరాలు జరగకుండా చూస్తున్నాం. కేసులు పెట్టడమే కాదు.. గంజాయి, డ్రగ్స్ విక్రయించిన వారి ఆస్తులు కూడా జప్తు చేస్తాం. జప్తు చేసిన ఆస్తులనుంచి వచ్చిన ఆదాయంతో డ్రగ్స్ వ్యతిరేక కార్యక్రమాలకు.. అవగాహన కల్పించేందుకు వినియోగిస్తాం" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

## డ్రగ్స్, గంజాయి సమస్య కూటమికి వారసత్వంగా వచ్చింది

గత ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని చంద్రబాబు గుర్తు చేశారు. "వైసీపీ హయాంలో డ్రగ్స్‌కు నిలయంగా రాష్ట్రం మారిపోయింది. విశాఖ కేంద్రంగా గంజాయి రవాణా చేశారు. ఆంధ్రా బ్రాండ్‌ను దెబ్బ తీశారు. గత ముఖ్యమంత్రి ఒక్కరోజు కూడా మాదక ద్రవ్యాల నివారణను సమీక్షించిన పాపాన పోలేదు. గంజాయికి వ్యతిరేకంగా ఎలాంటి కార్యక్రమమూ చేపట్టలేదు. డ్రగ్స్‌గురించి పోరాడితే కేసులు పెట్టారు. టీడీపీ కార్యకర్తలపై దాడులు చేశారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల గంజాయి, డ్రగ్స్ సమస్య కూటమి ప్రభుత్వానికి వారసత్వంగా వచ్చింది. కష్టనష్టాలను ఎదుర్కొంటూ రాష్ట్రాన్ని బాగుచేసే బాధ్యతను తీసుకున్నాం. రాజకీయాల్లో ఉండే వ్యక్తులు ఆదర్శంగా ఉండాలి. కానీ గంజాయి బ్యాచ్, రౌడీ షీటర్లతో మాజీ సీఎం చెట్టపట్టాలు వేసుకుని తిరుగుతున్నారు. వారిని ప్రోత్సహిస్తున్నారు, పరామర్శిస్తున్నారు. రాజకీయ ముసుగు వేసుకుంటే దాన్ని తొలగించి కట్టడి చేస్తాం. గంజాయి విక్రయించేవారిని.. వారికి సహకరించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తాం. గంజాయి నిర్మూలనకు ప్రతిపక్షాలూ ముందుకు రావాలి. ప్రజలకు మంచిచేసి ఓట్లు వేయించుకోవాలి. అంతే కానీ.. గంజాయి బ్యాచ్‌ను సపోర్టు చేస్తూ తప్పుడు కార్యక్రమాలు చేయొద్దు" అని ముఖ్యమంత్రి హితవు పలికారు.

## మత్తులో మృగాలుగా మారుతున్నారు

గంజాయి, డ్రగ్స్‌బారిన పడి యువత నిర్వీర్యమవుతుందని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. "గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడితే తీవ్ర అనారోగ్య సమస్యలతోపాటు మనిషి మృగంగా మారతాడు. గంజాయి, డ్రగ్స్ సేవించే వ్యక్తులు సమాజానికి, తల్లితండ్రులకు పెద్ద సమస్యగా మారతారు. పిల్లలు, తల్లులు, చెల్లెళ్లపైనా దాడులు చేస్తున్నారు. మూడేళ్ల పసికందులపైనా మానవ మృగాల్లా అత్యాచారాలకు పాల్పడుతున్నారు. వీళ్లను ఎలా క్షమిస్తాం.? ఆడబిడ్డల జోలికి వస్తే వారికి అదే చివరి రోజు అవుతుంది. 2047కి తెలుగు జాతి నెంబర్ వన్‌గా ఉండాలన్నదే నా ఆకాంక్ష. అందుకే ఇప్పటినుంచే గంజాయివంటి సమస్యల్ని పరిష్కరించుకుని ముందడుగు వేయాలి" అని సీఎం చంద్రబాబు ఉద్బోధించారు.

## మత్తునుంచి యువతను బయటకు తెస్తా

రాష్ట్రంలో మాదక ద్రవ్యాలబారిన పడిన యువతను బయటకు తెచ్చేలా కార్యాచరణ చేపట్టామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. "దేశంలో ఉత్పత్తి అవుతున్న గంజాయిలో ఒడిశా, ఏపీలోనే 50 శాతం సాగవుతోంది. గత ప్రభుత్వ నిర్వాకంవల్ల గంజాయికి కేంద్రంగా విశాఖ ఉండటం అత్యంత బాధాకరం. మద్యం విక్రయాల ద్వారా వచ్చిన ఆదాయంలో 2 శాతాన్ని మాదకద్రవ్యాల నియంత్రణకు ఖర్చు చేస్తున్నాం. మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచారం పెద్దఎత్తున చేపట్టాం. విశాఖ, రాజమహేంద్రవరం, గుంటూరు, తిరుపతిలలో ఎన్డీపీఎస్ కేసుల కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు పెడుతున్నాం. అన్ని జిల్లాల్లోనూ నార్కోటిక్స్ కంట్రోల్ సెంటర్లు పెట్టాం. పాఠశాలల్లో ఈగల్ క్లబ్బులు ఏర్పాటు చేశాం. ప్రపంచస్థాయి ప్రమాణాలతో మూడు ప్రాంతాల్లో డీ-అడిక్షన్ సెంటర్లతో పాటు.. రాష్ట్రంలో 56 డీ అడిక్షన్ సెంటర్లు పెడుతున్నాం. గంజాయి నివారణకు ప్రజలూ సహకరించాలి. సెలబ్రిటీలు కూడా వీటికి వ్యతిరేకంగా ప్రజాచైతన్యం కోసం ప్రచారం చేయాలి. కోదాడవద్ద జరిగిన ఓ ఘటనలో ఓ తల్లిపడిన ఆవేదన చాలా బాధ కలిగించింది" అని చంద్రబాబు అన్నారు.

## డ్రగ్స్, గంజాయిపై ఫిర్యాదులకు వాట్సాప్, టోల్ ఫ్రీ నెంబర్లు

మత్తుపదార్థాలను అరికట్టేందుకు ప్రభుత్వం, పోలీసులు బాధ్యత తీసుకోవడమే కాదని.. దీనికి ప్రజా మద్దతు కూడా అవసరమని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రజా పోలీసింగ్ ద్వారానే డ్రగ్స్, గంజాయిని రాష్ట్రంనుంచి తరిమి కొట్టగలమని స్పష్టం చేశారు. డ్రగ్స్ నియంత్రణకు ఏర్పాటు చేసిన ఈగిల్ టాస్క్ ఫోర్సు ఫిర్యాదుల కోసం వాట్సాప్, టోల్ ఫ్రీ నెంబర్లను అందుబాటులోకి తెచ్చింది. ఈ టోల్ ఫ్రీ, వాట్సాప్ నెంబరును ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. టోల్ ఫ్రీ నెంబరు 1972, వాట్సాప్ నెంబరు 8977781972లను సీఎం విడుదల చేశారు. ఈ నెంబర్లకు సమాచారం అందించి డ్రగ్స్ ఫ్రీ ఆంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని సీఎం పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాలనివారణకు పనిచేసిన వివిధవ్యక్తులు,స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులను చంద్రబాబు సత్కరించారు.





చైతన్యరథం





















# రూ.25 వేల కోట్ల పెట్టుబడులు లక్ష్యం

- ఆకర్షణీయంగా ఆంధ్రప్రదేశ్ స్పేస్ పాలసీ 4.0
- ప్రత్యక్షంగా 5వేలు, పరోక్షంగా 30వేల మందికి ఉపాధి
- లేపాక్షి, తిరుపతిలో స్పేస్ సిటీల ఏర్పాటు
- 25 నుంచి 45 శాతం వరకు పెట్టుబడి రాయితీలు
- విద్యార్థులను భాగస్వాములు చేసేలా ప్రణాళికలు
- తుది పాలసీ రూపకల్పనపై సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి సీఎం క్యాంప్ కార్యాలయంలో స్పేస్ పాలసీపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు నాయుడు.

అమరావతి (చైతన్య రథం): స్పేస్‌రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రపథాన నిలపడంతోపాటు, రూ.25 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించేలా ఆంధ్రప్రదేశ్ స్పేస్ పాలసీ 4.0ని తీర్చిదిద్దాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. పెట్టుబడుల లక్ష్యం నెరవేరితే ప్రత్యక్షంగా 5వేలమందికి, పరోక్షంగా 30 వేలమందికి ఉపాధి కలుగుతుందన్నారు. లేపాక్షి, తిరుపతిలో స్పేస్ సిటీ ఏర్పాటుకు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి... 2025 -2035 కాలానికి సంబంధించి స్పేస్‌రంగంలో వ్యూహాత్మక లక్ష్యాలను నిర్దేశించారు. గురువారం ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ స్పేస్ పాలసీ 4.0పై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యాసంస్థలను ఇందులో భాగస్వాములు చేయడం ద్వారా విద్యార్థులు ఈ రంగంవైపు ఆకర్షితులయ్యేలా చూడాలని సీఎం అన్నారు. అలాగే ప్లగ్ అండ్ ప్లే విధానంలో వినియోగించుకునేలా కామన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కల్పించాలని, ఇందుకోసం టెక్నికల్ కమిటీని నియమించాలని ఆదేశించారు. కమ్యూనికేషన్ రంగంలో అగ్రస్థానంలో ఉన్న సంస్థలను ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆహ్వానించాలని సూచించారు. ఎలక్ట్రానిక్స్, స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్, డ్రోన్లకు సంబంధించి టెక్నాలజీ అనుసంధానం జరగాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

### భవిష్యత్ అంతా స్పేస్ రంగానిదే

సమీక్షలో ఆంధ్రప్రదేశ్ స్పేస్ టెక్నాలజీ గౌరవ సలహాదారు, ఇస్రో మాజీ చైర్మన్ సోమనాథ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. స్పేస్ విజన్ పాలసీ-2047 కింద కేంద్ర ప్రభుత్వం పలు కీలక ప్రాజెక్టులు చేపడుతోందని... అలాగే స్టార్ లింక్, స్పేస్ ఎక్స్, బ్లూ ఆరిజన్‌వంటి ప్రైవేట్ ఆపరేటర్లు ఈ రంగంలో సంచలనాలు సృష్టిస్తున్నారని... భవిష్యత్ అంతా స్పేస్ రంగానిదేనని సోమనాథ్ ముఖ్యమంత్రికి నివేదించారు.

### 45శాతం వరకు రాయితీలకు ప్రతిపాదనలు

స్పేస్‌రంగంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే సంస్థలకు మరింత మెరుగ్గా పెట్టుబడి రాయితీ ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. రూ.కోటి నుంచి రూ.2.5 కోట్ల వరకు మైక్రో, రూ.2.5 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకు స్మాల్, రూ.25 కోట్లనుంచి రూ.125 కోట్ల వరకూ మీడియం, రూ.125 కోట్లనుంచి రూ.500 కోట్ల వరకు లార్జ్ కేటగిరీలుగా పెట్టుబడులను విభజించారు. రూ.500 కోట్లకన్నా ఎక్కువ పెట్టుబడులను మెగా కేటగిరీ కింద పరిగణిస్తారు. 25శాతం నుంచి 45శాతం వరకూ పెట్టుబడి రాయితీ ఇచ్చేలా ప్రతిపాదనలను అధికారులు ముఖ్యమంత్రి ముందుంచారు. అలాగే ఇందులో మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించే అంశంపైనా సమీక్షలో చర్చించారు.

**టెక్నాలజీకి లేపాక్షి స్పేస్ సిటీ:** రాష్ట్రంలో రెండు స్పేస్ సిటీలు నిర్మించాలని కొత్తపాలసీలో నిర్దేశించారు. 500 ఎకరాల్లో ఏర్పాటు కానున్న లేపాక్షి స్పేస్ సిటీలో డిజైన్ అండ్ డెవలప్మెంట్‌కు ప్రాధాన్యత ఇస్తారు. ఆర్ అండ్ డి, స్పేస్ స్టార్టప్, ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్, స్పేస్ అప్లికేషన్లు-సేవలకు సంబంధించి సంస్థలు ఏర్పాటు కానున్నాయి.

**తయారీ రంగానికి తిరుపతి స్పేస్ సిటీ:** తిరుపతి స్పేస్ సిటీని మాన్యుఫ్యాక్చరింగ్, లాంచ్ లాజిస్టిక్ సేవలు అందించే సంస్థల ఏర్పాటుకు కేటాయించారు. ఇక్కడ లాంచ్ వెహికల్ అసెంబ్లీ, శాటిలైట్- పేలోడ్ అసెంబ్లీ, మెకానికల్ సిస్టమ్- కాంపొనెంట్ మాన్యుఫాక్చరింగ్, ఎలక్ట్రానిక్-ఏవియానిక్స్ అసెంబ్లీ సంస్థలకే ఈ సిటీలో అవకాశం కల్పిస్తారు. బెంగళూరుకు సమీపంలో లేపాక్షి స్పేస్ సిటీ; శ్రీహరికోట-చెన్నయ్‌కు సమీపంలో తిరుపతి స్పేస్ సిటీ ఉండటం కలిసొచ్చే అంశం. తిరుపతి స్పేస్ సిటీ నుంచి -శ్రీహరికోటకు రోడ్ కనెక్టివిటీపైనా ముఖ్యమంత్రి చంద్రబాబు పలు సూచనలు చేశారు.

### గ్లోబల్ స్పేస్ ఎకానమీలో 2శాతం వాటా

గ్లోబల్ స్పేస్ ఎకానమీలో ప్రస్తుతం భారతదేశం కేవలం 2 శాతం వాటా కలిగి ఉంది. ఈ రంగంలో 2033నాటికి 44 బిలియన్ డాలర్ల పెట్టుబడులు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇండియా స్పేస్ పాలసీ-2023... 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతిస్తోంది. ఇండియా స్పేస్ విజన్-2047 కింద... శాటిలైట్ల తయారీ, రిమోట్ సెన్సింగ్ శాటిలైట్ల లాంచింగ్, చంద్రయాన్ 4, వీనస్ ఆర్బిటరీ మిషన్, మార్స్ ల్యాండర్ మిషన్, హ్యూమన్ స్పేస్ ఫ్లయిట్-స్పేస్ స్టేషన్, నెక్ట్స్ జెనరేషన్ లాంచ్ వెహికల్ (ఎన్జీఎల్వీ), శ్రీహరికోటలో 3వ లాంచ్ ప్యాడ్ నిర్మాణం వంటివి లక్ష్యాలు. 2040కల్లా చంద్రుడిపై మనిషి అడుగుపెట్టాలనేది ఆశయం. కేంద్ర లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం 'ఆంధ్రప్రదేశ్ స్పేస్ పాలసీ 4.0'ను రూపొందిస్తోంది.

# మూలధన వ్యయానికి ప్రాధాన్యత

## ఆర్థిక శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి (చైతన్య రథం): రాష్ట్ర ఆర్థికశాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం సమీక్ష నిర్వహించారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక శాఖ అధికారులతో గురువారం సమావేశమైన సీఎం చంద్రబాబు, ఆర్థిక శాఖ స్థితిగతులు, రాబడులు, ఖర్చులపై సమగ్ర వివరాలు అడిగితెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల ఖర్చు, నిధుల విడుదలపై చర్చించారు. పింఛన్లు సహా సంక్షేమ కార్యక్రమాలకు ప్రతినెలా వెచ్చిస్తున్న ఖర్చుతో పాటు.... రానున్న రోజుల్లో వివిధ పథకాల అమలు, అభివృద్ధి పనులకు ఖర్చు చేయాల్సిన నిధులపై సమీక్షించారు. ఆయా కార్యక్రమాల అమలుకు అవసరమైన నిధుల లభ్యతపైనా చర్చించారు. నాబార్డు నుంచి నిధులు సమీకరించి పంచాయతీ రాజ్ శాఖపై ఎక్కువ ఖర్చు చేయాలని సీఎం ఈ సందర్భంగా సూచించారు. కేంద్రం వివిధ కార్యక్రమాల కింద ఇచ్చే నిధులను మూలధన వ్యయానికి ఖర్చు చేయాలని సీఎం అన్నారు. సంక్షేమ పథకాలతో పాటు... సంపద సృష్టికి, రెవెన్యూ జనరేషన్‌కు కారణమయ్యే మూలధన వ్యయం మరింత పెంచాలని.. ఈ తరహా ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యతనివ్వాలని ఆర్థిక శాఖను సీఎం చంద్రబాబు ఆదేశించారు.

## నేడు మూడు జిల్లాల్లో

# సీఎం చంద్రబాబు పర్యటన

- విజయవాడలో జీఎఫ్ఎస్‌టీ టూరిజం కాంక్లేవ్,
- గుంటూరులో ఏఐ ఫర్ ఏపీ పోలీస్- హ్యాకథాన్‌కు హాజరు
- పల్నాడులో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ పరిశీలన



అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పర్యటించనున్నారు. ఉదయం 10.30కు విజయవాడలోని మురళీ ఫార్చ్యూనర్ హోటల్‌లో జరిగే జీఎఫ్ఎస్‌టీ టూరిజం కాంక్లేవ్‌లో పాల్గొంటారు. ఈ కార్యక్రమం తర్వాత మధ్యాహ్నం 2.45 గంటలకు గుంటూరు బయలుదేరుతారు. మధ్యాహ్నం 3.00 గంటలకు గుంటూరులోని ఆర్‌వీఆర్ మరియు జేసీ కాలేజీలో నిర్వహించే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫర్ ఏపీ పోలీస్ - హ్యాకథాన్ 2025 కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం పల్నాడు జిల్లా ఎడ్లపాడు మండలం కొండవీడు గ్రామానికి వెళ్తారు. అక్కడ జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను పరిశీలిస్తారు. సాయంత్రం 05.45 గంటలకు ఉండవల్లి నివాసానికి చేరుకుంటారు.

# కాగ్నిజెంట్‌కు వెల్కమ్!

## విశాఖలో కొత్త క్యాంపస్ ఏర్పాటు ప్రకటనపై సీఎం చంద్రబాబు

అమరావతి: విశాఖపట్నంలో నూతన ఐటీ క్యాంపస్ ఏర్పాటు చేయబోతున్నట్లు కాగ్నిజెంట్ చేసిన ప్రకటనపై సీఎం చంద్రబాబు ప్రతిస్పందించారు. 'మన యువకులు నిజంగా అసాధారణ ప్రతిభావంతులు. సాంకేతికతపై దృష్టి సారించి.. ప్రపంచాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నారు' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. విశాఖలోని కాపులుప్పాడలో 22 ఎకరాల్లో క్యాంపస్ ఏర్పాటు చేస్తున్నామని, నూతన క్యాంపస్‌లో సుమారు 8 వేల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని కాగ్నిజెంట్ సంస్థ ఎక్స్ వేదికగా ప్రకటిస్తూ.. కంపెనీ విస్తరణకు సహకరించిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపింది. కాగ్నిజెంట్ ట్వీట్‌కు సీఎం చంద్రబాబు ప్రతిస్పందిస్తూ.. 'ఇది పరస్పర వృద్ధికి ఒక అవకాశం. ఇది వ్యాపార ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్తుంది. మన రాష్ట్ర భవిష్యత్తును శక్తివంతం చేస్తుంది. విశాఖపట్నంలోని కాపులుప్పాడలోని అత్యాధునిక క్యాంపస్, ఆవిష్కరణ, ప్రతిభ, ప్రపంచ భాగస్వామ్యాలతో నడిచే స్వర్ణాంధ్ర అభివృద్ధికి గణనీయంగా దోహదపడుతుంది. విశాఖ పట్నానికి వస్తున్న కాగ్నిజెంట్‌కు స్వాగతం.. శుభాకాంక్షలు' అని పేర్కొన్నారు.



# విశాఖ వస్తున్నాం..!
# కాగ్నిజెంట్ ప్రకటన

- రూ.1583 కోట్ల పెట్టుబడి, 8 వేల ఉద్యోగాలు
- సహకరించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు సంస్థ సీఈఓ కృతజ్ఞతలు
- ఇప్పటికే సాగర నగరంలో టీసీఎస్ క్యాంపస్
- మంత్రి లోకేష్ కృషితో ఐటీ హబ్‌గా విశాఖ




అమరావతి (చైతన్యరథం): దావోస్‌లో ఈ ఏడాది జనవరిలో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) సదస్సులో మంత్రి నారా లోకేష్ చేసిన కృషికి ఫలితం దక్కింది. విశాఖలో ప్రపంచ స్థాయి ఐటీ దిగ్గజం 'కాగ్నిజెంట్' క్యాంపస్ ఏర్పాటు కాబోతోంది. విశాఖపట్నంలో కొత్త అత్యాధునిక క్యాంపస్‌ను ఏర్పాటు చేస్తున్నామని కాగ్నిజెంట్ సంస్థ గురువారం ఎక్స్‌లో ప్రకటించింది. విశాఖ ఐటీ హిల్స్‌లోని కాపులుప్పాడలో 22 ఎకరాల్లో విస్తరించే తమ కొత్త క్యాంపస్ 8,000 కొత్త ఉద్యోగాలను కల్పిస్తుందని, ప్రధానంగా ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ రంగాల్లో ఉద్యోగాలు సృష్టిస్తామని తెలిపింది. 2026 కల్లా కార్యకలాపాలు ప్రారంభించి 2029 నాటికి తొలిదశ పనులు పూర్తి చేస్తామని వెల్లడించింది. తమ సంస్థ ఏర్పాటుతో ప్రాంతీయ సాంకేతిక పర్యావరణ వ్యవస్థ మెరుగుపడుతుందని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్లయింట్‌లకు ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ రంగాల్లో అధునాతన సేవల సామర్థ్యాలను మరింత పెంచుతుందని తెలిపింది. కాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అసాధారణ ప్రతిభావంతులైన యువ సాంకేతిక నిపుణుల సేవలు తమ సంస్థకు ఎంతగానో ఉపకరిస్తాయని కాగ్నిజెంట్ సీఈఓ రవికుమార్ విశ్వాసం వ్యక్తం చేశారు. కాగ్నిజెంట్ విస్తరణకు పూర్తి సహకారం అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఈ సందర్భంగా రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

నారా లోకేష్ ప్లానింగ్‌కు ఫలితాలు ఎలా ఉంటాయనేది నిన్న టీసీఎస్, నేడు కాగ్నిజెంట్ రాకతో యావత్‌దేశానికి తెలిసింది. సీఎం చంద్రబాబుతో పాటు ఐటీ మంత్రి నారా లోకేష్ దావోస్ వెళ్లినప్పుడు నీలి మీడియాతో పాటు చాలామంది కుహనా మేధావులు ఎగతాళిగా మాట్లాడారు. ఆ విమర్శలను చిరునవ్వుతో స్వీకరించారు తప్ప.. లోకేష్ ఎక్కడా బయటపడలేదు. అప్పటికే ఆయన మనసులో భవిష్యత్‌పై పక్కా ప్రణాళిక రూపుదిద్దుకుని ఉంది. గడ్డ కట్టించే చలిలో కూడా ఆయన కంపెనీల అధినేతలతో చర్చలు జరిపి రాష్ట్రంలో ఉన్న అపార అవకాశాల గురించి స్పష్టంగా వివరించారు. దావోస్‌లో నారా లోకేష్ ఇచ్చిన ప్రజెంటేషన్, విజన్.. కాగ్నిజెంట్ పెద్దలను ఎంతగానో ప్రభావితం చేసింది. దాని ఫలితంగానే తమ తదుపరి గమ్యస్థానం ఏపీలోని విశాఖ నగరం అని ఆ సంస్థ ప్రకటించింది. రూ.1,583 కోట్లు పెట్టుబడితో కాపులుప్పాడ వద్ద 21.3 ఎకరాల విస్తీర్ణంలో 'కాగ్నిజెంట్' ఐటీ క్యాంపస్ ఏర్పాటు కాబోతోంది. నామమాత్రంగా ఎకరా 99 పైసలకే ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది.

### ఇప్పటికే టీసీఎస్...

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రూ.1,370 కోట్ల పెట్టుబడులతో 12,000 మందికి ఉద్యోగాలు కల్పించేలా విశాఖలో క్యాంపస్ ఏర్పాటుకు ప్రఖ్యాత ఐటీ సంస్థ టీసీఎస్ చేసిన ప్రతిపాదనలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. టీసీఎస్ విశాఖ రావటంలోనూ మంత్రి లోకేష్ కృషి ఎంతగానో ఉంది. ఈ కంపెనీకి కూడా ఎకరా 99 పైసలు చొప్పున దాదాపు 22 ఎకరాలు ప్రభుత్వం కేటాయించింది. టీసీఎస్, కాగ్నిజెంట్ ..ఈ రెండు కంపెనీల రాకతోనే 20,000 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఇన్ని వేలమంది ఉద్యోగులతో పాటు వారి కుటుంబాలు విశాఖకు తరలి వస్తే నగర విస్తరణ, ఆర్థిక కార్యకలాపాలు ఏ స్థాయిలో పెరుగుతాయో ఊహించుకోవచ్చు. కాగ్నిజెంట్ బాటలోనే రాబోయే రోజుల్లో మరిన్ని ఐటీ సంస్థలు విశాఖ తరలిరావటం ఖాయం. ఐటీ కంపెనీల రాకతో విశాఖ నగరం రూపురేఖలు మారిపోతాయని ఐటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## సన్‌రైజ్ స్టేట్‌కు స్వాగతం

**- కాగ్నిజెంట్‌కు మంత్రి లోకేష్ ధన్యవాదాలు**

అమరావతి (చైతన్యరథం): తమ భవిష్యత్తు కార్యకలాపాల విస్తరణకు విశాఖను ప్రధాన కేంద్రంగా ఎంచుకున్న కాగ్నిజెంట్ సంస్థకు ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ధన్యవాదాలు తెలిపారు.



ఈ మేరకు సన్‌రైజ్ రాష్ట్రానికి స్వాగతం అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రాష్ట్ర యువతలో విశ్వాసాన్ని పెంచేలా కాపులుప్పాడలో అత్యాధునిక కాగ్నిజెంట్ క్యాంపస్ ఏర్పాటవుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి ఆవిష్కరణల, ఉపాధి శక్తి కేంద్రంగా మార్చడానికి కట్టుబడి ఉన్నాం. మెరుగైన అవకాశాలు కల్పిస్తూ, వృద్ధిని పెంచుతూ ప్రజలకు ఉజ్వల భవిష్యత్తును రూపొందిస్తున్నాం. మరిన్ని మెరుగైన ఫలితాలు కోసం ఎదురు చూస్తున్నామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

## కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు మంత్రి లోకేష్ జన్మదిన శుభాకాంక్షలు

అమరావతి (చైతన్యరథం): కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జన్మదినం సందర్భంగా ఆయనకు రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. విద్య, నైపుణ్యాలు, ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన నిబద్ధత ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. భారతదేశ యువతకు సాధికారత కల్పించడంలో, కేంద్ర-రాష్ట్రాల మధ్య అర్థవంతమైన సహకారాన్ని పెంపొందించడంలో ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆయన దీర్ఘకాలం ఆరోగ్యంగా, ప్రభావవంతమైన జీవితాన్ని గడపాలని ఎక్స్‌లో మంత్రి లోకేష్ ఆకాంక్షించారు.

## స్టార్టప్ మహాకుంభ్ ఈవెంట్‌లో మంగళగిరి విద్యార్థి ప్రతిభ

- మహిళల ఆరోగ్యం కోసం స్మార్ట్ శానిటరీ ప్యాడ్ రూపకల్పన
- విద్యార్థి వనమా వంశీని అభినందించిన మంత్రి లోకేష్
- భవిష్యత్‌లో మరింత ప్రోత్సహిస్తామని హామీ



ఉండవల్లి (చైతన్యరథం): ఢిల్లీలో ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన స్టార్టప్ మహా కుంభ్ ఈవెంట్ లో మహిళల ఆరోగ్యం కోసం మాగ్నా ప్యాడ్స్ పేరుతో స్మార్ట్ శానిటరీ ప్యాడ్‌ను రూపొందించి విశేష ప్రతిభ కనబరిచిన మంగళగిరి విద్యార్థి వనమా వంశీని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అభినందించారు. ఉండవల్లి నివాసంలో మంత్రి లోకేష్‌ను గురువారం వంశీ కలిశారు. స్టార్టప్ మహాకుంభ్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని ఈ సందర్భంగా విద్యార్థి వంశీని మంత్రి లోకేష్ ప్రశంసించారు. భవిష్యత్‌లో అండగా ఉంటామని, అమరావతిలో ఏర్పాటు చేయబోయే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చారు.

జాతీయస్థాయిలో జరిగే స్టార్టప్ మహా కుంభ్ ఈవెంట్‌లో దాదాపు వెయ్యి కాలేజీలకు చెందిన విద్యార్థులు తమ ఆవిష్కరణలను ప్రదర్శిస్తారు. వడ్లమూడి విజ్ఞాన్ కాలేజీలో బీ-ఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వంశీ తన గైడ్ డాక్టర్ పి.శ్రీనివాస్ బాబు సాయంతో స్టార్టప్ మహా కుంభ్ ఈవెంట్‌కు హాజరై మహిళల ఆరోగ్యం కోసం తాను రూపొందించిన స్మార్ట్ శానిటరీ ప్యాడ్‌ను ఆవిష్కరించారు. తన వినూత్న ఆవిష్కరణతో రూ.8లక్షల నగదు బహుమతిని గెలుచుకుని సౌత్ ఇండియాలోనే ప్రథమంగా నిలిచాడు. వంశీ ఆవిష్కరణను ఇండియన్ జనరల్ ఆఫ్ పేటెంట్స్‌లో కూడా పబ్లిష్ చేశారు.

## రేవేంద్రపాడు విద్యార్థినికి మంత్రి లోకేష్ చేతుల మీదుగా ఆర్థికసాయం

- టెన్త్ ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన ఉమామహేశ్వరి
- మంగళగిరి నియోజకవర్గంలో మంత్రి లోకేష్ మెజార్టీతో రూ.91,413 చెక్కు అందజేత
- కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థిని

ఉండవల్లి (చైతన్యరథం): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థినికి మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా రేవేంద్రపాడు ఎంపీటీసీ కొప్పుల మధుబాబు రూ.91,413 ఆర్థికసాయం అందించారు. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు జడ్పీ హైస్కూల్‌లో చదివిన గంపా ఉమా మహేశ్వరి అనే విద్యార్థిని మొన్నటి పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 575 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. మండలంలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మంగళగిరి నియోజకవర్గంలో మంత్రి లోకేష్ సాధించిన మెజార్టీతో నగదు బహుమతి అందిస్తామని గతంలో ఇచ్చిన హామీ మేరకు ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా రూ.91,413 చెక్కును సదరు విద్యార్థినికి అందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన తనకు అండగా నిలవడం పట్ల మంత్రి లోకేష్, టీడీపీ నేత మధుబాబుకు విద్యార్థిని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.





## కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు
# అమరావతిలో మంత్రి లోకేష్ ఘన స్వాగతం

అమరావతి (చైతన్యరథం): రాజమహేంద్రవరం పర్యటన పూర్తి చేసుకొని అమరావతికి చేరుకున్న కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ ఘన స్వాగతం పలికారు. రాజమహేంద్రవరంలో జరిగిన అఖండ గోదావరి ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని రూ.94.44 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించిన కేంద్ర మంత్రికి లోకేష్ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి అందుతున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నారా లోకేష్ తన పాదయాత్ర "యువగళం" విశేషాలతో రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు బహూకరించారు.



# పోలీస్‌ల మరణం విషాదకరం

### రోడ్డు ప్రమాద ఘటనపై సీఎం చంద్రబాబు సానుభూతి

అమరావతి (చైతన్య రథం): విధి నిర్వహణలో హైదరాబాద్‌కు వెళ్తూ.. రోడ్డు ప్రమాదానికి గురై ఎస్ఐ, కానిస్టేబుల్ మృతిచెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ.. 'కేసు విచారణలో భాగంగా నిందితుల కోసం కారులో హైదరాబాద్ వెళ్తున్న ఏపీ పోలీసులు కోదాడ వద్ద రోడ్డు ప్రమాదానికి గురికావడం విషాదకరం. ఈ ప్రమాదంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు ఎస్ఐ ఎం అశోక్, కానిస్టేబుల్ బ్లెస్సన్ జీవన్‌లు మరణించడం కలచివేసింది. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తున్నాను. తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్ స్వామి, డ్రైవర్ రమేష్‌లకు అందుతున్న వైద్య సాయంపై అధికారులతో మాట్లాడాను. విధినిర్వహణలో మృతి చెందిన పోలీసుల కుటుంబాలకు, బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చాను' అని పేర్కొన్నారు.

# అటవీ ప్రాంత సంరక్షణకు శిక్షణ కేంద్రాలు



- 23 శాతం పచ్చదనం పెంపే లక్ష్యం
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్
- శాశ్వత భవనానికి శంకుస్థాపన

రాజానగరం(చైతన్యరథం): రాష్ట్రంలో 23 శాతం భూ భాగం పచ్చదనంతో కలిగి ఉండేలా చర్యలు తీసుకోవడంలో భాగంగా ముఖ్య మంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలో అటవీ ప్రాంతాల అభివృద్ధి దిశగా అడుగులు వేయడం జరుగుతుందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక దివాన్ చెరువు అటవీ శాఖ శిక్షణ కేంద్రంలో శాశ్వత భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. రాజమండ్రిలో తాత్కాలికంగా ఉన్న అటవీ అకాడమీ శిక్షణ కేంద్రం శాశ్వత భవనానికి రూ.18 కోట్లతో శంకు స్థాపన చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని 23శాతం వరకు పెంచాలనే సంకల్పంతో క్యాబినెట్‌లో ప్రత్యేకంగా నిర్ణయం తీసుకోవడం జరిగిందని చెప్పారు. అందులో భాగంగా తొలిదశలో అందులో 50 శాతం మేరకు లక్ష్యాలను సాధించేందుకు పకడ్బందీ కార్యాచరణ సిద్ధం చేయడం జరిగిందని వివరించారు. ఇందుకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అటవీ అధికారులకు, ఫ్రంట్ లైన్ సిబ్బందికి నైపుణ్య అభివృద్ధి శిక్షణ అకాడమి ముఖ్య ఉద్దేశంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ డి.నరసింహ కిషోర్, అటవీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## డబుల్ ఇంజిన్ సర్కార్‌తో..
# ఏపీలో అభివృద్ధి పరుగులు



- కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఉద్ఘాటన
- రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన

రాజమహేంద్రవరం (చైతన్యరథం): ప్రధానమంత్రి నరేంద్రమోదీ విజన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్లానింగ్‌తో ఏపీలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఉద్ఘాటించారు. రాజమహేంద్రవరంలో గురువారం పుష్కర ఘాట్ వద్ద అఖండ గోదావరి ప్రాజెక్టుకు కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, స్థానిక నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి షెకావత్ మాట్లాడుతూ అఖండ గోదావరి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసుకోవడం ఆనందదాయకం అన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల రూపకల్పన, వాటి సాకారానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ పవన్ కల్యాణ్ ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో ఏపీ వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబుని కలిసి పలు ప్రాజెక్ట్‌లపై చర్చించామని తెలిపారు. ఐరిగేషన్, టూరిజం అభివృద్ధికి కేంద్రప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని అన్నారు. ప్రణాళికాబద్ధంగా ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో పర్యాటక అభివృద్ధి వేగవంతమయింది. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఏపీలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. దేశంలో పర్యాటకుల సందర్శన మరింత పెరిగింది. ప్రపంచంలో పర్యాటకుల శాతం వేగంగా పెరిగింది మన దేశంలోనే. ఉగ్రదాడి జరిగిన జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో పరిస్థితులు పూర్తిగా అదుపులోకి వచ్చాయని చెప్పారు. పర్యాటకులు స్వేచ్ఛగా అక్కడ ప్రాంతాలను సందర్శించవచ్చని తెలిపారు. మరో పదిహేను రోజుల్లో అక్కడ పర్యాటకుల సందడి మొదలవుతుందని గజేంద్ర సింగ్ షెకావత్ పేర్కొన్నారు. టూరిజం అభివృద్ధికి ఏపీలో అనుకూల పరిస్థితులు ఉన్నాయి. ఆధ్యాత్మికంగానూ రాష్ట్రం అభివృద్ధి చెందుతోంది. ఏపీలో పర్యటక రంగ అభివృద్ధికి సుమారు రూ.450 కోట్లకు పైగా నిధులు మంజూరు చేశాం. స్వదేశీ దర్శన్, ప్రసాద్, సాస్కి, ఛాలెంజ్ బేస్ట్ డెస్టినేషన్ డెవలప్‌మెంట్ (సీబీడీడీ) తదితర స్కీంల ద్వారా పర్యాటక రంగ అభివృద్ధికి కేంద్రం సాయం చేస్తోంది. స్వదేశీ దర్శన్ 2.0 ద్వారా అరకు, బొర్రా గుహలు, లంబసింగి, సూర్యలంక బీచ్‌లను అభివృద్ధి చేస్తున్నాం. ప్రసాద్ స్కీమ్ ద్వారా ఆధ్యాత్మిక టూరిజానికి బాటలు వేస్తున్నాం. అమరావతి, శ్రీశైలం దేవాలయాల్లో భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నాం. సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఆ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. అన్నవరం దేవాలయంలో టెండర్ల ప్రక్రియ పూర్తయిందని గజేంద్ర సింగ్ షెకావత్ చెప్పారు.

### ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యంపై అతిపెద్ద దాడి

ఎమర్జెన్సీపై కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కీలక వ్యాఖ్యలు చేశారు. 1975 జూన్ 25వ తేదీన భారతదేశంలో అత్యవసర పరిస్థితి విధించారు. ఇది ప్రజాస్వామ్యంపై అతిపెద్ద దాడి. అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ అన్ని ప్రాథమిక హక్కులను కాలరాశారు. పత్రికలపై ఆంక్షలు పెట్టి అరాచకాలు వెలుగులోకి రాకుండా అడ్డుకున్నారు. లక్షమందికిపైగా అన్యాయంగా అరెస్టులు చేశారు. ప్రజాస్వామ్యాన్ని నియంతృత్వంగా మార్చారు. ప్రజల ఐక్యపోరాటంతో చివరకు ప్రజాస్వామ్యం విజయం సాధించింది. జయప్రకాష్ నారాయణ్, వాజ్‌పాయ్, వంటి ఎంతోమంది నేతలు అప్పటి పోరాటాలకు నేతృత్వం వహించారు. దేశం వారిని ఎల్లప్పుడూ గౌరవిస్తుంది. నేటి తరాలకు ఎమర్జెన్సీ రోజులను వివరిస్తామని గజేంద్ర సింగ్ షెకావత్ పేర్కొన్నారు.

### అన్నింటికీ కేంద్రం సహకారం: పురందేశ్వరి

డబుల్ ఇంజిన్ సర్కారు ఉంటే అభివృద్ధి సాధ్యమని ఆనాడే చెప్పామని ఎంపీ పురందేశ్వరి అన్నారు. ప్రజలు తమపై నమ్మకంతో ఆశీర్వదించి గెలిపించారని చెప్పారు. వికసిత్ భారత్‌లో వికసిత్ ఆంధ్రప్రదేశ్ ఒక భాగమని పేర్కొన్నారు. అమరావతి, పోలవరం ఇలా అన్నింటికీ కేంద్రం సహకారం అందిస్తోందని చెప్పారు. అనేక పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసుకుంటున్నట్లు వివరించారు. చారిత్రక ప్రాధాన్యత గుర్తించి అభివృద్ధి చేసేందుకు కేంద్రం సాయం మందిస్తోందని పురందేశ్వరి తెలిపారు.

# జలరవాణాకు ల్యాండ్ మార్క్‌గా ఏపీ

- రోడ్డు, రైల్ రవాణా కంటే తక్కువ ఖర్చు
- 16 మిలియన్ టన్నుల ఎగుమతి లక్ష్యం
- స్వర్ణాంధ్ర-2047లో కీలకం ఇన్ లాండ్ వాటర్ వేస్
- పోర్టుల అనుసంధానంతో మారనున్న ముఖచిత్రం
- ఏడాది లోగా భోగాపురం ఎయిర్ పోర్ట్ పూర్తి
- మారుమూల పల్లెలకు సైతం ఫైబర్ నెట్ సేవలు
- రోడ్లు, భవనాల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి




విజయవాడ(చైతన్యరథం): దేశంలోనే అతిపెద్ద సముద్రతీర ప్రాంతం కలిగిన రాష్ట్రాల్లో ఒకటిగా ఏపీ ఉందని, జలరవాణాకు ల్యాండ్ మార్క్‌గా రాష్ట్రాన్ని తీర్చిదద్దుతామని పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, రోడ్లు భవనాల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొ న్నారు. ఏపీ ఇన్ లాండ్ వాటర్ అథారిటీ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో వాటాదారులు, భాగస్వామ్య పక్షాల కన్సల్టేషన్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. రోడ్డు, రైల్ మార్గాల్లో కార్గో సేవలకంటే జల రవాణాకు అయ్యే ఖర్చు 9 రెట్లు తక్కువ అని వివరించారు. జలరవాణాకు అధిక ప్రాధాన్యత కల్పించాలని సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం చేయ డం జరిగిందన్నారు. బకింగ్ హామ్ కెనాల్‌కు పూర్వ వైభవం తెస్తా మని, త్వరలో బకింగ్ హామ్ కెనాల్ ద్వారా చెన్నైకు జలమార్గంలో సరుకు రవాణాకు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. జలమార్గా లు ఇంధన పరంగా ఎంతో సమర్థవంతమైనవని అతి తక్కువ ఖర్చుతో గమ్యస్థానానికి సరుకును చేరవేయవచ్చని, పర్యావరణా నికి అనుకూలమైనవని వివరించారు. రోడ్డు, రైలు రవాణాపై ఆధారపడటాన్ని తగ్గించడానికి, కాలుష్యం తగ్గించడానికి ఇది గొప్ప అవకాశమని అన్నారు.

## 16 మిలియన్ టన్నుల ఎగుమతి లక్ష్యం

ప్రస్తుతం రాష్ట్రంలో లోతట్టు జలమార్గాల ద్వారా సంవత్స రానికి 8 మిలియన్ టన్నుల సరుకు రవాణా జరుగుతుంది. ఇది 16 మిలియన్ టన్నుల ఎగుమతి లక్ష్యంగా ఈ ఏడాది ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. కృష్ణా-గోదావరి కాలువ వ్యవస్థ (జాతీ య జలమార్గం-4), పెన్నా నది (ఎన్‌డబ్ల్యూ-79) వంటి వ్యూహా త్మక విస్తరణలు చేయనున్నాం. ఇప్పటికే కీలక పారిశ్రామిక కేంద్రాలైన కాకినాడ, కృష్ణపట్నం, మచిలీ పట్నం వంటి ప్రధాన ఓడరే వులను అనుసంధా నిస్తున్నాం. బందర్ కెనాల్ (ముక్త్యాల నుంచి మచిలీపట్నం), కృష్ణ నది ఆర్వో (రోల్ ఆఫ్)- ఆర్వో (రోల్ ఆన్) కార్గో కారిడార్లు వంటి ప్రాజెక్టులు మనం భారీ వస్తువులను తర లించే రవాణా విధానాన్ని మార్చనున్నాయి. రాష్ట్రంలోని నదీ కారి డార్ల వెంబడి 50కి పైగా పారిశ్రామిక క్లస్టర్‌లను కూడా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని వివరించారు. ఇది కేవలం రవాణా గురించి మాత్రమే కాదు.. పరిశ్రమలను వికేంద్రీకరించడం, కొత్త వృద్ధి కేంద్రాలను సృష్టించడం, నీటి ఆధారిత లాజిస్టిక్స్‌కు సామీప్యత ద్వారా పెట్టుబడిదారులకు ఖర్చు ప్రయోజనాలను అందించడం కోసమే చేస్తున్నామని మంత్రి వివరించారు.

## సింగిల్ విండోతో అనుమతులు

దేశంలోని అత్యంత సమర్థవంతమైన వ్యవస్థలలో ఒకటైన 93 ఆమోదాలతో కూడిన సింగిల్ విండో క్లియరెన్స్ ద్వారా పెట్టు బడిదారులకు 21 రోజుల్లో అన్ని అనుమతులు అందచేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకోవడానికి ముందు కొచ్చిన లాజిస్టిక్స్ ఆపరేటర్లు, షిప్పింగ్ సంస్థలు, నౌక తయారీదా రులు, మౌలిక సదుపాయాల డెవలపర్‌లకు స్వాగతం పలుకుతు న్నామని పేర్కొన్నారు. బల్క్ కార్గో, కంటైనర్ రవాణా నుంచి, ప్రయాణీకుల వాటర్ టాక్సీలు, ఆర్వో ఆర్వో సేవలు, గ్రీన్ రెట్రో ఫిట్టింగ్,మల్టీమోడల్ లాజిస్టిక్స్ హబ్‌ల వరకు విజయ వాడలో రాబోయే అర్బన్ వాటర్ టాక్సీ, ఆపరేషనల్ కార్గో కారిడార్లు వంటి పైలెట్ ప్రాజెక్టులతో పెట్టు బడులు, ఆదాయాన్ని అందిపుచ్చుకుంటామన్నారు. స్వర్ణ ఆంధ్ర 2047 దార్శనికతను సాధించడంలో లోతట్టు జలమార్గాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. బోగాపురం ఎయిర్ పోర్ట్‌ను మరో ఏడాది లోపు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఫైబర్ నెట్ సేవలు మారుమూల పల్లెలకు సైతం అందేలా అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేశామని వివరించారు.

## త్వరలో సీ ప్లేన్ సేవలు

మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ(సత్య) మాట్లాడుతూ టూరిజం అభివృద్ధిలో భాగంగా విజయవాడ- శ్రీశైలం సీ ప్లేన్ ట్రయల్ రన్ పూర్తి చేయడం జరిగిందని, త్వరలో సీ ప్లేన్ సేవలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఏపీ ఇన్ లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ జెడ్.శివప్రసాద్ మాట్లాడుతూ జలరవాణాలో మన రాష్ట్రం కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. రాబోయే మూడేళ్ల (2026-29) లో గోదావరి నదిపై గూటాల - వంగలపూడి మధ్య ఆర్వో ఆర్వో సర్వీసులు ఏర్పాటు చేయ నున్నామని తెలిపారు. విజయవాడ- అమరావతి మధ్య అర్బన్ వాటర్ మెట్రో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ముక్త్యాల - మచిలీపట్నం పోర్టు, ముక్త్యాల - కాకినాడ పోర్టులు అనుసంధా నం చేయనున్నామని వివరించారు. అలాగే రాష్ట్రంలో వివిధ నదీ విహారయాత్రల్లో భాగంగా శ్రీశైలం-నాగార్జునసాగర్ డ్యామ్ సంద ర్శన, పోలవరం-పోచవరం, శ్రీశైలం-అక్కమహాదేవి గుహలు సందర్శనకు టెంపుల్ టూరిజం రూట్‌లు ఏర్పాటు చేయనున్నా మని తెలిపారు. ఈ సమావేశంలో పెట్టుబడులు, మౌలిక సదుపా యాల శాఖ కార్యదర్శి యువరాజ్, ఆయా సంస్థల ఉన్నతాధికా రులు, వివిధ రాష్ట్రాల నుంచి పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.





ఉండవల్లి క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారితో సమావేశమైన కేంద్ర పర్యాటక శాఖా మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్. అంతకముందు షెకావత్‌కు స్వాగతం పలికి తోడ్కొని వస్తున్న మంత్రి లోకేష్.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండండి

### - యువతకు మంత్రి లోకేష్ పిలుపు



అమరావతి (చైతన్యరథం): యువత మాదకద్రవ్యాలను తిరస్కరించాలని మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా 'ఎక్స్'లో మంత్రి లోకేష్ పోస్ట్ చేశారు. మెరుగైన భవిష్యత్ కోసం యువత తమ శక్తిని ఉపయోగించుకోవాలన్నారు. డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నట్లు చెప్పారు. కఠినంగా చట్టాల అమలు, నిఘా ద్వారా మాదకద్రవ్యాలను అరికట్టడానికి ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చూపుతోందని లోకేష్ అన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు ప్రత్యేకంగా ఎలైట్ యాంటీ-నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్)ను ప్రారంభించి, మాదక ద్రవ్యాల మాఫియాపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి భవిష్యత్‌ను ప్రకాశవంతంగా తీర్చిదిద్దుకోవాలని మంత్రి లోకేష్ హితవు పలికారు.

# విశాఖ ఐటీకి మణిహారం కాగ్నిజెంట్

- సుమారు 8 వేల మందికి ఉద్యోగావకాశాలు
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు
- మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి



అమరావతి(చైతన్యరథం): విశాఖలోని కాపులుప్పాడలో 22 ఎకరాల్లో ఐటీ క్యాంపస్ ఏర్పాటుకు కాగ్నిజెంట్ సంస్థ ముందుకు రావడం శుభపరిణామని విశాఖ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి సంతోషం వ్యక్తం చేశారు. కాగ్నిజెంట్ ఐటీ క్యాంపస్‌తో ఏఐ, డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ రంగాల్లో సుమారు 8 వేల మంది యువతకు ఉద్యోగావకాశాలు రానున్నాయని తెలిపారు. ఈ ఐటీ కంపెనీ విశాఖకు ఐటి మణిహారంగా మారనుందని ఆకాంక్షించారు. సంస్థ ఏర్పాటుకు కృషి చేసిన సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేష్‌కు విశాఖ యువత తరపున కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజు నుండే ప్రముఖ దిగ్గజ ఐటీ కంపెనీలు రాష్ట్రానికి క్యూ కడుతున్నాయి. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పనే లక్ష్యంగా కూటం ప్రభుత్వం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.

# పర్యాటక రంగంలో యువతకు భారీగా ఉపాధి

- అఖండ గోదావరి ప్రాజెక్ట్‌ను అద్భుతంగా తీర్చిదిద్దుతాం
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



రాజమహేంద్రవరం (చైతన్యరథం): రాజమహేంద్రవరం అంటే గుర్తుకొచ్చేది గోదావరి తీరమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అఖండ గోదావరి ప్రాజెక్టుకు గురువారం శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. తీరం వెంట నాగరికత, భాష అన్నీ అభివృద్ధి చెందుతాయని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలతో పర్యాటక రంగంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేగంగా అభివృద్ధి చేస్తున్నాయని ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రమంత్రి షెకావత్ ప్రత్యేకంగా కృషి చేస్తున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కేంద్ర మంత్రి షెకావత్ సహకారం అందించారన్నారు. అలాగే పోలవరం ప్రాజెక్టు కోసం కూడా షెకావత్ సహకారం అందించారని కొనియాడారు. ఏపీలో 974 కిలోమీటర్ల నదీ తీరం ఉందని, విదేశాల్లో నదీ తీరాలను పర్యాటక పరంగా అభివృద్ధి చేసిన విధంగా అఖండ గోదావరి ప్రాజెక్టును కూడా పర్యాటకంగా అద్భుతంగా తీర్చిదిద్దుతామన్నారు.

ఆంధ్రుల అన్నపూర్ణగా పేరుగాంచిన డొక్కా సీతమ్మకు జన్మనిచ్చిన నేల ఇది అని చెప్పారు. ఆదికవి నన్నయ్యతో పాటు ఎంతో మంది కళాకారులకు జన్మనిచ్చిన నేల ఇది. ఎంతో కాలంగా ఉన్న కలను సాకారం చేసే దిశగా ముందుకెళ్లడం ఆనందదాయకం. పర్యాటక రంగంలో యువతకు ఎక్కువ ఉపాధి అవకాశాలు ఉంటాయి. ప్రాజెక్టు పూర్తయితే ఏటా 4 లక్షల మంది పర్యటకులు పెరిగే అవకాశముంది. శక్తిమంతమైన నాయకులు, ప్రభుత్వం ఉంటే అభివృద్ధి వేగవంతమవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పర్యాటక కేంద్రాలకు పునరుజ్జీవం అందించాలని కేంద్రమంత్రి షెకావత్‌ను కోరుతున్నాం. రాజస్థాన్‌లో వీరులు పుట్టిన నేల నుంచే గజేంద్ర సింగ్ షెకావత్ వచ్చారు. ఆంధ్రుల పౌరుషం ఉన్న ఈ నేల స్వభావాన్ని అర్థం చేసుకుంటున్నారని పవన్ కల్యాణ్ చెప్పారు.

# అమరావతిలో సచివాలయ కాంప్లెక్స్

## ఐకానిక్ టవర్ల నిర్మాణానికి టెండర్లు ఖరారు



అమరావతి (చైతన్యరథం): రాజధాని అమరావతిలో ఇంటిగ్రేటెడ్ రాష్ట్ర సచివాలయం, హెచ్‌ఓడీ కార్యాలయాల కోసం ఐకానిక్ టవర్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు ఖరారు చేసింది. టెండర్లలో ఎల్ 1గా నిలిచిన సంస్థలకు బిడ్లు ఆమోదిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ సచివాలయ కాంప్లెక్స్‌లో భాగంగా 39, 47 అంతస్తులతో 5 టవర్లు నిర్మించబోతున్న సంగతి తెలిసిందే. వీటిలో సమీకృత సచివాలయం, ముఖ్యమంత్రి, మంత్రుల కార్యాలయాలు, వివిధ శాఖాధిపతుల కార్యాలయాలు ఉంటాయి. మొత్తం రూ. 4,688.82 కోట్లు వ్యయంతో నిర్మించబోయే ఈ 5 టవర్ల నిర్మాణం కోసం సీఆర్‌డీఏ గురువారం టెండర్లు ఖరారు చేసింది. సమీకృత సచివాలయం కలిగిన జీఏడీ టవర్ నిర్మాణానికి రూ.882.47 కోట్లు విలువగల కాంట్రాక్టుని ప్రముఖ నిర్మాణ సంస్థ ఎన్‌సీసీ దక్కించుకుంది. రూ.1,487.11 కోట్లు విలువ కలిగిన 1, 2 టవర్ల నిర్మాణ కాంట్రాక్ట్ పనులను షాపూర్ జీ పల్లోంజీ కంపెనీ దక్కించుకుంది. రూ. 1,303.85 కోట్లు విలువకలిగిన 3,4 టవర్ల నిర్మాణ కాంట్రాక్ట్ పనులను ఎల్ అండ్ టీ కంపెనీ దక్కించుకుంది. ఎల్ 1 బిడ్డర్లకు ప్రతిపాదిత పనులు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సీఆర్డీఏ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ సురేశ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

# కూటమి పాలనలో రైతులకు భరోసా

- జగన్‌రెడ్డి పాలనలో దగా చేశారు
- ఆత్మహత్యలకు కారణమయ్యారు
- మీరు చేసిన మోసాలు ఇవిగో
- సీడాప్ చైర్మన్ దీపక్‌రెడ్డి ధ్వజం



మంగళగిరి(చైతన్యరథం): ఏడాది పాలనలో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తూ రైతులకు కూటమి ప్రభుత్వం భరోసా ఇచ్చిందని సీడాప్ చైర్మన్ జి.దీపక్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయం గురువారం విలేకరుల సమావేశంలో జగన్‌రెడ్డి హయాంలో అన్నదాతలకు, ఆయా వర్గాలకు జరిగిన నష్టం,కూటమి పాలనలో జరిగిన మేలును వివరించారు. వైసీపీ తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి కూటమి ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తుందన్నారు. వైసీపీ దుష్ప్రచారాలు కూటమిపాలనలో ప్రజల సంక్షేమం, అభివృద్ధిని దాచలేవని.. కొన్ని కీలక వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకొస్తున్నామని వివరించారు. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని దివాళా తీసే స్థితికి తీసుకొచ్చింది. రూ.10లక్షల కోట్లకు పైగా రుణభారం మూటగట్టి రూ.6,000 కోట్లకు పైగా వడ్డీ భారాన్ని రాష్ట్రంపై మోపి వెళ్లింది. రూ.1.40 లక్షల కోట్ల బకాయిలు పెట్టింది.రైతులకు రూ.1,674 కోట్ల ధాన్యం బకాయిలు చెల్లించకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కుదేలు చేసిందని ధ్వజమెత్తారు.

### కూటమి పాలనలో 700కు పైగా అభివృద్ధి కార్యక్రమాలు

కూటమి ఏడాది కాలంలోనే 700కు పైగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసింది. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలలో 70 శాతం అమలు చేసింది. తల్లికి వందనం పథకం కింద వైసీపీ హయాంలో కేవలం 42 లక్షల మంది పిల్లలకు సహాయం అందగా..నేడు కూటమి ప్రభుత్వం 67 లక్షల మంది పిల్లలకు రూ.4,500 కోట్ల అదనపు ఖర్చుతో 82 శాతం ఎక్కువ ఇచ్చినట్లు వివరించారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద రూ.34, 000 కోట్లతో 57 శాతం అదనపు ఖర్చు, అన్నదాత సుఖీభవ పథకం కింద వైసీపీ హయాంలో రూ.7,500 కోట్లు ఖర్చు చేయగా.. కూటమి ప్రభుత్వం రూ.14,000 కోట్లతో 87శాతం ఎక్కువ ఇస్తుందని పేర్కొన్నారు.

### వ్యవసాయానికి బడ్జెట్‌లో రూ.48,341 కోట్లు

వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగంపై చేస్తున్న దుష్ప్రచా రాన్ని తిప్పికొట్టాలి. కూటమి ప్రభుత్వం 2025-26 వ్యవసాయ బడ్జెట్‌లో రూ.48,341 కోట్లు కేటాయించింది. 68 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 24 గంటల్లో రైతుల ఖాతాల్లో రూ.18,000 కోట్లు జమ చేసింది. వైసీపీ హయాంలో కేవలం 41 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. కూటమి ప్రభుత్వం 66 శాతం అదనంగా (27 లక్షల టన్నులు) కొనుగోలు చేసినట్లు తెలిపారు. వైసీపీ వదిలి వెళ్లిన రూ.1,674 కోట్ల ధాన్యం బకాయిలను కూటమి ప్రభుత్వం మొదటి నెలలోనే చెల్లించింది. రూ.3,826 కోట్ల రుణాలతో కౌలు రైతులను బ లోపేతం చేస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులకు 100 శాతం రాయితీ, రాయలసీమ, ప్రకాశం జిల్లాల మధ్యస్థ రైతులకు 90 శాతం, కోస్తా జిల్లాల రైతులకు 70 శాతం రాయితీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు అందిస్తున్నామని వివరించారు.

### రైతుల చావుకు కారణమయ్యారు

వైసీపీ పాలనలో కౌలు రైతుల ఆత్మహత్యలలో రెండో స్థానం లో నిలిచింది. 2020-22లో మిర్చి పంటకు నల్ల తామర తెగు లు వచ్చి 3 లక్షల ఎకరాల్లో నష్టం జరిగినా ఒక్క రూపాయి పరిహారం చెల్లించలేదని ఆరోపించారు. రూ.3,000 కోట్ల ధరల స్థిరీకరణ నిధి గురించి గొప్పలు చెప్పినా మిర్చి రైతులకు ఒక్క రూపాయి ఇవ్వలేదు. జిప్సం, బోరాన్, జింక్ వంటి మైక్రో న్యూట్రియంట్స్ పంపిణీని నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం ఖరీఫ్ 2025-26 కోసం 14 పంటలకు కనీస మద్దతు ధర పెంచింది. రైతు భరోసా కేంద్రాల ఆధునీకరణకు రూ.500 కోట్లు, గిడ్డంగుల విస్తరణకు రూ.150 కోట్లు, పంటల బీమాకు రూ.800 కోట్లు, చెరకు సబ్సిడీలకు రూ.200 కోట్లు, మత్స్యకారుల సహాయానికి రూ.259 కోట్లు, ధరల స్థిరీకరణకు రూ. 6,000 కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. పొగాకు కొనుగోలుకు రూ.300 కోట్లు, మామిడి, కోకో సబ్సిడీకి రూ.168 కోట్లు కేటాయించామని చెప్పారు. వైసీపీ రాష్ట్రాన్ని గంజాయాంధ్రప్ర దేశ్‌గా మార్చింది. కూటమి ప్రభుత్వం విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు రైతులకు అండగా నిలిచింది. 4.5 లక్షల సాయిల్ శాంపుల్‌తో శాస్త్రీయ సాగు సలహాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. వైసీపీ దుష్ప్రచారాలు ప్రజలను మభ్యపెట్టలేవని హితవుపలికారు.

# ఓర్వకల్లులో రిలయన్స్ భారీ పరిశ్రమ

## భూమి కేటాయించిన ప్రభుత్వం

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో మరో భారీ పరిశ్రమకు ప్రభుత్వ ఆమోదం తెలిపింది. కర్నూలు సమీపంలో భారీ పరిశ్రమ ఏర్పాటుకు రిలయన్స్ సంస్థకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రూ.1622కోట్ల పెట్టుబడితో శీతల పానీయాలు, జ్యూస్లు, డ్రింకింగ్ వాటర్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పరిశ్రమ ఏర్పాటుతో స్థానికంగా 1200మందికి ఉద్యోగఅవకాశాలు లభిస్తాయని ఆదేశాల్లో సర్కారు తెలిపింది. పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనలను ఈనెల 19న సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం లభించింది. కర్నూలు సమీపంలోని ఓర్వకల్లులో ఏపీఐఐసీ ల్యాండ్ బ్యాంక్‌లో పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది. ప్లాంట్ ఏర్పాటు కోసం ఎకరా రూ.30 లక్షల చొప్పున 80 ఎకరాల భూమి కేటాయిస్తున్నట్లు తెలిపింది. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4.0 ప్రకారం ప్రోత్సాహకాలు సైతం ఇవ్వనున్నట్లు స్పష్టం చేసింది. వచ్చే ఏడాది డిసెంబర్‌లోగా పరిశ్రమలో ఉత్పత్తి ప్రారంభించాలని ఉత్తర్వుల్లో రిలయన్స్ సంస్థను ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని ఏపీఐఐసీ చైర్మన్, ఎండీని ఆదేశిస్తూ పరిశ్రమలు, వాణిజ్య విభాగం కార్యదర్శి చిరంజీవి చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు.



# చిన్నప్పటి నుంచే జగన్‌ది నేర మనస్తత్వమే

- బాబాయిని ఏసేసినోడికి సింగయ్య ఒక లెక్కా?
- తన కారు కింద పడలేదని చెప్పే ధైర్యం ఉందా?
- తలలు తీస్తామంటే సమర్థించడం క్రూరత్వం
- రోత పత్రికలో తప్పుడు రాతలతో విషప్రచారం
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య




మంగళగిరి(చైతన్యరథం): సొంత బాబాయిని ఏసేసినోడికి సింగయ్య ఒక లెక్కా? సింగయ్య తాను ప్రయాణిస్తున్న కారు కింద పడలేదని..ఆయన చావుకు తన కారుకు సంబంధం లేదని చెప్పే ధైర్యం జగన్‌కు ఉందా? వైసీపీ కార్యకర్తలు టైర్ కింద నుంచి సింగయ్యను లాగి రోడ్డు పక్కన పడేయలేదని చెప్పే ధైర్యం ఉందా? అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ప్రశ్నించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో జగన్‌రెడ్డి, వైసీపీ నేతల తీరును దుయ్యబట్టారు. చిన్న నాటి నుంచి జగన్‌రెడ్డి వ్యక్తిత్వం నేర ప్రవృత్తితో మిళిత మైంది.. విద్యార్థి దశలోనే ప్రశ్నాపత్రాలు దొంగిలించా రన్న ఆరోపణలు ఉన్నాయి. ఆ ఆరోప ణలపై ఇప్పటికీ జగన్‌రెడ్డి నుంచి సమాధానం లేదు..పార్లమెంట్‌కు రాజీనామా చేయనన్నాడని బాబాయిని లాగి చెంప పగలగొట్టిన మనస్తత్వం ఆయనది. హైదరాబాద్‌కు వద్దని ముఖ్యమంత్రిగా వైఎస్ వారించినా బెంగళూరు లో ఉండకుండా పదేపదే హైదరాబాద్‌కు వచ్చి తండ్రికి తలనొప్పి కలిగించాడు. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టు కుని లక్షకోట్లు కొల్లగొట్టి 16నెలలు చంచలగూడ జైల్లో చిప్ప కూడు తిన్న నేరచరిత్ర.. ఆర్థిక నేరస్తుడిగా ముద్ర పడిన జగన్‌కు 16నెలలుగా బెయిల్‌ఇవ్వడానికి సుప్రీం కోర్టు కూడా నిరాకరించింది. ముఖ్యమంత్రిగా అవినీతి, బంధుప్రీతి,ఆశ్రిత పక్షపాతంతో ఐదేళ్లు అరాచక పాలన చేశారు. ఆయన పాలన అప్రజాస్వామికం, రాజ్యాంగ విరుద్ధంగా సాగింది. ప్రత్యర్థి పార్టీలకు అణగదొక్కడమే లక్ష్యంగా సాగింది. పోలీసులు నిర్వహించే శవపంచ నామాకు, డాక్టర్లు నిర్వహించే పోస్టుమార్టంకు తేడా తెలియని దగుల్బాజి పత్రిక సాక్షి. తండ్రి శవాన్ని పక్కన పెట్టుకుని సంతకాలు సేకరించిన నేర ప్రవృత్తి.. అధికా రమే లక్ష్యంగా మానవత్వ విలువలకు తిలోదకాలు ఇచ్చిన అనైతిక వ్యక్తి జగన్. రోజా, అంబటి,విడదల రజినీ లాంటి వారు కళ్లముందు నిజం కనపిస్తున్నా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. నిజాలను అబద్ధా లుగా ప్రజలను మభ్యపెట్టేందుకు విష ప్రచారం చేస్తు న్నారు. ఎస్పీ వాస్తవాలు చెబుతుంటే వైసీపీ మూకలు వక్రీకరించి మాట్లాడుతున్నారు. వారు, వారి అధినాయ కుడు జగన్‌రెడ్డి విపరీత మనస్తత్వం ఏమిటో ప్రజలు అర్థంచేసుకోవాలి. పోలీసుల ఆంక్షలను ధిక్క రించి వెళ్లి దళిత బిడ్డను కారు కింద తొక్కించి ప్రాణాలు తీశారు. మళ్లీ దానికి తనకు ఎటువంటి సంబంధం లేదని జగన్‌రెడ్డి అనడం దారుణం. జగన్‌రెడ్డి యాత్రలోనే సింగయ్య మృతిచెందాడు. పోలీసుల ఆంక్షలకు అణు గుణంగా జగన్‌రెడ్డి వెళ్లి ఉంటే చనిపోయేవాడు కాదు.

## రోత పత్రికలో తప్పుడు రాతలు

కొమ్మినేని బస్సు కథలు చెబుతున్నాడు.. బస్సు యాక్సిడెంట్ అయితే అందులో ఉన్న వారిని కూడా అరెస్ట్‌చేస్తారా అంటున్నాడు. సింగయ్యను తొక్కింది బస్సు కాదు కారు. అందులో ఉంది నిబంధనలు అతి క్రమించి వెళుతున్న వైసీపీ నాయకులు. వారిపై తప్ప కుండా చర్యలు తీసుకోవాలి. మానవత్వం లేకుండా కారులో ఉండి సింగయ్యను లాగి అవతల పడేమన్న నేతలపై కూడా చర్యలు తీసుకోవాలి. జగన్ రోత పత్రికలో శవం కాలు మీద కాలు వేసుకుందని తప్పుడు రాతలు రాస్తున్నారు. ప్రజలను భ్రమ పెట్టాలని మసి పూసి మారేడు కాయ చేయాలనుకుంటున్నారు. రప్పా రప్పామంటూ గంగమ్మ జాతరలో పొట్టేళ్ల తలలు తీసి నట్లు తీస్తామంటే జగన్‌రెడ్డి మంచిదే అనడం అతని విపరీత మనస్తత్వానికి అద్దంపడుతుంది. నాడు ముఖ్య మంత్రి పదవిని అడ్డుపెట్టుకుని కోర్టుకు వెళ్లకుం డా తప్పించుకున్నాడు..నేడు ముఖ్యమంత్రి పదవిపోయి సంవత్సరం అయినా జగన్‌రెడ్డి కోర్టుకు ఎందుకు వెళ్ల డం లేదు? జగన్‌రెడ్డి ధిక్కరణ మనస్తత్వానికి ఇదే ఉదా హరణ. నాడు జగన్‌రెడ్డిపై ఇంత అనతికాలంలో ఇన్ని కోట్లు ఎలాసంపాదించాడని ఎంక్వైరీ చేయాలని సుప్రీం కోర్టు సీబీఐని ఆదేశించింది. ఆర్థిక ఉగ్రవాదం హత్యా నేరం కంటే పెద్ద నేరమనిచెప్పింది. సొంత తల్లి దూరం అవ్వడానికి ఆయన విపరీత మనస్తత్వమే కారణం. జగన్‌రెడ్డి ధనాశకు వారుఎక్కడో ఉంటూ బిక్కుబిక్కు మంటూ బతుకుతున్నారు.వివేకా కుమార్తె సునీత నాడు న్యాయం కోసం ఢిల్లీ నడి వీధుల్లో ఎండలో నడుస్తుంటే మనసు కరగలేదు. అధికార దాహం కోసం ఏదైనా చేయగలరు. స్టెరాయిడ్స్ తీసుకునే అథ్లెట్‌కు.. అరాచ కంతో అధికారంలోకి రావాలనుకునే జగన్‌రెడ్డికి ఎటు వంటి తేడాలేదు. తన ఐదేళ్ల పాలనలో ఏ వర్గానికి మేలు చేశాడో చెప్పగలడా? అని ప్రశ్నించారు. ఇంకా సాక్షి అబద్ధపురాతలతో ప్రజలనుమభ్యపెట్టాలని చూస్తు న్నారు.. వారు మారకుంటే ప్రజలు పూర్తిగా ఛీకొడ తారని హితవుపలికారు.

## కూటమి పాలనలో ఇంటింటా న్యాయం..

# వైసీపీ పాలనలో ఇంటింటా మోసం

- తల్లి, చెల్లే మోసగాడని చెప్పటం వాస్తవం కాదా?
- జగన్ అండ్ కో ఇంటింటికి వెళ్లి ఏం చెబుతారు?
- ప్రజలను వంచించి మోసగించాడని చెబుతారా?
- బాబాయిని రప్పా రప్పా ఎలా నరికారో చెబుతారా?
- ఐదేళ్లూ ఏం చేశారని ప్రజలే వారిని నిలదీస్తారు
- టీడీపీ అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్



మంగళగిరి(చైతన్యరథం): మూసివేతలకు సిద్ధంగా ఉన్న వైసీపీ ఆఫీసులను తెరిపించుకోవడానికి.. ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను మభ్య పెట్టేందుకు జగన్‌రెడ్డి ఇంటింటికీ కార్యక్రమం పెట్టుకున్నారు. చెల్లి ఇంటింటికీ వెళ్లి జగన్ మోసగాడంటుంటే.. జగన్ ఇంటింటికి వెళ్లి ఏం చెబుతారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్ ప్రశ్నించారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లే మోసగాడని కోర్టులో అఫిడవిట్ వేసిన విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఆరిపోయే దీపానికి వెలుగుఎక్కువ అన్నట్లు.. అంతమయ్యే వైసీపీ ఎగిరెగిరి పడుతోంది. ఇంటింటికీ వెళితే ప్రజలే వారిని నిలదీస్తారని హితవుపలికారు. చంద్రన్న చేసిన మంచేంటో, జగన్ చేసిన మోసమేంటో ప్రజలకు బాగా తెలుసు. మూసివేతలకు సిద్ధంగా ఉన్న వైసీపీ ఆఫీసులను తెరిపించుకోవడానికో చేసే ప్రయత్నాలను ప్రజలు హర్షించరు. రాష్ట్ర పార్టీ కార్యాలయం మూసుకుని.. ఇంట్లో క్యాంప్ ఆఫీస్ పెట్టుకోవడమే వారి పతనానికి నిదర్శనం. జిల్లాపార్టీ కార్యాలయాలకు టూలెట్ బోర్డులు పెట్టుకోనున్నారని వ్యాఖ్యానించారు.

## పశ్చాత్తాపం తెచ్చుకోవాలి

ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను చెబుదామని జగన్ అనటం సూర్యుడి మీద ఉమ్మాలను కోవడమే. వైసీపీ ప్రభుత్వ సలహాదారులు పిచ్చి సలహాలిచ్చి 11 సీట్లకే పరిమితం చేశారు. వారు ఆత్మవంచన చేసుకో కుండా మనస్సాక్షిగా సమాధానం చెప్పగలరా? అని జగన్ సలహాదారులను ప్రశ్నించారు. ఎక్కడా యువత రోడ్లపైకి రాకున్నా వృద్ధులతో ఫీజుపోరు కార్యక్రమం చేశారు. ఫీజు బకాయిలు ఎంత పెట్టి వెళ్లారో జగన్ చెప్పాలి. పెద్ద మొత్తంలో ఆరోగ్యశ్రీ బకాయిలు పెట్టి మళ్లీ వైసీపీనే ఆరోగ్యశ్రీపై నిరసన ప్రకటించడం అవివేకం. వారు పెట్టి వెళ్లిన బకాయిల విషయాన్ని బయట పెట్టాలి. రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించి వెళ్లి.. కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందంటే ఎలా? 164 సీట్లు, 57 శాతం ఓట్లేసి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారు. ఈ విషయాన్ని అర్థం చేసుకో లేని జగన్‌ది మానసిక వైకల్యం. ఎందుకు ఆయన పాలనను ప్రజలు వ్యతిరేకించారో తెలుసుకోవాలి. తప్పు చేశాననే పశ్చాత్తాపం తెచ్చుకోవాలని హితవుపలికారు.

## అమ్మఒడితో జగన్‌రెడ్డి మోసగించాడని చెబుతారా?

కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని కాపాడు తుంది. డాక్టర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అనుసరిస్తుంది. జగన్ బయటకు వస్తే పరదాలు కట్టేవారు.. నేడు అలా లేవు.జగన్ స్వేచ్ఛగా తిరుగుతున్నాడు.. ప్రభుత్వం రక్షణ కల్పిస్తోంది. ఆయనను నమ్మే ఒకరిద్దరు కూడా జీవితాలు పాడు చేసుకుంటున్నారు. కార్యకర్తలను ముందుంచి కార్యక్రమాలు చేయాలి.. కిరాయివాళ్లతో కాదని హితవు పలికారు. జగన్ ఎన్నికల్లో గెలవక ముందు ఇంటింటికి వెళ్లి ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి అమ్మఒడి ఇస్తానని చెప్పి ఇవ్వలేదు. కేవలం 42లక్షల మందికి మాత్రమే అమ్మఒడి ఇచ్చాను.. 25లక్షల మందికి అమ్మ ఒడి ఇవ్వలేక పోయానని ఇంటింటికి వెళ్లి చెబుతారా? జగన్ ప్రభుత్వం కేవలం రూ.5,540 కోట్లు 42 లక్షల మం దికి మాత్రమే ఇస్తే.. కూటమి ప్రభుత్వం 67 లక్షల మందికి రూ.10వేల కోట్లు తల్లికి వందనం పేరుతో ఇంటింటికి ఇచ్చిందన్న విషయం ఇంటింటికి వెళ్లి చెబుతారా? అమ్మ ఒడి పేరుతో జగన్ ఎంతిచ్చాడు, తల్లికి వందనం పేరుతో చంద్రన్న ఎంతిచ్చాడో చెబుతారా? లెక్కలు నగ్న సత్యాల్లా వెలువడుతున్నా యి. జగన్ ప్రభుత్వం వచ్చి వుంటే అన్న దాత సుఖీభవ, ఉచిత గ్యాస్ వచ్చేవికావు. ఉచిత బస్సు ప్రయాణం ఉండేదికాదు, అమరావతి, పోలవరం నిర్మాణాలు నాశనమయ్యేవి. నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాల తో ఆడుకున్న ఆయన నమ్మి ఓట్లేసి గెలిపిస్తే ప్రాణాలే తీశారని ధ్వజ మెత్తారు.

## బాబాయిని ఎలా నరికారో చెబుతారా?

ఇంటింటికి వెళ్లినప్పుడు జగన్ తన బాబాయిని రప్పా రప్పా అని ఎలా నరికారో చెబుతారా? నరికిన వారిని ఐదేళ్లు ఎలా కాపాడారో కూడా చెప్పాలి. సొంత తల్లిని, చెల్లిని, చిన్నాన్న కుమార్తెను మెడపట్టి ఏవిధంగా బయటికి గెంటివేశారో కూడా చెప్పాలి. అధికారంలోకి వస్తామని పిచ్చి కలలు కంటున్నారు. ఇసుకలో, మద్యంలో దోపిడీ చేశారు. మీ రక్తం పంచుకుపుట్టిన చెల్లి ఇంటింటికి వెళ్లి సొంత చెల్లినే మోసం చేసి ఇతరులకు నా అక్కలు, నా చెల్లెమ్మలనడం మోసం కాదా? వైఎస్సార్ ప్రతి అడు గులో తోడున్న చిన్నాన్న భార్య నా పసుపు కుంకుమలు ఎవరు చెరిపేశారు అని అడుగుతోంది. దానికి కూడా జగన్ సమాధానం చెప్పాలి. వైఎస్ ఆత్మ కేవీపీ జగన్‌ను ఎందు కు అసహ్యించు కుంటున్నాడో ఇంటింటికి వెళ్లి చెప్పాలి. జగన్ తండ్రి రాజశేఖర్‌రెడ్డికి నీడలా ఉన్న సూరీడు ఎందుకు భయపడుతున్నాడో చెప్పాలని ప్రశ్నించారు.

## జగన్ మోసాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారు

పొదిలిలో నానా హంగామా సృష్టించారు. పల్నాడు జిల్లా రెంటపాళ్లలో బెట్టింగ్ రాయుడు చనిపోతే అక్కడకు పరామర్శకు వెళతారు. జగన్ చేసే ప్రతి మోసాన్ని ప్రజలు గమనిస్తున్నారు. వైసీపీ నాయకులు ఇంటింటికి వెళ్లినప్పుడు కూటమి ప్రభుత్వం చేసిన మేలు, వైసీపీ చేసిన మోసం కూడా చెప్పాలి. 2029లో కూడా ప్రతిపక్ష హోదారావటం జరగని పని. 2034లో అందుకు ప్రయత్నించాలి.. పదే పదే అబద్ధాలు చెప్పడం మానుకోవాలని హితవుపలికారు.

## ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించేలా

# 2047 విజన్ ప్రణాళికలు

### - రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

నూజివీడు (చైతన్యరథం): స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యాల సాధనలో భాగం గా ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించేలా నూజివీడు నియోజకవర్గ విజన్ డెవలప్ మెంట్ ప్లాన్‌ను రూపొందించినట్లు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. గురువారం సాయంత్రం నూజివీడు రోటరీ కళ్యాణ మండపంలో ఏలూరుజిల్లా,నియోజకవర్గ అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులతో కలిసి సుపరిపాలనలో తొలిఅడుగు కింద నూజివీడు నియోజకవర్గ విజన్ డెవలప్‌మెంట్ ప్లాన్ ఆవిష్కరణ-చర్చ- సమాలోచన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నూజివీడు నియోజకవర్గస్థాయిలో అభివృద్ధి పనులకు సంబంధించి విజన్ ప్లాన్‌ను రూపొందించామన్నారు. అందరి సహకారంతోనే స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్రణాళిక అమలు సాధ్యమన్నారు. గత ప్రభుత్వ ఐదేళ్ల విధ్వంస పాలనలో 20 ఏళ్లు వెనక్కి వెళ్లిన రాష్ట్రాన్ని విజనరీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయు డు సారథ్యంలో స్వర్ణాంధ్రగా మార్చేందు కు కృషి చేస్తున్నామన్నారు. ఈ ప్రణాళిక తయారీలో అధికారులతోపాటు ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో అధికంగా ఉన్న వ్యవసాయం, ఉద్యానవన, పర్యాటక, మత్స్యరంగాలను మరింతవిస్తరింపచేయ వచ్చన్నారు. అన్నివర్గాల సూచనలు తీసు కొని సమగ్ర ప్రణాళికను




రూపొందిస్తే రాబోయే 22ఏళ్లలో అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు. నూజివీడు నియోజకవర్గంలోని కాట్రేనిపాడు ఎన్ఎస్‌పి, వేంపాడు కాలువ పనులకు అవసరం అయితే తన సొంత సొమ్ము రూ 30 లక్షలతో తవ్విస్తామని ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు.

నూజివీడు నియోజకవర్గంలో ఉపాధిహామీ కింద రూ. 30.12 కోట్లతో సిసి రోడ్లు నిర్మాణం, రూ. 3.55 కోట్లతో గోకులం షెడ్లు నిర్మాణం చేపట్టామన్నారు. ఆర్ అండ్ బి రోడ్ల పునర్నిర్మాణం, గుంతలు పూడ్చేందుకు ప్రభుత్వం రూ. 30 కోట్లు కేటాయించిందన్నారు. నూజివీడు ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియం కోసం ప్రభుత్వం రూ. 1.75 కోట్లు కేటాయించిందన్నారు. జెజెఎం కింద రక్షిత మంచినీటి పథకాల కోసం రూ. 13.21 కోట్లు, జిల్లా పరిషత్ నిధులు రోడ్లు, డ్రైయిన్లు, మంచినీటి వసతి కోసం రూ. 3.55 కోట్లు కేటాయించిందన్నారు. నాబార్డు నిధుల నుంచి పంచాయితీ రోడ్ల అభివృద్ధికోసం రూ. 5 కోట్లు కేటాయించిందన్నారు. నూజివీడు పట్టణ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వ నిధుల నుంచి మొత్తం రూ.5 కోట్లు కేటాయించారన్నారు. నూజివీడు పట్టణ మంచినీటి అవసరాలు తీర్చడం కోసం అమృత-2 పథకం కింద వెల్వడం నుండి ఈదర వరకు పైపులైన్ నిర్మాణం కోసం రూ. 13.22 కోట్లు కేటాయించారన్నారు. బోర్వంచ గ్రామ పంచాయితీ పరిధిలోని కొన్నంగుంట గ్రామం వద్ద డ్రైన్ నిర్మాణం కోసం డీఎంఎఫ్ నిధుల నుంచి కోటి రూపాయలు కేటాయించగా, నూజివీడు రూరల్ మండలంలో మంచినీటి సౌకర్యాల కోసం డీఎంఎఫ్ నిధుల నుంచి రూ. 29 లక్షలు, సమగ్ర శిక్షా అభియాన్ నిధుల నుంచి స్కూల్ కాంపౌండ్ వాల్స్, అదనపు తరగతుల నిర్మాణం కోసం రూ. 2.22 కోట్లు, నియోజవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, మైనారిటీ విద్యార్థులకోసం స్కాలర్ షిప్ రూపంలో రాష్ట్ర ప్రభుత్వ నిధులనుంచి రూ. 9.91 కోట్లు కేటాయించారన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద నియోజకవర్గంలో 20 లక్షలకు మించి పనిదినాలు కల్పించామన్నారు. ఎన్.టి.ఆర్. భరోసా పెన్షన్ల కింద ఏడాది కాలంలో రూ. 170 కోట్ల మేర వివిధ రూపాల్లో పెన్షన్లు అందించామన్నారు. అదే విధంగా వైద్య సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 360 మందికి రూ. 2.25 కోట్లు, ఎల్‌ఓసిల కింద 48 మందికి రూ. 93 లక్షలు మొత్తంగా రూ.3.19 కోట్లు అందించామన్నారు.

సమావేశంలో నూజివీడు సబ్ కలెక్టర్ బి. స్మరణ్ రాజ్, డిఎఫ్ఓ శుభం, పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదరనాయుడు, డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, గౌరెలు, మేకలు కార్పొరేషన్ అదనపు డైరెక్టర్ సూర్యకుమారి, నూజివీడు సివిడిపి నోడల్ ఆఫీసరు, జెడ్పి సిఇఓ ఎం. శ్రీహరి, ఎల్ డిఎం డి. నీలాద్రి, స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇంటిని కూల్చి వైసీపీ నేతల దౌర్జన్యం



- నాడు-నేడు పనులకు సామగ్రి
- జగన్‌రెడ్డి ప్రభుత్వంలో నిర్వాకం
- ప్రజావినతుల్లో బాధితుడి ఫిర్యాదు

మంగళగిరి(చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ప్రజావినతుల కార్యక్రమంలో ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ కుప్పం రాజశేఖర్, ఏపీ కుమ్మరి శాలివాహన వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ అర్జీలు స్వీకరించారు. వైసీపీ నాయకులు తన ఇంటిని కూల్చి ఆ సామగ్రిని నాడు-నేడు పనులకు ఉపయోగించుకుని తనకు నివాసం లేకుండా చేశారని పల్నాడు జిల్లా నరసరావుపేట అరవపల్లి గ్రామానికి చెందిన తిరుమలశెట్టి రామకోటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. దయచేసి తనకు న్యాయం చేయాలని కోరారు.

**తహసీల్దారు ఇబ్బంది పెడుతున్నారు**

తన భూమికి మ్యూటేషన్ చేసి పట్టా పాస్‌పుస్తకం జారీ చేయకుండా తహసీల్దారు, సర్వేయర్ ఇబ్బందులు కలిగిస్తున్నారని తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రి మండలం కోటిలింగాలపేటకు చెందిన మోత శ్రీనివాస వరప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. పాస్ పుస్తకం అందేలా న్యాయం చేయాలని కోరారు. తన వ్యవసాయ భూమికి సరైన దారి ఏర్పాటు చేయాలని ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం కొర్లమంద గ్రామానికి చెందిన దమ్ములపాటి అరుణ విజ్ఞప్తి చేశారు.

**బడ్డీకొట్టును ధ్వంసం చేశారు**

కరిముల్లా, మున్ని, ప్రభావతి, లింగంశెట్టి పుల్లయ్య అనే వ్యక్తులు తన డబ్బులు, ఆస్తి పత్రాలను తీసుకుని తన బడ్డీ కొట్టును ధ్వంసం చేసి సామగ్రిని రోడ్డుపై విసిరేశారని గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం రాయపూడి గ్రామానికి చెందిన మిరియాల వీర లంకమ్మ ఫిర్యాదు చేసింది. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సర్వే నెంబర్ 338/1 కింద తన భూమికి పట్టాదారు పాస్ పుస్తకం జారీ చేయాలని బాపట్ల జిల్లా కారంచేడు మండలం నాయుడువారిపాలెం గ్రామానికి చెందిన టి.వీరాంజనేయులు వినతిపత్రం అందజేశారు.







## డ్రగ్స్ రహిత రాష్ట్రమే ధ్యేయం

- కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం
- శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు
- యాంటీ డ్రగ్స్ డే కార్యక్రమం
- టెన్నిస్ క్రీడాకారుడు సాకేత్ హాజరు

విజయవాడ(చైతన్యరథం): మాదక ద్రవ్యాలను సంపూర్ణంగా నిర్మూలించగలిగితేనే రాష్ట్రాభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యపడుతుందని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలోని శాప్ ప్రధాన కార్యాలయం వద్ద అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ దినోత్సవం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అర్జున అవార్డు గ్రహీత, అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు సాకేత్ మైనేని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అందరి భాగస్వామ్యంతో డ్రగ్స్ మహమ్మారిని తరి మికొట్టాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ మత్తులో ఆడబిడ్డలపై అనేక అత్యాచారాలు జరుగుతున్నాయని, ఆడబిడ్డల జోలికొస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. సీఎం చంద్రబాబు గంజాయి, మత్తుపదార్థాలపై ఉక్కుపాదం మోపారని, ఆ దిశగా కూటమి ప్రభుత్వం పక్కా ప్రణాళికలతో పనిచేస్తుందని వెల్లడించారు. డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ టీమ్‌ను కూడా నియమించిందన్నారు. క్రీడాకారులు కూడా స్వచ్ఛందంగా ముందుకొచ్చి విస్తృత ప్రచారం చేయాలని కోరారు. రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నియంత్రణకు స్పోర్ట్స్ అథారిటీ కూడా పూర్తిస్థాయిలో కృషి చేస్తుందని వివరించారు. టెన్నిస్ క్రీడాకారుడు సాకేత్ మైనేని మాట్లాడుతూ సమాజం బాగుండాలంటే ప్రతిఒక్కరూ గంజాయి, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. యువత నచ్చిన క్రీడను ఎంచుకుని రాణిస్తే వారి భవిష్యత్తు బంగారు మయంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శాప్ పరిపాలనాధికారి ఎస్.వెంకటరమణ నాయక్, ఎన్టీఆర్ జిల్లా డీఎస్‌డీవో అజీజ్, శాప్ కోచ్ కోటేశ్వరరావు, పెద్దఎత్తున క్రీడాకారులు పాల్గొన్నారు.

# నయవంచనకు నిజరూపమే.. జగన్!



అప్రతిహతంగా దూసుకుపోతున్న కూటమి ప్రగతి పాలనను జీర్ణించుకోలేకపోతున్నారు.. వైఫల్య పాలకుడు జగన్‌రెడ్డి. కూటమి హామీల అమలును ప్రశ్నిస్తూ ప్రజల్లో మొసలి కన్నీరు కార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం వింతల్లోకెల్లా వింత! అయాచితంగా అందిన ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలను నిలువునా ముంచిన జగన్ రెడ్డి.. తానే ప్రజోద్ధారకుడినంటూ జనంలోకి జగన్ రావడం విడ్డూరాల్లోకెల్లా విడ్డూరం! జగన్ అబద్ధాలు జనానికి తెలీంది కాదు. గద్దెనెక్కిన వారంలోనే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేస్తానని ఇచ్చిన హామీని ఐదేళ్లలోనూ నిలబెట్టుకోలేకపోయారు. ప్రతి జనవరి 1న జాబ్ కేలండర్ విడుదలంటూ హామీ ఇచ్చి.. ఐదేళ్ల పదవీకాలంలో ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేకపోయారు. అబద్ధాల రాజకీయం, మోసకారి పాలననే నమ్ముకున్న జగన్.. సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని దశలవారీగా అమలు చేస్తానని అక్క చెల్లెమ్మలకు వాగ్దానం చేశారు. మద్యపాన నిషేధం అమలు మాట అటుంచి.. నాసిరకం మద్యంతో అక్కచెల్లెమ్మల మాంగల్యాలను పుటుక్కున తెంపేసిన తెంపరి జగన్‌రెడ్డి. మునుపటి చంద్రబాబు సర్కారు జనంపై విద్యుత్ బిల్లుల భారం మోపారని అవాస్తవాలపై నానా యాగీ చేసిన జగనే.. గద్దెనెక్కగానే 'ట్రూ అప్'లు, 'ఇంధన సర్దుబాట్లు' సాకుతో బాదుడే బాదుడుకు పాల్పడిన విషయాన్ని మరచినట్టున్నారు. 45 ఏళ్లకే సామాజిక భద్రతా పింఛను ఇస్తానని ఇచ్చిన హామీ ఏమైంది? జగన్ జమానా మొత్తం అబద్ధాల అమలుతో జనాన్ని పల్టీలు కొట్టించించి నిజం కాదా? అబద్ధాల మీద అబద్ధాలతో రికార్డుల మీద రికార్డుల బద్దలుకొట్టిన అపసవ్య పాలకుడికి.. కూటమి హామీల అమలును ప్రశ్నించే హక్కెక్కడిది? ఇచ్చిన మాటమేరకు ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూనే.. సంక్షేమ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోన్న కూటమి సర్కారుపైకి –జనాన్ని కూడగట్టాలనుకోవడం జగన్‌ది సాహసమే!

జగన్ జమానాలో –రాజ్యాంగ వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. శాంతిభద్రతలు మంటగలిశాయి. ప్రశ్నించిన ప్రతి ఒక్కరిపై కేసులుపెట్టి లాఠీలతో కుళ్ల బొడిపించిన ఘట్టాలను ప్రజలింకా మరువలేదు. అప్పుడు అధికారమదాన్ని ప్రదర్శించి.. అది కాస్తా చేజారక అమయకత్వాన్ని ప్రదర్శిస్తే నమ్మడానికి ప్రజలు అమాయకులు కాదు. జగన్ విధ్వంసం నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న రాష్ట్రం.. కూటమి ప్రగతి పాలనలో వికాశం దిశగా అడుగులేస్తోంది. జగన్ కంటగింపునకు కారణమిదే! కూటమి ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలవ్వడం లేదంటూ విష ప్రచారానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్న జగన్.. తన పాలనలో ఎన్ని హామీలు అమలయ్యాయో ప్రజా ప్రశ్నలకు ముందు సమాధానం చెప్పాలి. 2019 ఎన్నికల సమయంలో ఎంతమంది పిల్లలుంటే అందరికీ అమ్మఒడి ఇస్తానని నెత్తిన ఒట్టేసి అధికారంలోకి వచ్చిన జగన్.. గద్దె నెక్కగానే ఒక్కరికే ఇచ్చి చేతులు దులుపుకోవడమే అసలైన మోసం. రూ.15 వేలు ఇస్తానని రూ.13 వేలకు కోతెయ్యడం.. 83 లక్షలమంది పిల్లలకు ఆశపెట్టి.. సగంమంది పిల్లలకు కర్కశంగా కోతెయ్యడం అసలు మోసమంటే! జగన్ జమానాలో తామెంత మోసపోయిందీ రాష్ట్ర ప్రజలు మర్చిపోతారనుకుంటే ఎలా? 'అమ్మఒడి' కింద జగన్ రెడ్డి చేసిన ఖర్చు రూ.5,540 కోట్లు. 67.27 లక్షల పిల్లలకు 'తల్లికి వందనం' అమలు చేస్తూ.. కూటమి ప్రభుత్వం అందిస్తోన్న సంక్షేమం దాదాపు రూ.10వేల కోట్లు. జగన్ జమానాకంటే 25 లక్షలమందికి అదనంగా కూటమి 'సంక్షేమం' అందుతోంది. ఏం ముఖం పెట్టుకుని 'కూటమి హామీల'మీద జనంలో యాగీ చేస్తారో జగనే చెప్పాలి!

సంక్షేమాన్ని ఏకమొత్తంగా అందుకున్న లబ్దిదారులు విశ్వసిస్తారా? 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ 2024 వరకు రూ.2వేల పింఛన్‌ను రూ.3వేలు చేయడానికి ఐదేళ్ల సమయం పట్టింది. దివ్యాంగులకు ఒక్క రూపాయీ పెంచలేదు. దివ్యాంగులకిచ్చే రూ.3 వేల పింఛను రూ.6 వేలకు, తీవ్ర అనారోగ్యంతో మంచానపడినవారికి రూ.5 వేల పింఛను రూ.15 వేలకు, కిడ్నీ, కాలేయం, గుండె మార్పిడి చేసుకున్న వారికి, డయాలసిస్ స్టేజ్ కాకుండా ఇంకా ముందున్న కిడ్నీ వ్యాధిగ్రస్తులకు పింఛను కింద అందే రూ.5 వేల మొత్తాన్ని రూ.10 వేలకు చేర్చింది చంద్రబాబు నాయకత్వంలోని కూటమి సర్కారు కాదని జనంమధ్య జగన్ చెప్పగలరా? జగన్‌రెడ్డి సర్కారు పింఛన్ల కోసం నెలకు వెచ్చించింది రూ.1,939 కోట్లు. కూటమి అధికారంలోకి వచ్చాక దేశంలోనే అతిపెద్ద ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పథకం కింద నెలకు రూ.2,834కోట్లు వెచ్చిస్తూ.. ఒక్క పింఛన్లకే ఏడాదికి రూ.34 వేల కోట్లు, ఐదేళ్ళల్లో రూ.1.7 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నది నిజం కాదని జగన్ ఏరీతిన చెబుతారు?



తొలి ఏడాదిలోనే కూటమి సాధించిన విజయాలు కోకొల్లలు. సామాజిక పింఛన్ల పెంపు పథకం. ఆర్థిక కష్టాలకు వెరవకుండా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, చేనేత, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, డప్పుకళాకారులు, హిజ్రాలు, హెచ్‌ఐవీ బాధితులు, కళాకారులకు అప్పటివరకు అందుతున్న రూ.3 వేల పింఛన్‌ను ఒకేసారి రూ.4 వేలకు పెంచిఇచ్చిన హామీ... కూటమి అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచే అమలవుతున్నది కాదని చెప్పగలరా? ప్రభుత్వం ఏర్పాటవ్వక ముందురోజుల (ఏప్రిల్) నుంచే పెంపును వర్తింపజేసి.. జులై 1న పింఛను కింద ఏకమొత్తంగా రూ.7 వేల చొప్పున ఇచ్చింది అబద్ధమని చెబుతారా? జగన్ అబద్ధాన్ని చెప్పినా..

పేదోడి నోటిదగ్గర కూడు లాగేసి.. అన్న క్యాంటీన్ల రద్దుతో నిరుపేదను పస్తులు పెట్టింది జగన్ సర్కారు. చంద్రబాబు గద్దెనెక్కిన మరుక్షణమే.. 204 అన్న క్యాంటీన్లను పునరుద్ధరించి సగటున రోజుకు 3 లక్షలమందికి అల్పాహారం, భోజనం అందిస్తూ అన్నార్తుల ఆకలి తీరుస్తోన్న ఘట్టం నిజం కాదని జగన్ ఎలా చెబుతారు? దీపం–2 పథకం ప్రారంభించి 2025 మార్చినాటికి తొలి విడత కింద 1.15 కోట్లమందికి ఉచిత సిలిండర్ అందించింది చంద్రబాబు సర్కారే. ఏడాదికి 3 ఉచిత సిలిండర్ల హామీ నెంవేరుస్తున్నదీ ఎన్డీయే సర్కారే. జగన్ ఐదేళ్లలో చేయనిపనికి చెంపపెట్టుగా.. ఒకేసారి 16,347 ఉపాధ్యాయ నియామకాలకు జింబో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలచేసిందీ కూటమి ప్రభుత్వమే. ఏది నిజం కాదని, ఏ హామీ అమలవ్వలేదని జగన్ జనంలోకి వస్తారు?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉపాధిరంగానికి ఊతమిచ్చేలా ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసింది. 9.4 లక్షల కోట్లు పెట్టుబడుల ఒప్పందాల ద్వారా ఏడున్నర లక్షలమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. జగన్ భూదందాకు చెక్ పెడుతూ.. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుచేసి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించింది కూటమి సర్కారు. సబ్‌ప్లాన్ నిధులు దారిమళ్ళించకుండా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల స్వయం ఉపాధి పథకాలకు ఖర్చు, సుప్రీం కోర్టు తీర్పుమేరకు ఎస్సీ వర్గీకరణ అమలు, ఇంటర్ విద్యార్థులకు తిరిగి మధ్యాహ్న భోజనం ప్రారంభం, గంజాయి, డ్రగ్స్, ల్యాండ్, శాండ్, వైన్, మైన్ మాఫియాలపై ఉక్కుపాదం, గుంతలమయమైన 20వేల కిలోమీటర్ల రోడ్ల (జగన్ జమానాలో ఇదే రోడ్లమీద ప్రమాదాల్లో 43వేలమంది మృతిచెందారు) మరమ్మతులు, అన్నదాత సుఖీభవ పథకం కింద సుమారుగా 55 లక్షల మంది రైతులకు ఆర్థిక సాయం అందించబోతున్నదీ చంద్రబాబు పాలనే. సేద్యం ఖర్చులు నియంత్రించి.. దిగుబడులు పెంచేందుకు అత్యాధునిక వ్యవసాయావిష్కరణకు శ్రీకారం చుట్టిందీ బాబు ప్రభుత్వమే. జగన్ హయాంలో అన్నదాతల ఆత్మహత్యల్లో దేశంలోనే ఏపీ మూడో స్థానానికి ఎగబాకిన విషయాన్ని ఆంధ్ర రైతులు మర్చిపోగలరా? విత్తనంనుంచి పంట కొనుగోలు వరకు ప్రతి ఒక్క రైతుకూ తోడున్నామన్న జగన్ బడాయి కబుర్ల నిగ్గు.. రాష్ట్రంలో కడతేరిన సాగుదారుల బతుకులెన్నో ఎన్సీఆర్బీ గణాంకాలు అద్దంపట్టలేదా? రైతు భరోసా కేంద్రాలు దళారి వ్యవస్థలుగా మారి దారుణ దోపిడీకి పాల్పడిన భయానక ఘట్టాలు వాస్తవాలు కాదని ఎవరు మాత్రం అనగలరు?

ఏడాదికే ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత పెల్లుబుకుతోందని పచ్చి అబద్ధాలను భుజాన మోసుకొస్తున్న జగన్.. తన పాలనా వైఫల్యాలను ప్రజలు మళ్లీ మళ్లీ గుర్తు చేసుకునేలా చేస్తున్నారని గ్రహించకపోవడం వైసీపీ గ్రహపాటు. ప్రభుత్వ వనరులను కొల్లగొట్టి, నాసిరకం మద్యం సరఫరా చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన జగన్‌రెడ్డి.. ఇప్పుడు ప్రవచనాలు పలికితే వినేందుకు ప్రజలు సిద్ధంగా లేరు. అపర సత్యహరిశ్చంద్రుడినంటూ జగన్ పలుకుతున్న అర్థంలేని డాంబికాలు వినడానికే రోత. చెయ్యాల్సిన దురాగతాలన్నీ చేసేసి.. రాక్షస పాలనతో రాష్ట్రాన్ని విధ్వంసానికి గురిచేసి.. ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి, పత్రికా స్వేచ్ఛ గురించి, అణచివేతల గురించి మాట్లాడటం –దెయ్యాలు వేదాలు వల్లించడమే! తన ఉనికే ప్రశ్నార్థకమైందన్న ఉక్రోషంతోనే కూటమి పాలన బుదరజల్లే ఉద్యమాలకు బుట్టలల్లడం –మాజీ ముఖ్యమంత్రి స్థాయిని దిగజార్చుకోడవమే. కూటమి పాలనలో అణచివేతలు పెరిగాయంటూ –గేమింగ్, గంజాయి బ్యాచ్‌లను వెనకేసుకొస్తూ.. ప్రజలను మభ్యపెట్టడం సాధ్యం కాదని జగన్ గుర్తెరగాలి. ప్రజాస్వామ్యంలో ఉన్నామన్న వాస్తవాన్ని మరచి నియంతలా వ్యవహరించిన జగన్.. ఇప్పుడు ఇదెక్కడి ప్రజాస్వామ్యమంటూ గగ్గోలుపెట్టే మేకవన్నె వ్యవహారాలను దగాపడిన ప్రజలు ఎప్పటికీ నమ్మరుగాక నమ్మరు. ఏడాది కూటమి పాలనలో విధ్వంసంనుంచి వికాశం దిశగా ఆంధ్ర అడుగులేస్తుందన్నది వాస్తవ దృశ్యం. కూటమి ఇచ్చిన హామీలు 70శాతం పైన అమల్లోకి వచ్చాయన్నది పిచ్చి నిజం. అబద్ధాలను భుజాన మోస్తూ.. కూటమి హామీలపై జనంమధ్య మొసలికన్నీరు కార్చే ప్రణాళికలను జగన్ సిద్ధం చేసుకోవడం వృధాప్రయాశ. ప్రజల ముందుకెళ్లేముందు ప్రజాభిప్రాయాన్ని సేకరించుకోవడం –జగన్‌కు ఎంతైనా శ్రేయస్కరం!!

**- నీరుకొండ ప్రసాద్**

# జీవాలకు బీమా భరోసా... పాడి రైతులను ఆదుకునేందుకు చర్యలు

**●ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి అచ్చెన్నాయుడు**



టెక్కలి (చైతన్యరథం): పశుపోషణ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు పశువులకు బీమా భరోసా కల్పిస్తున్నామని, ఇప్పటికే మరణించిన పశువుల బీమా కింద ప్రభుత్వం రూ.103 కోట్లు విడుదల చేసినట్లు ఆయన వివరించారు. శ్రీకాకుళం జిల్లా, టెక్కలి నియోజకవర్గంలోని కోటబొమ్మాళి గ్రామ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో గురువారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పాడిరైతులకు అండగా నిలవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, గడచిన ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన పశువుల బీమా అంశాన్ని తమ ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకున్నదని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2025-26 సంవత్సరానికి సంబంధించి 1.76 కోట్ల గొర్రెలు, 55 లక్షల మేకలతో కలిపి మొత్తం 2.31 కోట్ల జీవాలకు ఉచితంగా నట్టల నివారణ మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జూన్ 26 నుంచి జూలై 10 వరకు ఈ సామూహిక మందుల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

రైతులు సాంప్రదాయ సాగుకు పరిమితం కాకుండా, లాభసాటి పంటలవైపు దృష్టి సారించాలన్నది ప్రభుత్వ ఆకాంక్ష అని మంత్రి స్పష్టం చేశారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను ప్రవేశపెట్టి, డ్రిప్, స్ప్రింక్లర్ వంటి పరికరాలపై 90 శాతం సబ్సిడీ అందించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఫామ్ ఆయిల్, కో కో వంటి ఆర్థికంగా లాభదాయకమైన పంటల సాగు చేయడం ద్వారా ఎకరానికి సంవత్సరానికి రూ.2 లక్షల ఆదాయం పొందవచ్చని వివరించారు. అంతర పంటలుగా సాగు చేయడం వల్ల తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని సూచించారు.

రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి నగదు చెల్లింపులు 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయని, ఇది ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. అన్న క్యాంటీన్ల ఏర్పాటు, ఉపాధి హామీ పనులు, రహదారుల అభివృద్ధికి నిధుల విడుదల వంటి అంశాలపై మాట్లాడిన మంత్రి, ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో కోటబొమ్మాళికి అన్న క్యాంటీన్ మంజూరు చేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ పనులకు రూ.200 కోట్లు మంజూరు చేసి, 54 రహదారి పనులు ప్రారంభించామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఆగస్టు 15 నుంచి అమల్లోకి రానుందని, వచ్చే నెల నుంచి గ్యాస్ సబ్సిడీ మొత్తాలను వారి ఖాతాల్లో ముందుగానే జమ చేయనున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త సంచాలకులు కంచరాన రాజగోపాల్, టెక్కలి ఉప సంచాలకులు పోతనపల్లి చంద్రశేఖరరావు, పశుసంవర్ధక శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సహకార సంఘాల నాయకులు, పశు వైద్యులు, మండల సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రగ్స్ బారిన పడకుండా యువతను కాపాడుకుందాం

**● డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర**



పార్వతీపురం (చైతన్యరథం): ప్రపంచంలో ఎక్కువమంది యువత గల దేశం, భారతదేశం అని అలాంటి యువత డ్రగ్స్ బారిన పడి చెడిపోతున్నారని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ఆవేదన వెలిబుచ్చారు. డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే విజయ్ చంద్ర, జిల్లా కలెక్టర్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దురదృష్టవశాత్తు వైసిపి పరిపాలనలో రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియా విపరీతంగా పెరిగిపోయిందని పేర్కొన్నారు. చెట్టు నాటమంటే గంజాయిచెట్లు నాటారని, వ్యాపారాలు చేయమంటే గంజాయితో వ్యాపారం చేసి యువతను చెడు వ్యసనాలకు బానిసలు చేశారని మండిపడ్డారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గంజాయి నిర్మూలన కోసం ప్రత్యేక వ్యవస్థను రూపొందించి అమలు చేస్తున్నారని వివరించారు ప్రధాన నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతూ వారికి మంచి ఉపాధి కల్పించి సమాజంలో మంచి పౌరులుగా ఎందుకు చర్యలు చేపట్టారని వెల్లడించారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలు నడవడికను గుర్తించి చెడు వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పిల్లలు చెడు వ్యసనాలకు బానిసలు అయితే కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమైపోతుందని పేర్కొన్నారు డ్రగ్స్ నిర్మూలనకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పోలీస్ అధికారులు, విద్యార్థులు, టీడీపీ, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ శ్రీకాకుళం సేవలు భేష్ : గొండు శంకర్




శ్రీకాకుళం (చైతన్యరథం): రోటరీ క్లబ్ శ్రీకాకుళం సేవలు భేష్ అని, శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం జిల్లా, సింగుపురం కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో విద్యార్థులకు సుమారు ఆరు లక్షల విలువగల పరుపులను రోటరీ క్లబ్ శ్రీకాకుళం అధ్యక్ష బృందం గురువారం అందించారు. ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలితకు, 225 పరుపులు అందించిన అనంతరం మాట్లాడుతూ... రోటరీ క్లబ్ శ్రీకాకుళం అధ్యక్షులు ముని శ్రీనివాస్ బృందం, విద్యార్థులకు అవసరమైన సామాగ్రిని అందించి ఉదారత చాటుకున్నారని కొనియాడారు. రోటరీ క్లబ్ శ్రీకాకుళం సేవలు విస్తృతం కావాలన్నారు. ఈ రోజు విశిష్ట అతిథిగా సమగ్రశిక్ష అభియాన్ డా. శశిభూషణ్ పాల్గొనటం ఆనందంగా ఉందని, రోటరీ ఆలోచనా విధానాలు, సేవలు ఆలోజింపజేస్తాయన్నారు. విద్యార్థులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ బాబు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే తపనతో ముందుకు వెళ్తున్నారని, విద్యార్థులు బాగా చదువుకొని, ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, అది చేరేవరకు కృషి చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే, రోటరీ క్లబ్ శ్రీకాకుళం అధ్యక్షులుమని శ్రీనివాస్, సెక్రటరీ దూసి సంతోష్, కోశాధికారి సూర్య పసగాడా లకు దుస్సాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందించి శుభాభినందనలు తెలిపారు.

# అంతర్జాతీయ ప్రమాణాలతో వీఆర్సీ పాఠశాల సిద్ధం

- **వీఆర్సీ పాఠశాలను ప్రారంభించనున్న నారా లోకేష్**
- **రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణతో కలిసి పరిశీలించిన కుమార్తె షరీణి**
- **భారతదేశంలోనే నెల్లూరు స్కూల్స్‌ను మోడల్‌గా నిలబెట్టడమే లక్ష్యం**
- **వీఆర్సీ ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి**



నెల్లూరు (చైతన్యరథం): అంతర్జాతీయ ప్రమాణాలతో సిద్ధమవుతున్నటువంటి వీఆర్సీ పాఠశాలను రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ మరియు కుమార్తె షరిణి కలిసి పరిశీలించారు. సర్వాంగ సుందరంగా వీఆర్ హై స్కూల్ ప్రారంభానికి సిద్ధమైంది. క్రీడా మైదానం ఎంతో ఆకర్షియంగా ఉందని.. డిజిటల్ విద్యను అందించేందుకు.. గదులు ల్యాబ్లు.. మ్యూజిక్, డాన్స్ రూములో ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో పాఠశాలను పరిశీలించిన మంత్రి ముందుగా వీఆర్సీ పాఠశాలలో ఉపాధ్యాయులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులకు బోధన అంశాలు పిల్లల సంరక్షణపై వారికి దిశా నిర్దేశం చేశారు. వీఆర్సీ ఉపాధ్యాయులు అందరికీ ఆదర్శంగా నిలవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ గారు మీడియాతో మాట్లాడారు ఎన్సిసి సిబ్బంది, కార్పొరేషన్ అధికారులు వీఆర్సీని అద్భుతంగా తీర్చిదిద్దారని కొనియాడారు.. పనులను శరవేగంగా నిర్వహించినందుకు ఎన్సిసి సిబ్బందిని మంత్రి అభినందించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో సిద్ధమవుతున్నటువంటి వీఆర్సీని విస్తృత ప్రచారం చేసిన మీడియా ప్రతినిధులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.. అడ్మిషన్స్ కోసం 5000 మంది దరఖాస్తు చేసుకున్నారని.. అయితే వాటిలో 1050 మంది నిరుపేదలైనటువంటి వారికే అవకాశం కల్పిస్తున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు.. వి ఆర్ సి తరహాలోనే సిటీలో మరో పదకొండు హై స్కూల్ పాఠశాలలను ఏడాది లోపు సిద్ధం చేస్తామని తెలిపారు.. వచ్చే నాలుగేళ్లలో మిగిలిన స్కూల్స్‌ని కూడా ఆధునికరిస్తామని.. భారతదేశంలోనే నెల్లూరు స్కూల్స్‌ను మోడల్గా నిలబెట్టడమే లక్ష్యమని ఈ సందర్భంగా మంత్రి ఘంటాపథంగా తెలిపారు.. ఈ అవకాశం కల్పించినటువంటి సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఆరో తరగతి నుండి తొమ్మిదో తరగతి వరకు క్లాసులు ప్రారంభిస్తామని.. బుధవారం ఒకటో తరగతి నుండి 5వ తరగతి వరకు క్లాసులు ప్రారంభమవుతాయని.. అదేవిధంగా గురువారం రోజు నర్సరీ తరగతులు నిర్వహిస్తామని, ఆరో తేదీ విద్యా శాఖ మంత్రి హై స్కూల్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, కార్పొరేషన్ కమిషనర్ నందన్, వీఆర్ హై స్కూల్ ప్రిన్సిపాల్ వెంకట్రావు, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతారెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బ్రహ్మం గుప్తా, టీడీపీ నగర అధ్యక్షులు మామిడాల మధు, 45వ డివిజన్ కో క్లస్టర్ పోకల రవి, టీడీపీ ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం



అమరావతి (చైతన్యరథం): వాయువ్య బంగాళాఖాతం ఆనుకుని ఒడిశా పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడిందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర ఒడిశా, దానిని ఆనుకుని గంగా తీర ప్రాంత పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్, ఛత్తీస్ గఢ్ మీదుగా పశ్చిమ వాయవ్య దిశగా కదిలే అవకాశం ఉంది. బంగాళాఖాతంలో గురువారం ఏర్పడిన అల్పపీడనంతోపాటు నిన్నటి నుంచి ఉపరితల ఆవర్తనం కొనసాగుతుంది. వీటి ప్రభావంతో ఉత్తర కోస్తాలో ఒకటి లేదా రెండుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉత్తర కోస్తా, యానం, దక్షిణ కోస్తా, రాయలసీమలో ఒకటి లేదా రెండుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఉత్తర కోస్తా, యానం, దక్షిణ కోస్తా, రాయలసీమలో ఒకటి లేదా రెండుచోట్ల 50-60 కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది. గురువారం పోలవరం, తిరువూరు, అనకాపల్లిలో 5సెం.మీ చొప్పున వర్షపాతం నమోదు కాగా.. రాజమహేంద్రవరం, విశాఖపట్నం, చింతలపూడి, పెద్దాపురం, మాచర్లలో 4 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

**●మాదకద్రవ్యాలు తీసుకోవడం ఆరోగ్యానికి హానికారం : బండారు**



కొత్తపేట (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం మాదకద్రవ్యాలు వినియోగంపై కఠిన చర్యలు తీసుకొని గంజాయి ఆంధ్రప్రదేశ్ అన్న మచ్చను తొలగించి అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్ అనే విధంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యేక మంత్రుల కమిటీ నిత్యం పర్యవేక్షణ చేస్తుందని.. డ్రోన్లు జీపిఎస్ ట్రాకింగ్, బ్లాక్ చైన్ టెక్నాలజీ ఆధారిత సీసీ టీవీలు, సాంకేతిక పరిజ్ఞానంతో గంజాయి నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని అన్నారు. గంజాయి సాగు, రవాణా, వినియోగంపై గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేసి వారికి అవగాహన కలిగిస్తుంది.. ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన చర్యల వల్ల గంజాయి సాగు 1100 ఎకరాల నుండి 100 ఎకరాలకు చేరుకుందన్నారు. యువతలో డ్రగ్స్ వినియోగం, లిక్కర్ వినియోగం వంటివి ఎక్కువయ్యాని యువత బంగారు భవిష్యత్తుకు ఆటంకం కలిగించే ఇలాంటి వ్యసనాలు పట్ల విద్యార్థులకు తల్లదండ్రులకు నిరంతరం ప్రజాసేవలో ఉండే వారు అవగాహన కల్పించాలని కోరారు.

## డ్రగ్స్ వద్దు బ్రో... ముమ్మిడివరంలో ర్యాలీ

ముమ్మిడివరం (చైతన్యరథం): సీఐఎం మోహన్ కుమార్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద గురువారం డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమంలో కూటమి నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద పాల్గొని మాట్లాడారు. యువత డ్రగ్స్‌కు బానిసలు కాకుండా వారి విలువైన జీవితాలను తమ కుటుంబాలతో పాటు సమాజహితానికి వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తులసాయి, గొల్ల కోటి దొరబాబు, అర్ధాన్ని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణ కుమార్, ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలా సాగర్, ఐ పోలవరం ఎస్సై ఎం వివి రవీంద్రబాబు, కాట్రేనికోన ఎస్సై అవినాష్, గణిత, ఎం గంగభవాని, కె.రామ్‌కుమార్, ఎస్ శేషుబాబు, ముల‌పర్తి బాలకృష్ణ, గొల్లపల్లి గోపి, ఏళ్ల ఉదయ్, నడింపల్లి శ్రీనివాసరాజు, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువత, పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలు సమాజాన్ని నాశనం చేస్తాయి

**◆ గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**




గుడివాడ (చైతన్యరథం): మత్తు పదార్థాలు సైలెంట్ కిల్లర్లులా పనిచేస్తూ సమాజాన్ని నాశనం చేస్తాయని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆవేదన వ్యక్తం చేశారు. సరదాగా మొదలయ్యే డ్రగ్స్ వినియోగం వ్యసనంలా మారుతుందని అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని... గుడివాడ పట్టణ వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం నిర్వహించిన అవగాహన ర్యాలీలో, అధికార యంత్రాంగం, విద్యార్థులు,యువతతో కలిసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు. పురపాలక సంఘ కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ..మార్కెట్ సెంటర్, వాసవి చౌక్, ఏజికే స్కూల్ సెంటర్ మీదుగా కైకాల కళామందిర్ వద్దకు చేరుకుంది. ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు,యువత, మత్తు పదార్థాలు వద్దు వద్దని, సామూహిక సంకల్పం సమాజ శ్రేయస్సు అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ.... మాదకద్రవ్యాల వినియోగం సరదాగా మొదలై పెద్ద వ్యసనంగా మారుతుందనీ, డ్రగ్స్‌కు బానిసైన వాళ్లకు సమాజంతో పనిలేదని ఉన్మాదుల్లా మారి సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతారని ఆయన అన్నారు.మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో అందరం భాగస్వామ్యం కావాలని,మత్తు పదార్థాలకు సంబంధించి సమాచారం తెలిస్తే 1972కి కాల్ చేయాలని, తద్వారా ఒకరి జీవితాన్ని బాగు చేయడమే కాక సమాజానికి మంచి చేసిన వారవుతామని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం డ్రగ్స్, గంజాయిని ఉక్కుపాదంతో అణచివేస్తోందని తెలిపారు. డ్రగ్స్ వల్ల ఆ కుటుంబమే కాదు.. సమాజంపై కూడా తీవ్ర ప్రభావం పడుతోందని అన్నారు. నేడు యువత ఎక్కువగా డ్రగ్స్, గంజాయికి బానిసలు కావడం ఆందోళన కలిగిస్తోందని ఎమ్మెల్యే రాము అన్నారు. ముఖ్యంగా గుడివాడ నియోజకవర్గంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగంపై పోలీసు యంత్రాంగం ఉక్కు పాదం మోపేలా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు.

**సత్ఫలితాలు ఇస్తున్న ఈగల్ టీం**

డ్రగ్స్, గంజాయి నియంత్రణకు సీఎం చంద్రబాబు ఏర్పాటు చేసిన ఈగల్ టీం సత్ఫలితాలను ఇస్తుందని అధికారులు తెలిపారు. ఏపీలో గత ఐదేళ్లుగా గంజాయి, డ్రగ్స్ రవాణా పెరిగిపోయిందని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో డ్రగ్స్, గంజాయి రవాణాను నిరోధించామని ఏపీ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు అన్నారు.ప్రజల్లో కూడా వీటిపై మరింత చైతన్యం రావాలని పిలుపునిచ్చారు. నో డ్రగ్, నో ఎడిక్షన్ అనే నినాదం అందరిలో ఉండాలని కూటమి నాయకులు పేర్కొన్నారు. అనంతరం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ఎమ్మెల్యే రాము, అధికారులు, కూటమి నాయకులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

## డ్రగ్స్ వ్యసనంతో విద్యార్థుల బంగారు జీవితాలు చీకటిమయం

**● మండపేటలో ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ ర్యాలీ**




మండపేట (చైతన్యరథం): మాదక ద్రవ్యాల వ్యసనం విద్యార్థుల బంగారు జీవితాలను చీకటిమయం చేస్తుందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండపేట టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీని ఎమ్మెల్యే వేగుళ్ళ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ముఖ్యంగా కొన్ని మాదక ద్రవ్యాలను కొందరు విద్యార్థులు సరదాగా అనుకుని మొదలు పెట్టే ఆపై విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఒకసారి వీటికి అలవాటు పడితే ఇక వారు జీవితంలో కోలుకోలేరన్నారు. వీటి బారిన పడిన వారు డబ్బు కోసం నేరాలు చేసే స్థాయికి సైతం దిగజారిపోతారని, వీటి పట్ల విద్యార్థులు, ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులు తమ బిడ్డల అలవాట్లను గమనించుకోవాలన్నారు. మందు, గంజాయి వంటి ప్రమాదకర అలవాట్లు దరిచేరకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో వేలాదిమంది విద్యార్థులతో ర్యాలీ సందడిగా మారింది. మండపేట టౌన్ సీఐ డి.సురేష్ పర్యవేక్షణలో టౌన్ ఎస్.ఐ చంటి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండపేట మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు వర ప్రకాష్, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి దొరబాబు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం

**● డ్రగ్స్ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి... శాంతి, ఆర్థిక భద్రతకు డ్రగ్స్ అవరోధం**

**● రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్**



రామచంద్రపురం, జూన్ 26: మాదకద్రవ్యాలు లేని సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా రామచంద్రపురంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన ర్యాలీను మంత్రి సుభాష్ జెండా ఊపి ప్రారంభించారు.తొలుత విద్యార్థులు,యువతతో డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థను చిన్నాభిన్నం చేసే మాదకద్రవ్యాలు పట్ల విద్యార్థులు,యువత, ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యేక మంత్రుల కమిటీ నిత్యం పర్యవేక్షణ చేస్తుందని, డ్రోన్లు జీపిఎస్ ట్రాకింగ్, బ్లాక్ చైన్ టెక్నాలజీ ఆధారిత సీసీ టీవీలు, సాంకేతిక పరిజ్ఞానంతో గంజాయి నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని అన్నారు. గంజాయి సాగు, రవాణా, వినియోగంపై గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేసి వారికి అవగాహన కలిగిస్తున్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన చర్యల వల్ల గంజాయి సాగు 1100 ఎకరాల నుండి 100 ఎకరాలకు చేరుకుందన్నారు. గంజాయి సాగు లేని రాష్ట్రంగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తామన్నారు. యువతలో డ్రగ్స్ వినియోగం, లిక్కర్ వినియోగం వంటివి ఎక్కువయ్యాని యువత బంగారు భవిష్యత్తుకు ఆటంకం కలిగించే ఇలాంటి వ్యసనాలు పట్ల విద్యార్థులకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని కోరారు. మాదకద్రవ్యాలు తీసుకోవడం, మద్యపానం సేవించి డ్రైవింగ్ చేయడం వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు జరిగి ఎన్నో కుటుంబాలు కష్టాలు పాలవుతున్నారు. దేశం నుంచి గంజాయి వంటి మత్తు పదార్థాలను సమూలంగా తరిమివేసినప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. గత వైసిపి పాలనలో గంజాయి సాగు విచ్చలవిడిగా సాగిందని ధ్వజమెత్తారు. గంజాయికు బానిసగా మారి పోలీసులపై తిరగబడే వారికి పరామర్శలు, పలకరింపులు పేరిట ప్రోత్సాహం కలిగించే చర్యలను వైసీపీ నేత జగన్మోహన్ రెడ్డి ఇకనైనా మానుకోవాలని ఆక్షేపించారు.

## ఆరోగ్యకరమైన అలవాట్లే సమాజానికి హితవు

**◆ ఏలూరులో యాంటీ డ్రగ్స్ ర్యాలీలో పాల్గొన్న బడేటి చంటి**




ఏలూరు (చైతన్యరథం): మాదక ద్రవ్యాల వినియోగం వల్ల తలెత్తే విషమ పరిస్థితులపై యువత పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఏలూరు జిల్లా యంత్రాంగం పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. దీనిలో భాగంగా ఏలూరులోని పోలీసు పెరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత డ్రగ్స్ వినియోగానికి వ్యతిరేకంగా విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు హ్యాండ్‌ప్రింట్స్ వేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన అలవాట్లే సమాజానికి హితమన్నారు. ఇదేక్రమంలో హ్యాపీ ఏలూరుగా జిల్లాను తీర్చిదిద్దేందుకు యువత సహకరించాలని సూచించారు. జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల తలెత్తే ప్రమాదాలపై యువత అవగాహన కలిగి ఉండాలన్నారు. ఒకవేళ ఎవరైనా డ్రగ్స్‌కు బానిసలైతే వారికి కౌన్సిలింగ్ ఇస్తామని, ఏ ప్రాంతంలో అయినా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. జేసి ధాత్రిరెడ్డి మాట్లాడుతూ కుటుంబం, సమాజంపై అలవాట్లే ప్రభావం చూపుతాయన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆమె సూచించారు. అనంతరం సీఆర్ఆర్ డిగ్రీ కళాశాల నుండి స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ శ్రీలత, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవులయ్య, ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడలో డ్వాక్రా బజార్ల ఏర్పాటు

**●మెప్మా డిపార్ట్మెంట్ అధికారుల సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్ దిశానిర్దేశం**



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ నగర పరిధిలో డ్వాక్రా సంఘాలు, అభివృద్ధి కోసం వారు తయారు చేస్తున్న ఉత్పత్తులు మార్కెటింగ్ చేయటం కోసం డ్వాక్రా బజార్లు ఏర్పాటు చేయాలని, తద్వారా స్వయం ఉపాధి ద్వారా ఆర్థికాభివృద్ధి జరుగుతుందని, అప్పుడు మాత్రమే సీఎం చంద్రబాబునాయుడు ఆశయం ఒక కుటుంబంలో ఒక వ్యాపారవేత్త అభివృద్ధి చెందుతారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. విజయవాడ మెప్మా డిపార్ట్మెంట్ అధికార యంత్రాంగంతో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ గురువారం తన కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకోవటానికి అలాగే యువత యువకులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించటం కోసం కుటీర పరిశ్రమల ద్వారా మహిళా సాధికారత సాధించటం కోసం ప్రత్యేకమైన ప్రణాళికలతో పనిచేస్తుందన్నారు. ఎంపీగా తన నియోజకవర్గంలో ప్రభుత్వం ద్వారా చేస్తున్న కృషితో పాటుగా ప్రత్యేకంగా కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలియజేశారు. ప్రధానంగా విజయవాడ నగరంలో వున్న దాదాపు పద్నాలుగు వేల డ్వాక్రా గ్రూపులు వారి వారి అవసరాలను బట్టి స్వయం ఉపాధికి కుటీర పరిశ్రమల కామన్ పెసిలిటీ సెంటర్స్ ద్వారా ట్రైనింగ్ ఇవ్వాలని సూచించారు. ఇందులో ప్రధానంగా టైలరింగ్, మిల్లెట్స్ ప్రొడక్ట్స్ తయారీ, పేపర్ బ్యాగులు, విస్తారాకులు తయారీకి శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు. అలాగే కామన్ పెసిలిటీ సెంటర్స్ ఉత్పత్తులు తయారు చేసే వారికి మార్కెటింగ్ జరిగే విధంగా ఒకే బ్రాండ్‌తో ఉత్పత్తి అమ్మకాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని దానికి అవసరమైన విధంగా ప్రభుత్వ పరంగా, కేశినేని ఫౌండేషన్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. మహిళలకు కావాల్సిన వృత్తి నైపుణ్య శిక్షణకు కావాల్సిన ట్రైనింగ్ ను కూడా కామన్ పెసిలిటీ సెంటర్ లో అందించటానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా పి.వో వెంకటనారాయణ, జిల్లా అర్బన్ సమాఖ్య అధ్యక్షురాలు కె.మీనాక్షి, టి.ఈలు, సి.డి.వోలు, ఎస్.డబ్ల్యులు, సి.వోలు, సి.ఎల్.ఆర్.పిలు, టి.ఎల్.ఎఫ్ ప్రెసిడెంట్లు లతోపాటు జి.వి.నరసింహారావు, సొంగా సంజయ్ వర్మ, వి.నరసింహ చౌదరి, మాదిగాని గురునాథం, సంకె విశ్వనాథం పాల్గొన్నారు.

## డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో మార్మోగిన జగ్గయ్యపేట




జగ్గయ్యపేట (చైతన్యరథం): అంతర్జాతీయ యాంటీ డ్రగ్స్ డే సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట పట్టణంలో నిర్వహించిన డ్రగ్స్ అవగాహన కార్యక్రమంలో శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్, డి.ఎస్.పి ఏజీబీ తిలక్, రూరల్ డీసీపీ కేవిఎన్ మహేశ్వరరాజు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు శ్రీరాం ధనుంజయ్ (చిన్నబాబు) తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెట్టెం రఘురాం మాట్లాడుతూ... యువత భవిష్యత్తు కోసం మనందరం కలిసికట్టుగా పని చేయాలని, డ్రగ్స్ లాంటి వ్యసనాలు యువతను మానసికంగా, శారీరకంగా నాశనం చేస్తున్నాయని అన్నారు. ఒకసారి ఈ మాదక ద్రవ్యాలకు బానిసైతే, జీవితమే చీకట్లోకి వెళ్లిపోతుందని, అందుకే ప్రతి ఒక్కరూ డ్రగ్స్‌కి చెక్ పెట్టే విధంగా ముందడుగు వేయాలన్నారు. కుటుంబాలు, పాఠశాలలు, కళాశాలలు, పోలీస్ శాఖ, ఆరోగ్య శాఖ అందరూ కలిసి నిరంతరం అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం కఠిన చట్టాలు తీసుకువచ్చిందని, కానీ చట్టాల కంటే ముందుగా మన సంస్కారం, మన బాధ్యత కలిసివచ్చినప్పుడు మాత్రమే ఈ ప్రమాదాన్ని నిర్మూలించగలమని అన్నారు. యువత ఆత్మవిశ్వాసంతో, సరైన మార్గంలో ఎదగాలని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. డ్రగ్స్ ఎల్లప్పుడూ 'నో' అని చెప్పండి, ఆరోగ్యకరమైన జీవితం వైపు ముందడుగు వేయండి." అని పిలుపునిచ్చారు. ఇలాంటి కార్యక్రమాలు మరింత నిర్వహించి, సమాజాన్ని మేల్కొలిపేలా చేయాలని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పిలుపునిచ్చారు.

## డ్వాక్రా సంఘాలతో మహిళల ఆర్థిక ప్రగతి : ఎమ్మెల్యే నసీర్

**●ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఆర్పీలదే..**

**●గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**

**●150 మంది ఆర్పీలకు ట్యాబ్‌ల పంపిణీ**



గుంటూరు (చైతన్యరథం): డ్వాక్రా సంఘాల ఏర్పాటుతో మహిళల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరు మున్సిపల్ కార్యాలయంలో గురువారం మెప్మా రిసోర్స్ పర్సన్‌లకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా 150 మంది ఆర్పీలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ట్యాబ్‌లను పంపిణీ చేశారు. వెలుగు కార్యక్రమం ద్వారా డ్వాక్రా సంఘాల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారని, ఇది నేడు రాష్ట్రంలో లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతోందని తెలిపారు. రిసోర్స్ పర్సన్లు మహిళల ఆర్థిక పరిస్థితులు ఎప్పటికప్పుడు తెలుసుకొని వారికి ప్రభుత్వం పరంగా అందే సంక్షేమ కార్యక్రమాల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. డ్వాక్రా సంఘాల ద్వారా అతి తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తారని, వీటిని మహిళలు సద్వినియోగం చేసుకొని తమకాళ్లపై నిలబడే విధంగా ఎదగాలని చెప్పారు. సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో మహిళల ప్రగతికి బాటలు వేస్తున్నారని, వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఆర్పీలదేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీల, కార్పొరేటర్ సమత, భారతి, సంకూరి శ్రీనివాసరావు, పీడీ విజయలక్ష్మి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం : నక్కాఆనందబాబు



వేమూరు (చైతన్యరథం): రాష్ట్రాన్ని గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చటానికి స్మగ్లర్ల ఆస్తులు జాప్తు చేయడం, సాగుదారులను గుర్తించి వారికి ప్రభుత్వ పథకాలు రద్దు చేయాలనే ఆలోచనలో కూటమి ప్రభుత్వానికి ఉందని నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని మారక ద్రవ్యరహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి జిల్లాలో నార్కోటిక్ సెంటర్లు, ప్రతి పోలీస్ స్టేషన్ స్థాయిలో గ్రామ ప్రజాప్రతినిధులు గ్రామ పెద్దలు రైతులతో కలిసి పరివర్తన పేరుతో చర్చ సమావేశం నిర్వహిస్తూ గంజాయి నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు గురువారం నియోజకవర్గంలోని కొల్లూరు మండలం, కొల్లూరు గ్రామంలో మండలాల స్కూల్ పిల్లలతో కొల్లూరు వివేక స్కూల్ నుండి కొల్లూరు బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారంగా నిలబడి వేమూరు, చుండూరు పోలీస్ సర్కిల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నక్కా ఆనందబాబు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం గంజాయి నిర్మూలనపై పటిష్ట చర్యలు తీసుకోబట్టి, గంజాయి ఆంధ్రప్రదేశ్ అనే మచ్చని తొలగించి అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు చర్యలు ప్రారంభించింది. రాష్ట్రాన్ని మాదకద్రవ్యాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. గంజాయి డ్రగ్స్ వంటి మారకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యేక మంత్రుల కమిటీ నిత్యం పర్యవేక్షిస్తుందన్నారు. గంజాయి వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేకంగా ఈగల్ విభాగాన్ని ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ భాగం ప్రత్యేకంగా గంజాయి సాగు రవాణా వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టి కఠిన శిక్షలు పడేలా చూస్తుందన్నారు. రాష్ట్రానికి బయటి నుండి వచ్చే స్మగ్లర్లను పట్టుకోడానికి ప్రత్యేక పోలీస్ బలగాలని డ్రోన్లు, జీపీఎస్ శాటిలైట్లు, బ్లాక్ చైన్ టెక్నాలజీ, ఏఐ టెక్నాలజీ ద్వారా గంజాయి సాగు నియంత్రణకు కూటమి ప్రభుత్వం నడుం బిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి... మీ అభిప్రాయం తెలపండి

**●ప్రతి రేషన్ డిపో వద్ద క్యూర్ కోడ్ స్కాన్ పోస్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్న మంత్రి నాదెండ్ల మనోహర్**

తెనాలి (చైతన్యరథం): రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తుందని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ కార్యాలయం నుంచి విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా రేషన్ సరుకుల పంపిణీలో నూతన విధానాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వం, ప్రతి రేషన్ డిపో వద్ద క్యూఆర్ కోడ్ పోస్టర్లు ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. రేషన్ కార్డుదారులు ఆ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాలు, ఫిర్యాదులు తెలియజేయవచ్చని పేర్కొన్నారు. అందుకోసం ఏర్పాటు చేసిన వెబ్ ఫారంలో సరైన వివరాలు నమోదు చేయగలరని సూచించారు. ఈ ఫారంలో పౌరులు ఇచ్చే అభిప్రాయాలు: ఈ నెల రేషన్ తీసుకున్నారా? సరుకుల నాణ్యతపై సంతృప్తిగా ఉన్నారా? సరైన తూకంతో సరఫరా చేశారా? డీలర్ మర్యాదగా వ్యవహరించాడా? ఎటువంటి అధిక ధరలు వసూలు చేశారా? ఇలాంటి ప్రశ్నలకు "అవును / కాదు" అని సమాధానాలు ఇచ్చే విధంగా ఉంటుంది. పౌరుల నుంచి వచ్చిన స్పందనలు నేరుగా ఉన్నతాధికారులకు చేరి, అవసరమైనచోట్ల చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ప్రజల భాగస్వామ్యం ద్వారా సేవల్ని మెరుగుపరచాలనే లక్ష్యంతో ఈ విధానం అమలు చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. "ఇంటింటా రేషన్ పేరిట మొబైల్ యూనిట్లతో పంపిణీ కన్నా ప్రస్తుతం డిపోల వ్యవస్థలో మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. నేటి నుంచి 65 సంవత్సరాల పైబడిన వృద్ధులు, దివ్యాంగుల కోసం 5 రోజుల ముందే ఇంటికే రేషన్ సరఫరా చేసే విధానం ప్రారంభమైందన్నారు. జులై రేషన్‌ను జూన్ 26వ తేదీ నుంచే పంపిణీకి చేస్తున్నట్లు వివరించారు. "ప్రజల అభిప్రాయాలే మార్గదర్శకంగా మారే ఈ వ్యవస్థలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలి" అంటూ మంత్రి నాదెండ్ల పిలుపునిచ్చారు.

## గుంటూరు డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీలో పాల్గొన్న సీఎం చంద్రబాబునాయుడు

గుంటూరు: యాంటీ నార్కోటిక్స్ డే సందర్భంగా గుంటూరులో నిర్వహించిన వాకథాన్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. అమరావతి రోడ్డులోని ఫీవర్ ఆసుపత్రి నుంచి చిల్డ్రన్ జంక్షన్ వరకు నిర్వహించిన వాక్ ప్రదర్శనలో సీఎం పాల్గొన్నారు. కాసేపట్లో.. శ్రీకన్వెన్షన్లో విద్యార్థులు, యువతతో జరిగే ముఖాముఖి సదస్సులో ఆయన ప్రసంగించనున్నారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, హోం మంత్రి వంగలపూడి అనిత తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను మాదక ద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు ఈగల్‌ను స్థాపించి గంజాయి వినియోగాన్ని అరికట్టేందుకు ఉక్కుపాదం మోపడంతో పాటు డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే.

## పార్టీ పదవులు పొందిన వారు నిబద్ధతతో పనిచేయాలి

●మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి



మార్కాపురం (చైతన్యరథం): మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అధ్యక్షతన మార్కాపురం పట్టణ, మండలాల సర్వసభ్య సమావేశం మార్కాపురం పట్టణంలోని ఎస్వీ కేపీ కాలేజ్ ఎదురుగా ఉన్న వక్కలగడ్డ మల్లికార్జున అపార్ట్మెంట్స్‌లో జరిగింది. సాయంత్రం తర్లుపాడు మండల సర్వసభ్య సమావేశం ఇదే ప్రదేశంలో జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర పరిశీలకులు కనుమూరి బాజీచౌదరి విచ్చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యుల వారు మాట్లాడుతూ... పార్టీ పదవులు పొందిన వారు చిత్తశుద్ధితో పార్టీకి సేవ అందించాలని ఏవైనా చిన్న ఒడిదుడుకులు ఉన్నా పార్టీకి అందరూ ఐకమత్యంతో సేవలందించాలని సూచించారు. వైసీపీ వారు అప్పుడే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేదని దుష్ప్రచారం చేస్తున్నారని ఇప్పటికే అన్నమాటకు కట్టుబడి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సామాజిక పెంక్షన్లో ఒకసారిగా మూడు వేల నుంచి 4వేలకు పెంచామని, కుటుంబానికి సంవత్సరానికి మూడు ఉచిత సిలిండర్ల 11 అమలు చేశామని, ఈ మధ్యనే తల్లికి వందనం పథకం ద్వారా కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉన్న వారందరికీ 13వేల రూపాయలు ప్రతి సంవత్సరం అందజేస్తున్నామని దీంతో గ్రామాల్లో వార్డుల్లో మహిళలు తమ హర్షతిరేకం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించబోతున్నామని, త్వరలో రైతులకు సంవత్సరానికి 20000 రూపాయలు వారి ఎకౌంట్లో వేయడం జరుగుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రాన్ని దివాలా తీయించినా ఇలా ఒక్కొకటిగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామని తెలియజేశారు. ఇప్పుడిప్పుడే రాష్ట్రాన్ని తెలుగుదేశం ప్రభుత్వం గాడిలో పెడుతుందన్నారు.

## రాష్ట్రంలో 99 శాతం డ్రగ్స్‌ను నివారించాం : జీవీ ఆంజనేయులు

●వినుకొండలో డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి డ్రగ్స్ రహిత రాష్ట్రం కోసం తీసుకుంటున్న చర్యల్లో 99 శాతం విజయం సాధించామని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రకటించారు. గత వైసీపీ ప్రభుత్వం, జగన్ మత్తుపదార్థాలపై వచ్చే కమీషన్ల కోసం కక్కుర్తిపడి యువత భవితను నాశనం చేశారని, ఆ తప్పులను ఇప్పుడు సరిదిద్దుతున్నామని అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వినుకొండలో డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ప్రారంభించారు. నరసరావుపేట రోడ్డులోని ఐనవోలు పోలీస్ స్టేషన్ వద్ద నుంచి శివయ్య స్తూపం సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ నుంచి తిరిగి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వరకు సాగింది. విద్యార్థులు, యువత ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం జూనియర్ కళాశాల మైదానంలో విద్యార్థులు, యువతతో ఏర్పాటు చేసిన సదస్సులో జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ... మాదకద్రవ్యాలేని రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లాలనే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. గతంలో అన్నపూర్ణగా ఉన్న ఆంధ్రప్రదేశ్ గత అయిదేళ్ల వైసీపీ పాలనలో గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మారడం చాలా బాధాకరం. గత పాలకులు ఉన్నప్పుడు 1775మంది యువత నిరాశ, నిస్పృహల్లో ఆత్మహత్య చేసుకున్నారు. కారణం గత పాలకులే. వారి అయిదేళ్ల పాలనలో దేశంలో గంజాయి, డ్రగ్స్ ఎక్కడ దొరికినా వాటి మూలాలు ఆంధ్రప్రదేశ్‌లోనే బైట పడేవి. ఏ రైతులు లాభసాటిగా లేరు. రాష్ట్రంలో ప్రతిరైతు నష్టపోయినా గంజాయి పండించిన రైతులు మాత్రం లాభపడ్డారు. గంజాయి రైతుల్ని ప్రోత్సహించిన చరిత్ర జగన్ ప్రభుత్వానిది. తెనాలిలో డ్రగ్స్‌కు అలవాటు పడి, ఆ నేరాల్లో ఉన్న వారికి జగన్ మద్దతు ఇచ్చాడు. ఏంటా నీచ సంస్కృతి. రౌడీలు, గంజాయి బ్యాచ్‌లకు జగన్ అండగా నిలిచాడు. ప్రజలు బుద్ధి చెప్పినా వారి తీరు మారలేదు. సిగ్గుపడాలి అలాంటి పనులు చేయడానికి. ఒక మాజీ సీఎం అలా కనీస బాధ్యత లేకుండా వ్యవహరించడం సిగ్గు చేటు. కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర్నుంచి ఈగల్స్ టీమ్ ఏర్పాటు చేసి డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ముందుకు సాగుతున్నాయి. గంజాయి, డ్రగ్స్, గుట్కాల మాట వినిపిస్తే తాట తీస్తున్నారు. 99శాతం ఫలితాలు సాధించారు. మిగిలిన 1శాతం విషయంలో కూడా కఠిన చర్యలు తీసుకున్నారు. ఇదే పని నాడు ఎందుకు చేయలేక పోయారు. ఈమత్తు పదార్థాలపై వచ్చే కమీషన్ల కోసం రాష్ట్ర యువత భవిష్యత్‌ను నాశనం చేశారు. ఈగల్స్ ద్వారా కాలేజీల్లో ఈగల్స్ క్లబ్స్ పెట్టి గంజాయిని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. 1972 అనే టోల్‌ఫ్రీ నంబర్ ఇచ్చి ఎక్కడ గంజాయి వాసన కనిపించినా చర్యలు తీసుకునేలా ఏర్పాట్లు చేశారు. ఆ టోల్ ఫ్రీ నంబర్‌ను ప్రజలు అందరు ఉపయోగించుకోవాలి. డ్రగ్స్ మహమ్మారిని పారదోలాల్సిన బాధ్యత ప్రభుత్వం, అధికారులు, ప్రజలందరిపై ఉంది. ఈగల్స్ క్లబ్ ద్వారా డ్రగ్స్‌ను అరికట్టినందుకు సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు జీవీ ఆంజనేయులు.జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్, నాయకులు, మున్సిపల్ కమిషనర్, తాసిల్దార్, సీఐ, ఎస్సైలు, ఎక్సైజ్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌తో ఎమ్మెల్యే ప్రశాంతి భేటీ

●నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్యే

● కోవూరు షుగర్ ఫ్యాక్టరీ సమస్యలను పరిష్కరించాలని వినతి



కోవూరు (చైతన్యరథం): నియోజకవర్గ సమస్యలే పరిష్కారంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి.. జిల్లా కలెక్టర్ ఆనంద్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. గురువారం కలెక్టరేట్‌కు వెళ్లిన ఆమె.. ఈ సందర్భంగా వివిధ అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. కోవూరు షుగర్ ఫ్యాక్టరీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్మికుల బకాయిలు చెల్లింపుపై కలెక్టర్‌తో చర్చించారు. కోవూరు నియోజక వర్గంలోని వివిధ పెండింగ్ సమస్యలను ఆమె కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి పలు అంశాలను ఆమె కలెక్టర్‌తో చర్చించారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా ఛైర్మెన్ జట్టి రాజగోపాల్ రెడ్డి, తెలుగుదేశం నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, బెజవాడ వంశీకృష్ణ రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళాతో యువతకు మంచి ఉద్యోగావకాశాలు

●ఎం.ఎస్ రాజు ఆధ్వర్యంలో జాబ్‌మేళా ... ఉత్సాహంగా పాల్గొన్న యువత



మడకశిర (చైతన్యరథం): మెగా జాబ్ మేళా ద్వారా యువతకు మంచి ఉద్యోగావకాశాలు తీసుకొస్తున్నామని, వాటిని యువత అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు అన్నారు. మడకశిరలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన మెజా జాబ్ మేళా కార్యక్రమం ప్రారంభంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి ఎం.ఎస్.రాజు పాల్గొన్నారు. మెగా జాబ్ మేళాలో 20 కంపెనీలు పాల్గొన్నాయి. వందలాది యువత జాబ్ మేళాలో పాల్గొనగా 105 మందికి ఉద్యోగావకాశాలు లభించాయి. మెగా జాబ్ మేళాకు పెద్దసంఖ్యలో వచ్చిన అభ్యర్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు మాట్లాడుతూ... తల్లిదండ్రులు కష్టపడి తమ పిల్లలను చదివిస్తున్నారు. కొంత మంది ఉన్నత విద్యను అభ్యసించి గ్రామాల్లోనే ఉండిపోతున్నారు. ఏదో ఒక ఉద్యోగాన్ని చూసుకుని ఆ ఉద్యోగం చేస్తూనే మరో మంచి ఉద్యోగం చూసుకోవాలి అనే దృక్పథాన్ని యువత అలవరచుకోవాలి. జీవితంలో ఉన్నత స్థానాలకు వెళ్లాలి అనుకునే వారు ధైర్యంగా అడుగులు ముందుకు వేయాలి. ఏ ప్రాంతంలో ఉద్యోగం వచ్చినా అక్కడికి ధైర్యంగా వెళ్లి ఉద్యోగాలు చేయాలి. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. యువత ఉద్యోగాలు చేస్తూ తమ తల్లిదండ్రులకు డబ్బులు పంపిస్తూ ఉంటే ఆ తల్లిదండ్రుల్లో వచ్చే ఆనందం మాటల్లో చెప్పలేం. యువత తమ కుటుంబంతో పాటు సమాజం పట్ల కూడా సామాజిక స్పృహ కలిగి ఉండాలి. నేడు మనం తీసుకునే నిర్ణయం మన భావితరాల భవిష్యత్తును కూడా ప్రభావితం చేస్తుంది. అది మంచి అయినా, చెడు అయినా. అందుకే యువత స్వీయ క్రమశిక్షణతో నేడు తమ జీవితాన్ని ముందుకు నడిపితే, తమ కుటుంబంతో పాటు సమాజం, భావితరాలు కూడా అభివృద్ధి పథంలో ముందుకు వెళతారు. యువత ముఖ్యంగా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. గంజాయి, డ్రగ్స్, కొకైన్, హెరాయిన్ వంటి భయంకరమైన మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును చిత్తు చేస్తున్నాయి. మత్తుకు బానిసలైన యువత తమ జీవితాలతో పాటు తమ కుటుంబ

## మన ఇంటికి - మన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ప్రారంభించిన కందికుంట



కదిరి (చైతన్యరథం): వైసీపీ నాయకుడు జగన్మోహన్‌రెడ్డి సవాల్‌ను స్వీకరించి మన ఇంటికి -మన ఎమ్మెల్యే కార్యక్రమంలో పాల్గొని ప్రజాసమస్యలను అప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్. మన ఇంటికి మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు స్ఫూర్తితో గురువారం కదిరి మున్సిపల్ 20వ వార్డులో, ప్రజల ఇంటి వద్దకే వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన అభివృద్ధిపై ప్రజలకు వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి గ్రామాల వారిగా చేస్తున్న కార్యక్రమాలను తెలియజేశారు. ప్రజల నుంచి తన దృష్టికి వచ్చిన పిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజల కష్టనష్టాలను అడిగి తెలుసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజాసాకారంతో దర్శి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతా గొట్టిపాటి లక్ష్మీ



దర్శి (చైతన్యరథం): ప్రజాసాకారంతో దర్శి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ పేర్కొన్నారు. పట్టణంలోని మూడో వార్డు, ఎస్సీ కాలనీలో 16.5 లక్షల వ్యయంతో డ్రైన్లు, రోడ్లలను, మంచినీటి కుళాయిలను, హైమాస్ లైట్లను గొట్టిపాటి లక్ష్మీ గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీ మాట్లాడుతూ... మన కూటమి ప్రభుత్వంలో నగర పాలక సంస్థగా ఉన్న దర్శిని గ్రేటర్ మున్సిపాలిటీగా మార్చుకోగలిగామని, కూటమి పాలనలో అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తామన్నారు. ఏడాది కూటమి పాలనలో దర్శి ప్రాంతంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ముఖ్యంగా దర్శి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడం లక్ష్యంగా నా ప్రయాణం సాగుతుందన్నారు. దర్శిలో పార్కును అభివృద్ధి చేయడం రోడ్లు, డ్రైన్లను సుందరంగా తీర్చిదిద్దడం పచ్చదనంతో దర్శిని అహ్లాదంగా తయారు చేయడమే నా ధ్యేయమన్నారు. మౌలిక సదుపాయాల కల్పన తాగునీరు అందించడం రోడ్లు, డ్రైన్లు అభివృద్ధి కూటమి పాలనలో చేసి చూపిస్తానన్నారు.

# గంజాయిని రాష్ట్రానికి పరిచయం చేసిన పార్టీ వైసీపీ

- యువత మాదక ద్రవ్యాలకు బానిస అవ్వడానికి పులివెందుల ఎమ్మెల్యే జగనే కారణం
- మాదకద్రవ్యాల దగ్గరకు వెళితే కుటుంబం గుర్తుకు రావాలి
- ఎన్డీఏ కూటమి ఏర్పడడంతో గంజాయిని పూర్తిగా నిర్మూలించాం
- ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించిన మంత్రి సవిత



పెనుకొండ (చైతన్యరథం): గంజాయిని రాష్ట్రానికి పరిచయం చేసిన పార్టీ వైసీపీ మంత్రి సవిత తెలిపారు. ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ సందర్భంగా పెనుకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి అంబేద్కర్ సర్కిల్ మీదుగా దర్గా సర్కిల్ తెలుగు తల్లిసర్కిల్ వరకు విద్యార్థులు, మహిళా సంఘాలు అధికారులు కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మీడియాతో మాట్లాడుతూ... సమాజానికి చెడు చేయాలని చూస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించమన్నారు. అందరూ కలసి మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగ పని చేయాలంటు ప్రతిజ్ఞ చేయించారు. మాదక ద్రవ్యాలు వాడిన వారు తన అమ్మ, సోదరి, కూతురు అని చూడకుండా ఎన్నో అఘాయిత్యాలకు పాటు పడ్డారని, గత ప్రభుత్వ హయంలో జగన్ ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి వైపు కాకుండా మాదక ద్రవ్యాలప్రదేశ్‌గా మార్చారన్నారు. గత ప్రభుత్వంలో గంజాయి పంటలు వేసి,గంజాయిని పండించి యువత భవిషత్తుని నిర్వీర్యం చేసారని, ఇప్పటి ప్రభుత్వంలో గంజాయిని కట్టడి చేసామని, గత ప్రభుత్వంలో 11 వేల ఎకరాల్లో గంజాయి పండించిందన్నారు. మాదక ద్రవ్యాలు వాడిన, వాటితో వ్యాపారాలు చేసిన ఎంతటి వారినైనా వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గంజాయి గురించి తెలియక పంటలు పెట్టిన వారికి ఉపాధి చూపించి, సంఘ విద్రోహమైన మాదక ద్రవ్యాల జోలికి వెళ్ళకుండా వారికి భవిత చూపిన ఘనత కూటమి ప్రభుత్వందని మంత్రి సవిత తెలిపారు.

# గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ చంద్రబాబు లక్ష్యం

- గంజాయి వద్దు... జీవితం ముద్దు...
- మత్తుకు బానిసలు కాకండి... మీ జీవితాలు పాడు చేసుకోకండి
- యువతకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పిలుపు




పుట్టపర్తి (చైతన్యరథం): గంజాయి వద్దు... జీవితమే ముద్దు అని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి యువతకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా నివారణ దినోత్సవం సందర్భంగా సత్యసాయి జిల్లా పుట్టపర్తి పోలీసుల ఆధ్వర్యంలో యువత మరియు విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మాట్లాడారు. అంతకు ముందు పుట్టపర్తి పట్టణంలోని సత్యమ్మ ఆలయం వద్ద నుంచి సత్యసాయి జిల్లా పుట్టపర్తి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మత్తుపదార్థాల నివారణ మరియు విముక్తి కార్యక్రమంలో నిర్వహించిన ర్యాలీలో జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ రత్న, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, పుట్టపర్తి ,కదిరి ఆర్డీఓలు సువర్ణ, శర్మతో పాటు జిల్లా అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు యువకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్టాండ్ విద్యాగిరి కలెక్టరేట్ ఎనుముల పల్లిలోని గణేష్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మాట్లాడుతూ... గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమన్నారు. యువత గంజాయి, మాదక ద్రవ్యాల మత్తులో పడి విలువైన జీవితం నాశనం చేసుకోవద్దని సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని వారి ప్రవర్తిస్తున్న తీరుపై గమనిస్తూ ఉండాలని యువత తల్లిదండ్రులకు సూచించారు. యువత చెడు మార్గంలో పయనిస్తే ఆ బాధ్యత వారి తల్లిదండ్రులపై పడుతుందని హెచ్చరించారు. పిల్లలు ఏం చేస్తున్నారో గమనించి వారిని సరైన మార్గంలో నడిపించే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని సూచించారు. గంజాయి డ్రగ్స్ మాదక ద్రవ్యాలపై ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు.

# డ్రగ్స్‌కు నో చెబుదాం... మెరుగైన సమాజాన్ని నిర్మిద్దాం

## •యాంటీ డ్రగ్స్ ర్యాలీలో ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు



మడకశిర (చైతన్యరథం): డ్రగ్స్‌కు నో చెప్పాలని, మెరుగైన సమాజ స్థాపనలో యువత, రాష్ట్ర ప్రజలు భాగస్వామ్యం కావాలని మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు పిలుపునిచ్చారు. మడకశిర పట్టణంలోని రాజీవ్ గాంధీ సర్కిల్ నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు విద్యార్థులు, ఉద్యోగులు, స్థానిక ప్రజలు, అధికారులు, నాయకులతో కలిసి యాంటీ డ్రగ్ ర్యాలీని ఎమ్మెల్యే గురువారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు నిర్వహించిన ఈ ర్యాలీలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం అంబేద్కర్ సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడి డ్రగ్స్ నియంత్రణకు ప్రతి ఒక్కరు భాగస్వాములం అవుతామని ఎమ్మెల్యే కార్యక్రమంలో పాల్గొన్నవారితో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు మాట్లాడుతూ.... యువత తమ భవిష్యత్తును డ్రగ్స్, గంజాయి అనే భూతాలకు బలిఇవ్వొద్దు. నేటి బాలలే రేపటి పౌరులు అన్న విధంగా నేటి క్రమశిక్షణతో కూడిన సమాజమే...రేపటి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే సమాజం అవుతుంది. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల పట్ల యువత అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని, వాటకి దూరంగా ఉండడంతో పాటు సమాజాన్ని కూడా డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల నుండి కాపాడాలి. వైసీపీ నాయకులు గత ఐదేళ్లలో ఏపీని గంజాయి క్యాపిటల్ గా మర్చారు. రాష్ట్ర సహజ సంపదను దోచుకోవడంతో పాటు యువత భవిష్యత్తును గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుకు బలిచేశారు. వైసీపీ నేతలు తమ జేబులు నింపడం కోసం రాష్ట్ర యువత భవిష్యత్తుతో ఆడుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల నియంత్రణ కోసం ఈగల్ టీమ్ ను ఏర్పాటు చేసింది. నిరంతరం గంజాయి, డ్రగ్స్ వంటి వాటిని అమ్మేవారు, కొనేవారిపై నిఘా పెట్టింది. ఎక్కడికక్కడ వాటిని కట్టడి చేస్తోంది. రాష్ట్ర యువత భవిష్యత్తుతో పాటు, రాష్ట్ర భవిష్యత్తును కూడా కాపాడేందుకు కూటమి ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేస్తోంమహాయజ్ఞంలో రాష్ట్ర ప్రజలు కూడా తమవంతు భాగస్వాములవ్వాలి. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలు లేని రాష్ట్రంగా మన రాష్ట్రాన్ని నిర్మించేందుకు కంకణబద్దులు కావాలి అని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు.

# గంజాయి నిర్మూలనే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- అనంతపురంలో యాంటీ నార్కోటిక్స్ డే ర్యాలీ




అనంతపురం (చైతన్యరథం): అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం కార్యక్రమం జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ కార్మిక సంక్షేమ శాఖ బోర్డ్ చైర్మన్ వెంకటశివుడు యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టారు. నగరంలోని ఎగ్జిభిషన్ గ్రౌండ్ నందు ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వినోద్, ఎస్పీ జగదీష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటశివుడు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం డ్రగ్స్, గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి పెట్టి గంజాయి ఆంధ్రప్రదేశ్ నుండి అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని మార్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రయత్నాలు మొదలు పెట్టారని, అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న మన రాష్ట్రాన్ని గత వైసీపీ ప్రభుత్వం గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చేసిందన్నారు. గంజాయి సరఫరాకు ఆంధ్రప్రదేశ్‌ను కేంద్రంగా మార్చి దేశానికే రాజధానిగా జగన్ ప్రభుత్వం చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో మత్తు పదార్థాలకు బానిసై గత అయిదేళ్లలో దాదాపు 1700 మందికి పైగా యువత ఆత్మహత్యలకు పాల్పడటం విచారకరమన్నారు. డ్రగ్స్, గంజాయి వ్యాప్తిని అరికట్టేందుకే చంద్రబాబునాయుడు ఈగల్ విభాగాన్ని ఏర్పాటు చేశారని, ఈ విభాగం గంజాయి సాగు, రవాణా, వినియోగం సహాయ ప్రతి దశలో నిఘా పెట్టి నేరస్తులకు కఠిన శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అధికారులు కూడా యువతను డ్రగ్స్, గంజాయికి బానిసలు కాకుండా బాధ్యతగా పనిచేయాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వంలో అల్లూరి సీతా రామరాజు జిల్లాలో పొగాకు అత్యధికంగా పండించే వారిని వారికి అవగాహన కల్పించి పొగాకు బదులు ప్రత్యామ్నాయ పంటలను పండించే విధంగా కూటమి ప్రభుత్వ చర్యలు తీసుకుందని, పొగాకు సాగు విస్తీర్ణం కూడా తగ్గించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకం వల్లే రాష్ట్రంలోకి గంజాయి వచ్చింది

- యువత ఈ వ్యసనానికి బానిసై జీవితాల్ని పాడుచేసుకోవద్దు
- మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నివారణ దినోత్సవంలో ఎమ్మెల్యే పరిటాల సునీత
- చెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ



రాప్తాడు (చైతన్యరథం): గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకం వల్లే రాష్ట్రంలో గంజాయి విచ్చలవిడిగా వచ్చిందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నివారణ దినోత్సవం చెన్నే కొత్తపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఎంపిడిఓ కార్యాలయం సర్కిల్ వరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "వాక్ థాన్" ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతతో పాటు ధర్మవరం డిఎస్పి హేమంత్ కుమార్, సిఐ శ్రీధర్, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి ఎస్ఐలు, పోలీసులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ గతంలో మాదకద్రవ్యాలు అన్నవి రాష్ట్రంలో కనిపించేవి కావని... వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం స్వార్థ ప్రయోజనాల వల్ల గంజాయి ఇతర మత్తు పదార్థాల విక్రయాలు చేశారన్నారు. దీని నిర్మూలనకు కూటమి ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోందన్నారు. ముఖ్యంగా పోలీస్ శాఖ ఈగల్ టీం ద్వారా అనేక చర్యలు తీసుకుందన్నారు. ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ కొంతమంది గంజాయి సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి వాటి పట్ల విద్యార్థి దశ నుంచి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా యువత ఈ మత్తులో పడి జీవితాలని నాశనం చేసుకోవద్దని ఆమె సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల పట్ల జాగ్రత్తగా ఉంటూ.. ఇలాంటి వాటి జోలికి వెళ్లకుండా చూసుకోవాలని ఎమ్మెల్యే సునీత సూచించారు. మరోవైపు డిఎస్పి హేమంత్ కుమార్ మాట్లాడుతూ ఈగల్ టీమ్స్ ఏర్పాటు చేసి డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా, వాడకంపై పోలీస్ శాఖ ఉక్కుపాదం మోపుతోందన్నారు.

# పార్లమెంట్ కన్నా రాజ్యాంగమే అత్యున్నతం

## - సీజేఐ బీఆర్ గవాయ్ స్పష్టీకరణ


ముంబై: భారత్‌లో రాజ్యాంగమే అత్యున్నతమైందని.. ప్రజాస్వామ్యంలోని మూడు విభాగాలు దాని కిందే పనిచేస్తాయని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్ బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి ఆయన స్వస్థలం మహారాష్ట్రలోని అమరావతికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనను స్థానికులు ఘనంగా సత్కరించారు. అనంతరం జస్టిస్ బీఆర్ గవాయ్ మాట్లాడుతూ.. కొంత మంది పార్లమెంట్ అత్యున్నతమైనదని చెబుతారని.. ఆ తర్వాతే రాజ్యాంగమని పేర్కొంటారన్నారు. కానీ తన దృష్టిలో మాత్రం రాజ్యాంగమే అత్యున్నతమైనదని చెప్పారు. రాజ్యాంగాన్ని సవరించేందుకు పార్లమెంట్‌కు ధికారాలున్నాయి. కానీ, రాజ్యాంగం ప్రాథమిక రూపాన్ని మాత్రం అది మార్చలేదన్నారు. శాసన, న్యాయ, కార్యనిర్వాహక విభాగాల్లో ఏది అత్యున్నతమైందని తరచూ చర్చ తలెత్తుతోందని గవాయ్ అభిప్రాయపడ్డారు. చాలామంది పార్లమెంట్ అత్యున్నతమైందని అంటారు. కానీ, నా ఉద్దేశంలో భారత రాజ్యాంగమే అత్యంత ముఖ్యమైంది. ప్రజాస్వామ్యంలోని మిగిలిన మూడు విభాగాలు దానికిందే పనిచేస్తాయి. రాజ్యాంగ విలువలతోపాటు ప్రాథమిక సూత్రాలకు సంరక్షకుడిననే విషయాన్ని న్యాయమూర్తి నిత్యం గుర్తుంచుకోవాలని తెలిపారు. మనకు అధికారం మాత్రమే కాకుండా మనపై



బాధ్యత సైతం ఉందన్నారు.మనం ప్రజల హక్కులకు, రాజ్యాంగ విలువలు, నిబంధనలకు రక్షకులం. మనకు అధికారం మాత్రమే లేదు. బాధ్యతలు కూడా ఉన్నాయి. తీర్పుల గురించి ప్రజలు ఏమనుకొంటున్నారనే విషయం జడ్జీలను ప్రభావితం చేయకూడదు. మనం స్వతంత్రంగా ఆలోచించాలని అని పేర్కొన్నారు. తాను రాజ్యాంగం ప్రసాదించిన హక్కులకు అండగా నిలుస్తానన్నారు. బుల్డోజర్ న్యాయంపై తాను ఇచ్చిన తీర్పు మీద ఆయన స్పందించారు. ప్రతిఒక్కరికీ నివసించేందుకు ఇల్లు ఉండాలన్నారు. ఈ సందర్భంగా తన చిన్ననాటి సంఘటనలను జస్టిస్ బీఆర్ గవాయ్ గుర్తు చేసుకున్నారు. చిన్నతనంలో తాను ఆర్కిటెక్ట్ కావాలనుకున్నానన్నారు. కానీ తన తండ్రి మాత్రం న్యాయవాది కావాలని.. అందుకోసం న్యాయ శాస్త్రం అభ్యసించాలని సూచించారని చెప్పారు. తన తండ్రి న్యాయవాది కావాలని అనుకున్నారని.. కానీ స్వతంత్ర పోరాటంలో పాల్గొని ఆయన జైలుకు వెళ్లడంతో.. తన తండ్రి కల నెరవేరలేదని ఈ సందర్భంగా జస్టిస్ బీఆర్ గవాయ్ వివరించారు.

---

# తుల్‌బుల్ ప్రాజెక్ట్ పునరుద్ధరణ



- ప్రణాళికలు సిద్ధం చేస్తున్న భారత్
- దేశీయంగా సింధూ జలాల వినియోగానికి ప్రణాళికలు

న్యూఢిల్లీ: జీలం నదిపై గతంలో ప్రతిపాదనలు పూర్తయి, నిలిచిపోయిన తుల్‌బుల్ నావిగేషన్ ప్రాజెక్టును తిరిగి పట్టాలెక్కించేందుకు భారత్ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ ప్రాజెక్ట్ ద్వారా సింధూ నది జలాలను భారత్ పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు వీలపుతుంది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌కు బుద్ధిచెప్పేందుకు గాను సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేస్తూ భారత్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో దాయాది దేశానికి నీటికష్టాలు మొదలయ్యాయి. ఈక్రమంలో పశ్చిమనదుల నుంచి నీటిని మరింత సద్వినియోగం చేసుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్న భారత్.. సుదీర్ఘకాలంగా నిలిచిపోయిన తుల్‌బుల్ నావిగేషన్ ప్రాజెక్టు పునరుద్ధరణపై దృష్టి సారించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

ఈ ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించేందుకు చర్చలు తుది దశలో ఉన్నాయన్న విషయాన్ని అధికారికవర్గాలు వెల్లడించాయి. ఈ ప్రాజెక్టు డీపీఆర్ సిద్ధమవుతోందని, ఏడాదిలో పూర్తయ్యే అవకాశం ఉందని పేర్కొన్నాయి. అయితే, పశ్చిమ నదుల నుంచి భారత్ వాటాను మరింత సద్వినియోగం చేసుకునేందుకు అనేక ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని సంబంధిత అధికారి ఒకరు పేర్కొన్నారు. పడమరవైపు ప్రవహించే నదులనుంచి నీటిని పంజాబ్, హర్యానాకు మళ్లించే అవకాశం కూడా పరిశీలనలో ఉందన్నారు.

సింధూ జలాల ఒప్పందం ప్రకారం.. పశ్చిమ దిశగా పాకిస్థాన్ వైపు ప్రవహించే సింధూతోపాటు చీనాబ్, జీలం వంటి ప్రధాన ఉపనదులపై భారత్‌కు పరిమిత అధికారాలు మాత్రమే ఉన్నాయి. భారత్, పాక్ మధ్య 1960,సెప్టెంబరు 19న జరిగిన ఒప్పందం ప్రకారం ఈనదీవ్యవస్థ మొత్తం నీటిలో 20% భారతదేశం,80% పాకిస్థాన్ వినియోగించుకోవాలి. అయితే, మన దగ్గర వీటి నీటినిల్వ సామర్థ్యం తక్కువగా ఉండటం సవాలుగా మారింది. డ్రై సీజన్లో కొంతమేరకు నిల్వ చేస్తున్నప్పటికీ.. వర్షాకాలంలో నిల్వ సామర్థ్యం తక్కువగా ఉంది.దీంతో అధిక నీరువస్తే అది దిగువన పాకిస్థాన్‌కు పోతోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.అంతేకాకుండా ఒప్పందం అమలువల్ల వరదల సమయాల్లో కొన్ని సవాళ్లు ఎదురయ్యేవన్నారు. కానీ, ప్రస్తుతం రిజర్వాయర్ నిర్వహణపై ప్రముఖంగా దృష్టి సారించామన్నారు. గతంలో పాక్ వ్యతిరేకించిన కిషన్ గంగా ప్రాజెక్ట్ ఉప్పటికే పూర్తికాగా.. రాట్లే ప్రాజెక్టు నిర్మాణం కూడా ముమ్మరంగా కొనసాగుతోందని తెలిపాయి.

# కొన్ని దేశాలకు ఉగ్రవాదమే జాతీయ విధానం

- షాంఘై సహకార సంస్థ సదస్సులో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ విమర్శ
- పహల్గాం ప్రస్తావన లేనందున సంయుక్త ప్రకటనపై సంతకానికి నిరాకరణ



క్వింగ్దావో (చైనా): కొన్ని దేశాలు సీమాంతర ఉగ్రవాద విధానాన్ని జాతీయ విధానంగా పెట్టుకున్నాయని పరోక్షంగా పాకిస్థాన్‌ను ఉద్దేశించి రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చురకలు వేశారు. చైనా లోని క్వింగ్దావో నగరంలో జరిగిన షాం ఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) రక్షణ మంత్రుల సమావేశంలో ఆయన పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. ఎస్సీఓ రక్షణ మంత్రుల సమా వేశంలో పాల్గొనడం నాకు ఆనందంగా ఉంది. ఇందులో కొత్త సభ్య దేశంగా చేరిన బెలారస్‌కు అభినందనలు. కొన్ని దేశాలు సీమాంతర ఉగ్రవాదాన్ని ఒక విధాన సాధనంగా ఉపయోగించుకుంటు న్నాయి. పలుదేశాలు(పాక్ పేరును ప్రస్తా వించకుండా) ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్నాయి. అలాంటి ద్వంద్వ ప్రమా ణాలకు చోటు ఉండకూడదు. ఎస్సీఓ అలాంటి దేశాలను విమర్శించడానికి వెనుకాడకూడదు. శాంతి, ఉగ్రవాదం ఎప్పటికీ కలిసి ఉండలేవు. ఉగ్రవాదుల చేతుల్లో విధ్వంసాలకు కారణమయ్యే ఆయుధాలు ఉండకూడదు. ఈ సవాళ్లను ఎదుర్కోడానికి నిర్ణయాత్మకమైన చర్య అవసరం. సామూహిక భద్రత కోసం ఈ దుష్టశక్తులకు వ్యతిరేకంగా పోరాడేందుకు మనమంతా ఐక్యం కావాలని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఉగ్రవాదులను పెంచి పోషించే దేశాలు అందుకుతగ్గ పరిణామాలు ఎదు ర్కోక తప్పదని స్పష్టం చేశారు. ఈ సంద ర్భంగా ఆయన ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్ర దాడిని గురించి కూడా మాట్లాడారు. దీని కి ప్రతిస్పందనగా భారత్ చేపట్టిన ఆపరే షన్ సిందూర్ గురించి కూడా వివరించారు.

### సంయుక్త ప్రకటన రద్దు

షాంఘై సహకార సంస్థ సదస్సులో సిద్ధం చేసిన సంయుక్త ప్రకటనలో పహ ల్గాం ప్రస్తావన లేకపోవడంతో ఆ పత్రం పై సంతకం చేసేందుకు రాజ్‌నాథ్ నిరా కరించారు. దీంతో సంయుక్త ప్రకటనను రద్దు చేయాల్సి వచ్చింది. చైనాలోని క్విం గ్దావోలో షాంఘై సహకార సంస్థ సభ్య దేశాల రక్షణ మంత్రిత్వస్థాయి సదస్సు నిర్వహించారు. ఇందులో భారత్, చైనా, పాకిస్థాన్‌తో పాటు 10 సభ్య దేశాల రక్షణ మంత్రులు పాల్గొన్నారు. సదస్సు అనంత రం రూపొందించిన జాయింట్ డాక్యుమెంట్..ఉగ్రవాదంపై భారత కఠిన వైఖరిని సుస్పష్టంగా ప్రతిబింబించలేక పోయింది. అంతేగాక, ఈ ఏడాది ఏప్రి ల్లో జమ్మూకశ్మీర్లో చోటుచేసుకున్న పహ ల్గాం ఉగ్రదాడి ఘటనను అందులో ప్రస్తావించలేదు. అదే సమయంలో బలోచిస్థాన్ అంశాన్ని చేర్చి భారత్‌ను నిందించే ప్రయత్నం జరిగింది.

దీంతో ఉగ్రవాదంపై భారత వైఖరిని నీరుగార్చేలా ఉన్న ఆ పత్రంపై సంతకం చేసేందుకు రాజ్‌నాథ్ సింగ్ నిరాకరించా రు. ఉగ్రవాద అంశంపై సదస్సులో భిన్నాభిప్రాయాలు రావడంతో సమావేశం అనంతరం రక్షణ మంత్రుల సంయుక్త ప్రకటనను ఆర్గనైజేషన్ రద్దు చేసింది. పాకిస్థాన్ వల్లే ఈ జాయింట్ డాక్యుమెంట్ నుంచి పహల్గాం ప్రస్తావనను మినహాయించి ఉంటారనే సంకేతాలు కన్పిస్తున్నాయి. ఈ సదస్సుకు చైనా అధ్యక్షత వహిస్తోంది.

పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాకిస్థాన్ రక్షణమంత్రులు ఎదురుపడటం ఇదే తొలిసారి. అయితే, ఈ సదస్సులో వీరిద్దరి మధ్య ఎలాంటి పలకరింపులు జరగలేదని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఇక, 2020లో గల్వాన్ ఘర్షణ తర్వాత నుంచి భారత రక్షణ మంత్రి చైనాలో పర్యటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ ఆర్గనైజేషన్లో బెలారస్, చైనా, భారత్, ఇరాన్, కజకిస్థాన్, కిర్గిస్థాన్, పాకిస్థాన్, రష్యా, తజకిస్థాన్, ఉజ్బెకిస్థాన్ సభ్య దేశాలుగా ఉన్నాయి.

# రీల్స్ పిచ్చికి యువతి బలి

బెంగళూరు: ఇన్‌స్టా రీల్స్ చేసే క్రమంలో యువత పెద్ద సంఖ్యలో మృత్యువాత పడుతోంది. తాజాగా, నిర్మాణంలో ఉన్న భవనంలో రీల్స్ చేసే క్రమంలో ఓ యువతి ప్రాణాలు కోల్పోయిన దుర్ఘటన బెంగళూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. బెంగళూరుకు చెందిన 20 ఏళ్ల నందిని ఓ హైపర్ మార్కెట్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తోంది. నందిని తన ముగ్గురు స్నేహితులతో (ఒక అమ్మాయి, ఇద్దరు అబ్బాయిలు) కలిసి సౌత్ బెంగళూరు, పరప్పన అగ్రహారంలోని నిర్మాణంలో ఉన్న 13 అంతస్తుల భవనంలోకి వెళ్లింది. ప్రమాదకరమన రీల్ చిత్రీకరించడానికి నందిని బిల్డింగ్ టెర్రస్ మీదకు వెళ్లింది. అక్కడ రీల్ చిత్రీకరిస్తూ ఉన్న సమయంలో లిఫ్ట్ ఏర్పాటు చేసే హోల్‌లో పడి పోయింది. తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే చనిపోయింది. నందిని చనిపోవడంతో ముగ్గురు స్నేహితులు భయంతో అక్కడినుంచి పారిపోయారు. బిల్డింగ్ సిబ్బంది ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడికి వచ్చారు. నందిని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అసహజ మరణం కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సీసీ టీవీ కెమెరా దృశ్యాలను పరిశీలించగా నందిని స్నేహితురాలి గురించి తెలిసింది. ఆమెను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. పోలీసులు మరింత లోతుగా కేసును దర్యాప్తు చేస్తున్నారు.

# యుద్ధం మళ్లీ రావొచ్చు

## నాటో సదస్సులో ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

ఇజ్రాయెల్– ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారాయి. దీంతో యుద్ధం ముగిసిందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పలు పోస్టులుచేసిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై మరోసారి స్పందించిన ఆయన.. కీలక వ్యాఖ్యలు చేశారు.

ఆ రెండు దేశాల మధ్య యుద్ధం మళ్లీ రావొచ్చేమోనని అనుమానం వ్యక్తంచేశారు. “ఆ రెండు దేశాల (ఇజ్రాయెల్–ఇరాన్)తో నేను చర్చలు జరిపాను. అవి రెండూ ప్రస్తుతానికి అలిసిపోయాయి. అయితే మళ్లీ యుద్ధాన్ని ప్రారంభిస్తారా? అంటే బహుశా ఏదో ఒకరోజు రావొచ్చు. త్వరలోనే మళ్లీ ప్రారంభం కావొచ్చు” అని ట్రంప్ వ్యాఖ్యానించారు.



ఆంక్షలు సడలించే అవకాశం: ట్రంప్

ఈ సందర్భంగా ఇరాన్ అణు చర్చల అంశాన్ని అమెరికా అధ్యక్షుడు మరోసారి ప్రస్తావించారు. “వచ్చేవారం టెహ్రాన్‌తో అణు చర్చలు జరుపుతా. అణ్వాయుధాలు తయారు చేయాలన్న ఆశయాన్ని వదిలేసేలా ఇరాన్‌తో ఒప్పందం చేసుకునే అవకాశముంది” అని ట్రంప్ వెల్లడించారు. ఇక, ఇరాన్‌పై అమెరికా దాడులు చేయడంవల్లే పశ్చిమాసియాలో యుద్ధానికి త్వరగా ముగింపు పడిందని ఆయన అన్నారు. తన నిర్ణయంతో అందరికీ విజయం లభించిందని పేర్కొన్నారు. మరోవైపు, ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను సడలించే అవకాశాలున్నట్టు ట్రంప్ సంకేతాలిచ్చారు. “ప్రస్తుతం ఇరాన్ పునర్నిర్మాణానికి నగదు వనరులు కావాలి. ఆ దేశం కోలుకునేలా మద్దతివ్వడం కోసం కొన్ని ఆంక్షలను సడలించే అవకాశాన్ని పరిశీలిస్తున్నాం” అని నాటో సదస్సులో ట్రంప్ వెలడించారు.



## యుద్ధంలో మాదే విజయం

- అమెరికాకు మా సమాధానం చెంపపెట్టు
- కాల్పుల విరమణ తరువాత స్పందించిన ఖమేనీ

ఇజ్రాయెల్– ఇరాన్ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అనంతరం ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ తొలిసారి స్పందించారు. 12 రోజులపాటు కొనసాగిన యుద్ధంలో ఇజ్రాయెల్‌పై తమ దేశమే విజయం సాధించిందని ప్రకటించారు. అలాగే, అమెరికా స్థావరాలపై దాడి చేయడం ద్వారా అగ్రరాజ్యానికి గట్టి చెంపపెట్టులాంటి సమాధానం ఇచ్చామని వ్యాఖ్యానించారు. జూన్ 19 తర్వాత తొలిసారిగా ఇరానియన్ స్టేట్ టెలివిజన్‌లో ఖమేనీ వ్యాఖ్యల వీడియో ప్రసారమైంది. అమెరికా జోక్యం చేసుకోకపోతే ఇజ్రాయెల్ నాశనమవుతుందని అగ్రరాజ్యం భావించడంవల్లే ఈ యుద్ధంలో జోక్యం చేసుకుందన్నారు. అయితే, ఈ యుద్ధంవల్ల అమెరికా ఎటువంటి ప్రయోజనం సాధించలేకపోయిందని ఎద్దేవా చేశారు. “ఇస్లామిక్ రిపబ్లిక్ విజయం సాధించింది. అమెరికాను చెంపదెబ్బ కొట్టింది. సోమవారం ఖతార్లో అమెరికా కీలక స్థావరాల్లో ఒకటైన అల్ ఉదీద్ వైమానిక స్థావరంపై దాడి చేసి నష్టం కలిగించింది. ఇందులో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఇస్లామిక్ రిపబ్లిక్ ఈ ప్రాంతంలోని కీలకమైన అమెరికా కేంద్రాలను యాక్సెస్ చేయగలదు. అవసరమనుకుంటే దాడులూ చేయగలదు. భవిష్యత్తులోనూ ఇలాంటి చర్యలు పునరావృతం కావొచ్చు. ఏదైనా దురాక్రమణ జరిగితే.. శత్రువు కచ్చితంగా భారీమూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది” అని ఖమేనీ హెచ్చరించారు. ఇజ్రాయెల్‌తో కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చి రోజులు గడుస్తున్నా అలీ ఖమేనీ బాహ్య ప్రపంచానికి కనిపించకపోవడంతో ఆయన ఎక్కడ ఉన్నారంటూ వస్తోన్న వార్తల నేపథ్యంలో ఆయన పైవిధంగా స్పందించారు.

## విమానం ఇంజన్‌లో మంటలు

### గగనతలంలోనే ఘటన.. తప్పిన ప్రమాదం

విమానం గాల్లో ఉండగా ఇంజిన్‌లో మంటలు చెలరేగిన భయానక ఘటన అమెరికాలో చోటుచేసుకుంది. లాస్‌వేగాస్ ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరిన అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానంలో.. టేకాఫ్ అయిన కాసేపటికే మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన పైలట్లు విమానాన్ని వెనక్కి మళ్లించారు. విమానం సురక్షితంగా ల్యాండ్ అవడంతో పెను ప్రమాదం తప్పింది.


అమెరికా కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 8.11 గంటలకు లాస్‌వేగాస్‌లోని ఎయిర్‌పోర్టు నుంచి అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానం నార్త్ కరోలినాలోని చార్లొట్ ప్రాంతానికి బయల్దేరింది. అయితే, టేకాఫ్ అయిన కాసేపటికే విమానంలో సమస్య ఎదురైంది. గగనతలంలో ఉండగా విమానం ఇంజిన్‌నుంచి మంటలు, పొగలు వచ్చాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. ప్రమాదాన్ని గుర్తించిన సిబ్బంది వెంటనే విమానాన్ని వెనక్కి మళ్లించారు. ఉదయం 8.20 గంటలకు విమానం తిరిగి లాస్‌వేగాస్ ఎయిర్‌పోర్టులో సురక్షితంగా దిగినట్ట ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు వెల్లడించారు. ఈ ఘటన సమయంలో విమానంలో 153మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని అధికారులు తెలిపారు. విమానం గాలిలో ఉండగా మంటలు వస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అయితే, ల్యాండ్ అయిన తర్వాత విమానాన్ని



తనిఖీలు చేయగా.. ఇంజిన్‌నుంచి మంటలు వచ్చిన ఆధారాల్లేవని ఎయిర్‌లైన్స్ మెకానిక్స్ చెప్పడం గమనార్హం.

## ఐఎస్ఎస్‌తో డాకింగ్ సక్సెస్

### చరిత్ర సృష్టించనున్న శుభాంశు శుక్లా



అంతరిక్ష పరిశోధనలకు సంబంధించి భారత్ మరో ఘనతను సాధించింది. యాక్సియం–4 మిషన్‌లో భాగంగా అంతరిక్షంలోకి వెళ్లిన భారత వ్యోమగామి శు భాంశు శుక్లా సహా నలుగురు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి అడుగుపెట్టారు. డాకింగ్ (ఐఎస్ఎస్ వ్యోమనౌక అనుసంధానం) ప్రక్రియ విజయవంతమైంది. దీంతో ఐఎస్ఎస్‌లో ప్రవేశించే ప్రక్రియ కొనసాగుతోంది. యాక్సియం–4 మిషన్‌లో భాగంగా ఫాల్కన్–9 రాకెట్ ద్వారా భారత్‌కు చెందిన శుభాంశు శుక్లా సహా పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోస్ట్ ఉజ్నాన్‌స్కీ విస్నీవ్‌స్కీ (పోలండ్), టిబర్ కపు (హంగరీ)లు అంతరిక్షంలోకి వెళ్లారు. భారత కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 12.01 గంటలకు అమెరికాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రంనుంచి బయలుదేరిన వీరి స్పేస్ క్రాఫ్ట్ గురువారం సాయంత్రం ఐఎస్ఎస్‌కు చేరుకుంది. సాయంత్రం 4.03గంటలకు డాకింగ్ ప్రక్రియ పూర్తయ్యింది. ఈ మిషన్‌లో ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించే వీరు 14రోజులపాటు అక్కడ గడుపుతారు.

## మా దాడి తరువాత.. ‘మొస్సాద్’ అక్కడికి వెళ్లింది!

### ఇరాన్ అణు కేంద్రాలు ధ్వంసమయ్యాయనే నమ్ముతున్నాను: ట్రంప్

ఇరాన్ అణుకేంద్రాలపై తాము దాడి చేసిన తర్వాత ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్‌కు చెందిన ఏజెంట్లు అక్కడికి వెళ్లి పరిశీలించారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. అగ్రరాజ్య దాడుల్లో ఇరాన్‌కు ఊహించినంత నష్టం జరగలేదంటూ.. పెంటగాన్‌ను ఉటంకిస్తూ కథనాలు వెలువడిన నేపథ్యంలో ఆయన ఈవిధంగా స్పందించారు. ట్రంప్ నాటో సదస్సులో మాట్లాడుతూ “మీకు తెలుసా.. వాళ్ల (ఇజ్రాయెల్) మనుషులు అక్కడికి వెళ్లి పరిశీలించి పూర్తిగా ధ్వంసమైనట్టు తెలిపారు. ఇప్పుడు ఇజ్రాయెల్ దానిపై ఓ నివేదిక తయారుచేస్తోంది. పూర్తిగా ధ్వంసమైందని వారు చెప్పడంతోపాటు.. నేను కూడా నమ్ముతున్నాను. ఏదీ మిగిలే అవకాశం లేదు” అని ఫోర్డో కేంద్రం గురించి పేర్కొన్నారు.




#### ఆ కేంద్రాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి: సీఐఏ

ఇరాన్‌లోని అణు కేంద్రాలు అమెరికా దాడిలో తీవ్రంగా దెబ్బతిన్నాయని సీఐఏ సైతం ధ్రువీకరించింది. ఈమేరకు దాని డైరెక్టర్ జాన్ రాట్ క్లిఫ్ ప్రెస్‌నోట్ విడుద ల చేశారు. అక్కడి కేంద్రాలు ధ్వంసం కావడం వల్ల చాలాకాలం వరకూ అవి కోలుకొనే పరిస్థితి లేదన్నారు. వీటి పునర్ని ర్మాణానికి కొన్నేళ్ల సమయం పడుతుంద న్నారు. “ఇటీవల జరిగిన దాడుల్లో ఇరాన్ అణు కార్యక్రమం తీవ్రంగా దెబ్బతిన్నట్టు నమ్మకమైన ఇంటెలిజెన్స్ విభాగం ఒకటి వెల్లడించింది. మరిన్ని వివరాలను మేం సేకరించి పాలకులకు అందిస్తాం. దీంతోపాటు అమెరికా ప్రజలకు కూడా తెలియజేస్తాం. జాతీయ ప్రాధాన్యమున్న అంశం కావడంతో పూర్తిగా పారదర్శకంగా వ్యవహరిస్తాం” అని సీఐఏ పేర్కొంది. మరోవైపు నిన్న ఇరాన్ విదేశాంగశాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘయీ కూడా అణుకేంద్రాలు దెబ్బతిన్న విషయాన్ని అంగీకరించారు. కాకపోతే.. పూర్తి వివరాలను వెల్లడించేందుకు నిరాకరించారు. అమెరికాతోపాటు ఇజ్రాయెల్ కూడా పదేపదే దాడులు చేయడంతో తీవ్ర విధ్వంసం చోటుచేసుకుందన్నారు. ఇదిలావుంటే, న్యూయార్క్ టైమ్స్, సీఎన్ఎన్ మాత్రం పెంటగాన్ నివేదికను ఉటంకిస్తూ.. అమెరికా దాడులు ఇరాన్ అణుకేంద్రాలపై పెద్దగా ప్రభావం చూపలేదని పేర్కొన్నాయి. దీనికితోడు టెహ్రాన్ మరికొన్ని నెలల్లోనే పూర్తిస్థాయిలో యురేనియం శుద్ధి చేపట్టే అవకాశం ఉందని ఆ కథనాల్లో పేర్కొన్నాయి.

## స్ట్రీట్ ఫెస్ట్‌పై దుండగుడి కాల్పులు

### మెక్సికోలో ఘటన.. 12మంది దుర్మరణం

మెక్సికో మరోసారి కాల్పులతో అట్టుడికింది. ఇక్కడి గ్వానాజువాటలోని ఇరాపువాటో నగరంలో దుండగుడు కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో 12మంత్రి ప్రాణాలు కోల్పోగా.. 20మందికి పైగా గాయపడినట్టు తెలుస్తోంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలో రాత్రివేళ కొందరు వ్యక్తులు ఓ స్ట్రీట్ ఫెస్టివల్‌ను ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో పాల్గొన్నవారంతా డ్రమ్స్ వాయిస్తూ డ్యాన్స్ చేస్తూ ఉండగా.. గుర్తు తెలియని దుండగుడు అక్కడికి వచ్చి వారిపై ఒక్కసారిగా కాల్పులకు తెగబడ్డాడు. దీంతో అక్కడున్నవారంతా భయభ్రాంతులకు గురయ్యారు.. ఘటనలో 12మంది మృతిచెందగా.. 20మంది గాయపడ్డారు. ఇక, ఈ ఘటనను మెక్సికన్ అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ తీవ్రంగా ఖండించారు. జరిగిన ఘటన దురదృష్టకరమని పేర్కొన్న ఆమె దీనిపై దర్యాప్తు జరుగుతుందన్నారు. కాగా.. గత నెలలోనూ గ్వానాజువాటలోని శాన్ బార్టోలో డి బెర్రియాస్‌లో జరిగిన కార్యక్రమంలోనూ దుండగులు రెచ్చిపోయి కాల్పులు జరిపారు. ఆ ఘటనలో ఏడుగురు మృతి చెందారు. ఈ నగరంలో ఇటీవల ఇలాంటి ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ ఏడాదిలో ఈ ప్రాంతంలో జరిగిన ఘటనల్లో వెయ్యిమందికి పైగా మృతి చెందినట్టు గణాంకాలు చెబుతున్నాయి.



## ప్రభాస్ ప్రజెన్స్ కన్నప్పకు బోనస్

మంచు విష్ణు హీరోగా యదార్ధ గాథ ఆధారంగా దర్శకుడు ముకేష్ కుమార్ సింగ్ తెరకెక్కించిన చిత్రమే "కన్నప్ప". భారీ బడ్జెట్‌తో తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా హిస్టారికల్ సినిమాలో పాన్ ఇండియా లెవెల్లో అనేకమంది దిగ్గజ నటీనటులు భాగమయ్యారు. అయితే ఈ అందరిలోనూ పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఫ్యాక్టర్ మాత్రం ఈ చిత్రానికి బాగా ప్లస్ అయ్యిందని చెప్పాలి. ప్రస్తుతం సినిమా మంచి బుకింగ్స్ బుక్‌మై షోలో చూస్తుంది అంటే అందులో సింహభాగం ప్రభాస్‌కి కూడా చెందుతుంది అని చెప్పడంలో సందేహం లేదు. కేవలం తన ప్రెజెన్స్‌కే ఇలా ఉంటే.. తాను నేరుగా ప్రమోషన్స్‌లోకి దిగివుంటే ఇంకా బెటర్‌గా కన్నప్ప బుకింగ్స్ ఉండేవని అంటున్నారు. ఇక ఈ భారీ చిత్రానికి స్టీఫెన్ దేవస్సి సంగీతం అందించగా మంచు మోహన్‌బాబు సినిమాకి నిర్మాణం వహించారు.





## డ్రగ్స్ తీసుకుంటే.. బహిష్కరిస్తాం

తెలంగాణను డ్రగ్స్‌లేని రాష్ట్రంగా మార్చడానికి అందరూ కృషి చేయాలని ఎఫ్డీసీ ఛైర్మన్, సినీ నిర్మాత దిల్ రాజు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు."ఈ మధ్యే మలయాళ చిత్ర పరిశ్రమలో ఓ నిర్ణయం తీసుకున్నారు. అక్కడ ఎవరైనా డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధరణ అయితే, ఇండస్ట్రీనుంచి బహిష్కరిస్తారు. అలాగే తెలంగాణ ఎఫ్‌డీసీ (ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్), తెలుగు చిత్ర పరిశ్రమ తరపున కోరుకునేది ఒక్కటే. అలాంటిది ఇక్కడ జరిగిందని తెలిస్తే, వారిని ఇండస్ట్రీలో అడుగు పెట్టకుండా నిషేధించాలి. అప్పుడే సమాజానికి సందేశం వెళ్తుంది. ఎఫ్‌డీసీ తరపున చిత్ర పరిశ్రమ పెద్దలతో మాట్లాడి తెలుగు సినిమాలోనూ పాటించేలా చేస్తాం. ఇది మన కర్తవ్యం. డ్రగ్స్‌లేని రాష్ట్రంగా మార్చడానికి మనమంతా ప్రతిజ్ఞ చేయాలి" అని దిల్ రాజు అన్నారు.

## బిచ్చగాడు-3ని డైరెక్ట్ చేస్తున్నా

విజయ్ ఆంటోనీ ప్రధానపాత్రలో తెరకెక్కిన చిత్రం 'మార్గన్'. ది బ్లాక్ డెవిల్ అనేది ఉపశీర్షిక. క్రైమ్ థ్రిల్లర్‌గా లియో జాన్‌పాల్ తెరకెక్కించారు. జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో నటీనటులతోపాటు నిర్మాత సురేశ్‌బాబు పాల్గొన్నారు. మంచి కంటెంట్ ఉన్న సినిమాను తెలుగులో రిలీజ్ చేయడం ఆనందంగా ఉందన్నారు. తమిళంలోకంటే తెలుగులో ఈ సినిమా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందన్నారు విజయ్ ఆంటోనీ. ఈ సినిమాకు తాను సంగీత దర్శకుడిగానూ వర్క్ చేసినట్టు చెప్పారు. ఇందులో అండర్ వాటర్ సీక్వెన్స్‌లు అందరినీ ఆశ్చర్యపరుస్తాయని టీమ్ పేర్కొంది. ది బ్లాక్ డెవిల్ అంటే ఏంటి? అన్న ప్రశ్నకు.. అది సినిమాలో సస్పెన్స్. థియేటర్‌లో చూసి తెలుసుకోవాలి అని సమాధానమిచ్చారు. సినిమాకు సంబంధించిన ప్రతి పనిలోనూ భాగమవుతానని, తన పాత్ర గురించి క్షుణ్ణంగా తెలుసుకుని.. ప్రేక్షకుల దృష్టి కోణంలో ఆలోచిస్తానని విజయ్ ఆంటోనీ స్పష్టం చేశారు. తన దర్శకత్వంలో మళ్లీ సినిమా వస్తుందని



చెబుతూనే.. 'బిచ్చగాడు 3'ని డైరెక్ట్ చేస్తున్నానని, 2027లో ఇది ప్రేక్షకుల రానుందని అన్నారు.

## పిచ్చెక్కించే ఐటెమ్ సాంగ్ ఉందట



గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ హీరోగా జాన్వీకపూర్ హీరోయిన్‌గా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న మాస్ యాక్షన్ చిత్రమే "పెద్ది". భారీ అంచనాలు సెట్ చేసుకున్న సినిమా కోసం ఆడియెన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తుండగా.. సినిమా షూటింగ్ శరవేగంగా పూర్తి చేసుకుంటుంది. మేకర్స్ రీసెంట్‌గానే ఒక క్రేజీ యాక్షన్ ఎపిసోడ్‌ని కంప్లీట్ చేశారు. ఇప్పుడు కొత్త రూమర్ వినిపిస్తుంది. రామ్‌చరణ్ కెరీర్‌లో భారీగా బిజినెస్ అయిన సినిమాల్లో రంగస్థలం ఒకటి. ఆ సినిమాలో ఐటెం సాంగ్‌లాంటి మాస్ నెంబర్ షూట్ కూడా ఇపుడు కంప్లీట్ చేసినట్టు రూమర్స్ వినిపిస్తున్నాయి. కేవలం కొన్ని రోజులు క్రితమే ఫైట్ సీన్, ఇప్పుడు ఐటెం సాంగ్‌ని కంప్లీట్ చేసేసారంటే కొంచెం ఆలోచించాల్సిందే. ఇక ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించగా వృద్ధి సినిమాస్ నిర్మిస్తోంది. అలాగే వచ్చే ఏడాది ఈ చిత్రం గ్రాండ్‌గా మార్చ్ 27న విడుదల కాబోతుంది.

## నా లైఫ్‌లోకి ఇంకా లవ్ రాలేదు

నటుడు విజయ్ వర్మ, 'దంగల్ బ్యూటీ ఫాతిమా సనా షేక్ డేటింగ్‌లో ఉన్నారంటూ గత కొన్ని రోజులనుంచి వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. దీనిపై తాజాగా ఫాతిమా పరోక్షంగా స్పందించారు. తాను ఇంకా సరైన భాగస్వామిని పొందలేదని, సింగిల్‌గానే ఉన్నట్లు చెప్పారు. ఆర్.మాధవన్, ఫాతిమా సనా షేక్ నటించిన చిత్రం 'ఆప్ జైసా కోయి'. వివేక్ సోని దర్శకత్వంలో ప్రేమకథగా రూపొందింది. ఈ సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమం ఇటీవల ముంబయిలో జరిగింది. ఇందులో పాల్గొన్న ఆమె ప్రేమ, రొమాన్స్ గురించి తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. "ఒకరినొకరు గౌరవించుకోవడం.. ఇష్టాయిష్టాలను పంచుకోవడంలోనే నిజమైన ప్రేమ దాగి ఉంటుంది. అదేవిధంగా కొన్ని విషయాల్లో సర్దుకుపోవాల్సి ఉంటుంది. అలా చేసినప్పుడే బంధాలనేవి సజావుగా సాగుతాయి" అని ఆమె చెప్పారు. దీనిపై ఓ విలేకరి స్పందిస్తూ.. "వ్యక్తిగత జీవితంలో మీ భాగస్వామిని కనుగొన్నారా?" అని ప్రశ్నించగా.. "ఇంకా అలాంటి వ్యక్తి నా జీవితంలోకి రాలేదు. నిజం చెప్పాలంటే, మన ఇష్టాలను అర్థం చేసుకొని మనకు గౌరవం ఇచ్చేవారు కేవలం సినిమాల్లోనే ఉంటారు" అని ఆమె బదులిచ్చారు. 'ఆప్ జైసా కోయి' సినిమా కోసం వర్క్ చేయడంపై



మాట్లాడుతూ.. "ఇదొక విభిన్నమైన ప్రేమకథా చిత్రం. దర్శకుడు చెప్పిన కథ నచ్చడంతో వెంటనే ఓకే చెప్పేశా. ఇలాంటి పాత్రను నేను ఎప్పుడూ పోషించలేదు. నా పాత్రలో ఎన్నో కోణాలుంటాయి. మాధవన్‌లాంటి గొప్ప నటుడితో స్క్రీన్ షేర్ చేసుకునే అవకాశం వస్తే ఎవరు మాత్రం అంగీకరించరు" అని బదులిచ్చారు. నెట్‌ఫ్లిక్స్ వేదికగా జులై 11న ఇది విడుదల కానుంది.

హైదరాబాద్‌కు చెందిన విజయ్ వర్మ ప్రస్తుతం బాలీవుడ్‌లో నటుడిగా రాణిస్తున్నారు. తమన్నాతో బ్రేకప్ తరువాత –'ఉల్ జలూల్ ఇష్క్' నటి ఫాతిమా సనా షేక్‌తో డేటింగ్‌లో ఉన్నాడంటూ కొన్ని రోజులనుంచి వినిపిస్తోంది. వీరిద్దరూ కలిసి ఓ రెస్టారెంట్ వద్ద కనిపించడంతో ఈ వార్తలు తెరపైకి వచ్చాయి.

## ఆ వ్యాఖ్యలు నేను చేయలేదు



పురుషులు ఎలాంటి మహిళలను వివాహం చేసుకోవాలనే దానిపై నటి ప్రియాంకా చోప్రా కీలక వ్యాఖ్యలు చేసినట్టు గత కొన్నిరోజుల నుంచి ప్రచారం జరుగుతోంది. సోషల్మీడియాలో వైరల్‌గా మారిన ఈ వ్యాఖ్యలను ఉద్దేశించి తాజాగా ఆమె స్పష్టతనిచ్చారు. ఆ వ్యాఖ్యలు తాను చేయలేదన్నారు. ఆన్‌లైన్ యుగంలో ఇలాంటి తప్పుడు స్టేట్మెంట్స్ వైరల్ కావడం సర్వసాధారణమన్నారు. ఆ బోల్డ్ కామెంట్స్‌కు సంబంధించిన స్క్రీన్ షాట్‌ను ఇన్‌స్టా వేదికగా షేర్ చేశారు ప్రియాంక.. "ఇలాంటి కామెంట్స్ నేను చేయలేదు. ఈవిధంగా నేను ఎక్కడా మాట్లాడలేదు. ఇది సోషల్మీడియాలో సృష్టించిన కథనమే. ఇతరుల దృష్టిని ఆకర్షించి వైరల్ కావడం కోసం ఇలాంటి అసత్య వార్తలను సృష్టించడం ఇప్పుడు సులువైంది. ఇలాంటి వార్తలను నమ్మే ముందు దయచేసి ఒక్కసారి క్రాస్ చెక్ చేసుకోండి. ఆన్‌లైన్‌లో వచ్చే ప్రతి వార్తా నమ్మొద్దు" అని కోరారు. కొంతకాలం క్రితం ప్రియాంక పేరుతో ఓ వార్త నెట్టింట వైరలైంది. పురుషులు ఎలాంటి మహిళలను వివాహం చేసుకోవాలనే విషయంపై ఆమె మాట్లాడారనేది అందులోని సారాంశం. 'వర్జినిటీ ఉన్న అమ్మాయిని కాదు మంచి గుణాలున్న మహిళను వివాహం చేసుకోండి. ఎందుకంటే వర్జినిటీ అనేది ఒక్క రాత్రితో పోతుంది. కానీ, సభ్యత, సంస్కారం జీవితాంతం ఉంటాయి' అంటూ నటి వ్యాఖ్యానించినట్టు అందులో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు అంతటా చర్చకు దారి తీశాయి.

## లెనిన్ ప్రాజెక్టునుంచి తప్పుకున్న శ్రీలీల

అక్కినేని అఖిల్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం 'లెనిన్'. 'వినరో భాగ్యము విష్ణుకథ' ఫేమ్ మురళీకిశోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్నారు. అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. ఇందులో శ్రీలీలను కథానాయికగా ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈమేరకు అఖిల్– శ్రీలీలపై చిత్రీకరించిన 'లెనిన్' గ్లింప్స్‌ను కూడా చిత్రబృందం ఇప్పటికే విడుదల చేసింది.

తాజా సమాచారం ప్రకారం.. ఈ సినిమానుంచి శ్రీలీల పక్కకు జరిగినట్టు తెలుస్తోంది. వరుస సినిమాలతో బిజీగా ఉండటంవల్ల ప్రాజెక్టుకు ఆమె డేట్స్ సర్దుబాటు చేయలేకపోయారట. దీంతో ఆమె ఈ సినిమానుంచి వైదొలగారని టాక్.

ఈ నేపథ్యంలోనే చిత్రబృందం మరో కథానాయిక కోసం గాలింపు మొదలు పెట్టిందని సమాచారం. నటి భాగ్యశ్రీ బోర్సేను హీరోయిన్‌గా తీసుకోవాలని భావిస్తుందని వార్తలు వస్తున్నాయి. దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. 'మిస్టర్ బచ్చన్'తో కథానాయికగా ఎంట్రీ ఇచ్చింది భాగ్యశ్రీ బోర్సే. ప్రస్తుతం ఆమె 'కింగ్డమ్'తోపాటు రామ్ పోతినేనితో ఒక సినిమా చేస్తున్నారు.